
ఆదివారం 8 మార్చి 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## మహిళలు దేశ ప్రగతికి నిర్దేశకులు

- వివరాలు 5 లో.



# మగువలు! మహారాణులు!!

- మహిళా సాధికారత దిశగా పరుగులు తీస్తోన్న ఏపీ
- లక్షమంది పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దిన కూటమి
- ఈ ఏడాది 5 లక్షలమందిని తీర్చిదిద్దాలన్న కొత్త సంకల్పం
- 50 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని చేరిన 'స్త్రీ శక్తి'
- అమరావతి పరేడ్‌గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- సంక్షేమం, అభివృద్ధి ప్రతిబింబించేలా కార్యక్రమాల నిర్వహణ
- సీఎం చంద్రబాబు సమక్షంలో వైభవోపేతంగా ఉమెన్స్ డే
- డ్వాక్రా ఉత్పత్తుల బ్రాండ్ పేరు, లోగో ఆవిష్కరించనున్న సీఎం
- వివిధ రంగాల్లో ప్రతిభా సాధకులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

3

అమరావతి (చైతన్య రథం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సాహంతో నిర్వహించనుంది. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాజధానిలోని అమరావతి పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవుతారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వివిధ రంగాల్లో సక్సెస్ అయిన మహిళలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించనున్నారు. 20 నెలల కూటమి పాలనలో మహిళా సంక్షేమం, అభివృద్ధి, సాధికారతను వివరించేలా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది.

## భారత్.. అవకాశాల గని

- వలసల నుంచి త్వరలోనే రివర్స్ మైగ్రేషన్
- డేంజర్‌బెల్స్‌ను ఊహించే పాపులేషన్ మేనేజ్మెంట్
- ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్-2026లో సీఎం చంద్రబాబు



అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర కీలకం. ప్రపంచంలో ప్రతిచోటా భారతీయులు కనిపిస్తారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ రంగాల్లో సంస్కరణల్ని అందిపుచ్చుకోవటంవల్లే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. భారతీయ ఐటీ పరిజ్ఞానం.. అందులోని డిప్లమసీ, ఫ్లెక్సిబిలిటీ ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గతంలో సిలికాన్ వ్యాలీలాంటి చోటుకు భారత్‌నుంచి మేధోవలస జరిగేది. చూస్తుండండి.. అతిత్వరలో రివర్స్ మైగ్రేషన్ మొదలవుతుంది. నైపుణ్యం, వనరులున్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తిదిశగా భారత్ దూసుకెళ్తోంది. భవిష్యత్తులో అనేక దేశాలకు మనమే విద్యుత్ ఎగుమతి చేస్తాం.

- సీఎం చంద్రబాబు నాయుడు

2

## నేటితరం హైటెక్.. రాబోయేతరం ఏఐ-క్వాంటమ్

- అమరావతి చరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం
- రాష్ట్ర ఆధునిక సాంకేతిక ప్రగతికి ఒక డిజిటల్ సంతకం
- భవిష్యత్తును ముందే చదివిన దార్శనికుడు చంద్రబాబు
- క్వాంటమ్ వ్యాలీతో సాంకేతిక యుగానికి దిశానిర్దేశం
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

5



## మమత తీరుపై రాష్ట్రపతి అసహనం

VII

### రాజ్యాంగ సంస్థల పవిత్రత కాపాడుకోవడం మన విధి

- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ వైఖరి బాధ కలిగించేదే: సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పర్యటనలో చోటుచేసుకున్న పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రవిచారం వ్యక్తంచేశారు. 'రాజ్యాంగ సంస్థల పవిత్రతను కాపాడుకోవడం మన విధి' అని వ్యాఖ్యానించారు. ఈమేరకు శనివారం రాత్రి ట్వీట్ చేస్తూ.."రాష్ట్రపతి పదవిని అవమానించేలా బెంగాల్ ప్రభుత్వం వ్యవహరించడం బాధకలిగించింది. ఈ ఘటన నిజంగా దురదృష్టకరం. ఏ ప్రభుత్వమైనా రాష్ట్రపతిపట్ల అత్యంత గౌరవ మర్యాదలతో మెలగాల్సి ఉంది. రాజ్యాంగ సంస్థలు రాజకీయాలకు అతీతంగా ఉంటాయి. వాటి పవిత్రతను కాపాడుకోవడం మన సమష్టి విధి" అని పేర్కొన్నారు.

## 16న పొట్టి శ్రీరాముల విగ్రహావిష్కరణ

- 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం
- బీసీ సంక్షేమ మంత్రి సవిత
- అమరజీవి స్మృతి వనం పనుల పరిశీలన

9





### పొగాకు కొనుగోలుకు ముహూర్తం ఖరారు

- రాష్ట్రంలో రెండు విడతలుగా వేలం
- 25న తొలి దశ ప్రారంభం
- వచ్చే నెల 9న రెండో విడత

8

## నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు

- మెకనైజ్డ్ కిచెన్లతో పరిశుభ్ర పోషకాహారం
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి
- సింగరాయకొండ గురుకులం ఆకస్మిక తనిఖీ



8

# భారత్.. అవకాశాల గని

- వలసల నుంచి త్వరలోనే రివర్స్ మైగ్రేషన్
- డేంజర్‌బెల్స్‌ను ఊహించే పాపులేషన్ మేనేజ్మెంట్
- ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్-2026లో సీఎం చంద్రబాబు







ఢిల్లీ (చైతన్య రథం): అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా భారతీయులు కనిపిస్తారని స్పష్టం చేశారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్‌లాంటి సంస్కరణల్ని మొదటగా అందిపుచ్చుకోవటంవల్లే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని సీఎం వివరించారు. ఢిల్లీలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ– అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైసినా డైలాగ్ సదస్సులో 'సాంకేతికత –సుపరిపాలన – భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు మాట్లాడారు. సహకార సమాఖ్య దేశంగా కేంద్రంతో, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని సీఎం వివరించారు. ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందేనని.. డిప్లొమసి, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో వారికి మంచి పేరుందని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో సిలికాన్ వ్యాలీలాంటి చోటుకు భారత్‌నుంచి మేధో వలస జరిగిందని, త్వరలో రివర్స్ మైగ్రేషన్ మొదలవుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. నైపుణ్యం, వనరులున్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 60 శాతంమేర జీసీసీలు భారత్‌కు వచ్చాయన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిదిశగా భారత్ దూసుకెళ్తోందన్నారు. భవిష్యత్తులో అనేక దేశాలకు విద్యుత్‌ను భారత్ ఎగుమతి చేస్తుందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

## అప్పుడు కుటుంబ నియంత్రణ - ఇప్పుడు జనాభా నిర్వహణ

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వృద్ధులసంఖ్య వేగంగా పెరుగుతోందని.. ఆ ప్రమాదాన్ని గుర్తించి ముందుగానే జాగ్రత్త పడుతున్నామని సీఎం వివరించారు. భారత్‌లోని దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న 1.5 ఫెర్టిలిటీ రేటును 2.1గా తీసుకెళ్లేందుకు పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని తీసుకువచ్చామని సీఎం వెల్లడించారు. ప్రజాప్రతినిధిగా 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసి.. ఇప్పుడు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి చర్చిస్తున్నామని అన్నారు. ఇద్దరు అంతకంటే ఎక్కువమంది పిల్లలుండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇద్దరుకంటే ఎక్కువ మంది పిల్లలున్న వారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఏజింగ్ సమస్యను ఎదుర్కొంటున్న దేశాలు జనాభా నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయం, నెల వారీగా రూ.వెయ్యి అందించాలని నిర్ణయించామని చెప్పారు. చైల్డ్ కేర్ లీవ్‌లాంటి ప్రోత్సాహకాలు ఆలోచిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో గ్లోబల్ కమ్యూనిటీకి సేవలు అందించే సామర్థ్యం భారత్‌కు మాత్రమే ఉందన్నారు. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమని సీఎం స్పష్టం చేశారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ఇప్పుడు జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గతంలో ఉన్న పెద్ద కుటుంబాలు దేశానికి పెద్ద ఆస్తి అని.. ప్రస్తుతం అవి మైక్రో ఫ్యామిలీలుగా మారాయన్నారు. ఈ విషయంలో ప్రజల దృష్టి కోణం మార్చాలన్న ప్రయత్నంలో ఉన్నామని ముఖ్యమంత్రి వివరించారు.

## అమరావతిలో గ్లోబల్ లీడర్షిప్ సెంటర్

విభిన్నంగా ఆలోచన చేసే వారికోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నామని.. డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీలను కూడా నిర్మిస్తున్నామన్నారు. సమీప భవిష్యత్తులో ఆరోగ్యరంగంలో పెనుమార్పులు రానున్నాయని.. గతంలో ఊహగానే ఉన్న డ్రోన్ అంబులెన్సులు కూడా రియాలిటీలోకి వచ్చేశాయన్నారు. ఏఐ డేటా సెంటర్లతో ఏపీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్‌గా ఏపీ తయారవుతుందన్నారు. మెరుగైన సదుపాయాలతో వ్యాపార అనుకూల ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దామని.. పెట్టుబడులతో వస్తే జాప్యం లేకుండా అనుమతులు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అమరావతిలో గ్లోబల్ లీడర్షిప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని సీఎం వివరించారు. కార్యక్రమానికి కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ సహా 110 దేశాలనుంచి 2700 మందికిపైగా ప్రతినిధులు, మేధావులు, నిపుణులు, వ్యూహకర్తలు హాజరయ్యారు. 2016నుంచి జరుగుతున్న ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్ సదస్సుకు తొలిసారిగా ఓ రాష్ట్ర ముఖ్యమంత్రికి నిర్వాహకులు ఆహ్వానం పలికారు. వారి ఆహ్వానంమేరకు సీఎం చంద్రబాబు ఈ రైసినా డైలాగ్‌కు హాజరై తన అభిప్రాయాలను వివరించారు.



# మీ వృత్తి నైపుణ్యం... తెగువ భేష్!

- హైరిస్క్ ఆపరేషన్‌తో తల్లి ప్రాణం కాపాడాని ప్రభుత్వాసుపత్రి వైద్యులు
- సాహసోపేతంగా వ్యవహరించిన డాక్టర్లకు ప్రభుత్వం ప్రశంసలు

రాజంపేట (చైతన్య రథం): హైరిస్క్ గర్భిణి కేసును సాహసోపేతంగా, విజయవంతంగా నిర్వహించి ఆమె ప్రాణాల్ని కాపాడిన రాజంపేట ఏరియా ఆసుపత్రి వైద్యుల బృందాన్ని సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎంవి చక్రధర్‌బాబు ప్రశంసించారు. హైరిస్క్ ఆపరేషన్ వార్తను తెలుసుకున్న వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనమేరకు డాక్టర్లకు చక్రధర్ బాబు ప్రశంసిస్తూ శనివారంనాడు రాశారు. పేరుపేరునా వైద్యుల్ని, ఇతర సిబ్బందిని లేఖలో అభినందించారు. ఆపరేషన్ సమయంలో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది చూపిన వృత్తి నైపుణ్యం, చొరవ, నిబద్ధత, తెగువను కొనియాడారు.


ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పివియన్ రాజు, గైనకాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ అనిల్‌కుమార్ బృందంలోని డాక్టర్ అబు బకర్, డాక్టర్ గిరి, నర్సులు సరళ, శ్రీలక్ష్మి, అసిస్టెంట్ విజయ్‌లను అభినందించారు. గర్భిణి శంకరమ్మను తిరుపతిలోని పలు కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లగా చికిత్సకు యాజమాన్యాలు నిరాకరించాయి. ఈమె గర్భసంచిలో పిండం చనిపోయినందున ఆపరేషన్ చేసి రిస్క్ తీసుకోలేమని, తల్లి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని చెప్పి పంపించేశారు. చివరికి అన్నమయ్య జిల్లా రాజంపేట ఏరియా ఆసుపత్రికి ఈమెను శుక్రవారం తీసుకురాగా ఆపరేషన్ నిర్వహించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో అత్యంత ప్రతిభ, నైపుణ్యంగల స్పెషలిస్ట్ డాక్టర్లున్నారని, ఇలాంటి క్లిష్టమైన కేసుల్ని నిబద్ధతతో నిర్వహించడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణపట్ల డాక్టర్లు పడ్డ తపన అత్యంత ప్రశంసించదగ్గ విషయమని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వాసుపత్రులపట్ల ప్రజలకు గల విశ్వాసం మరింత బలపడుతుందని చక్రధర్ బాబు తన లేఖలో ఉటంకించారు.

ప్రజారోగ్య సంరక్షణలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమైందని, వైద్యుల సేవల్ని ప్రభుత్వం గుర్తిస్తోందని పేర్కొన్నారు. రాజంపేట ఏరియా ఆసుపత్రి డాక్టర్లు, ఇతర సిబ్బంది అంకితభావం, చిత్తశుద్ధిని స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్రంలోని సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఆసుపత్రుల్లో సేవలు మరింత బలపడేలా సేవలందించాలని చక్రధర్ బాబు ఆకాంక్షించారు.

# మగువలు! మహారాణులు!!

- మహిళా సాధికారత దిశగా పరుగులు తీస్తోన్న ఏపీ
- లక్షమంది పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దిన కూటమి
- ఈ ఏడాది 5 లక్షలమందిని తీర్చిదిద్దాలన్న కొత్త సంకల్పం
- 50 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని చేరిన 'స్త్రీ శక్తి'
- అమరావతి పరేడ్‌గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- సంక్షేమం, అభివృద్ధి ప్రతిబింబించేలా కార్యక్రమాల నిర్వహణ
- సీఎం చంద్రబాబు సమక్షంలో వైభవోపేతంగా ఉమెన్స్ డే
- డ్వాక్రా ఉత్పత్తుల బ్రాండ్ పేరు, లోగో ఆవిష్కరించున్న సీఎం
- వివిధ రంగాల్లో ప్రతిభా సాధకులతో ముఖ్యమంత్రి ముఖాముఖి



అమరావతి (చైతన్య రథం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సాహంతో నిర్వహించనుంది. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాజధానిలోని అమరావతి పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవుతారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వివిధ రంగాల్లో సక్సెస్ అయిన మహిళలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించనున్నారు. 20 నెలల కూటమి పాలనలో మహిళా సంక్షేమం, అభివృద్ధి, సాధికారతను వివరించేలా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. రాష్ట్రంలో మహిళల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. మహిళలు, చిన్నారుల భద్రత మొదలుకుని వారి ఆర్థిక స్వావలంబన వరకు చాలా కార్యక్రమాలను అమలు చేసింది. రాష్ట్రంలో కీలకమైన పథకాల్లో మహిళలను భాగస్వాములను చేసింది. మహిళలకే ప్రాధాన్యత ఇచ్చింది. సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, స్త్రీశక్తివంటి పథకాలు మహిళ కోసం రూపొందించినవే. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేస్తే... ఆ పథకాల అమల్లో స్త్రీశక్తి పథకం సూపర్ సక్సెస్ అయింది. ఇప్పటివరకు 50 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని ఈ పథకం చేరుకుంది.


### సంక్షేమంలోనే కాదు... అభివృద్ధిలోనూ మహిళలకు భాగస్వామ్యం

మహిళలకు వివిధ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు... రాష్ట్రాభివృద్ధిలోనూ కూటమి ప్రభుత్వం మహిళలను కీలక భాగస్వాములు చేసింది. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అతి కీలక నిర్ణయాల్లో వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ప్రధానం. ఈ విధానంలోనూ మహిళలకు పెద్దపీట వేసింది కూటమి ప్రభుత్వం. లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని గత మహిళా దినోత్సవాన రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏడాది గడిచేసరికి లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తల లక్ష్యాన్ని చేరుకుంది. ఇప్పుడు తాజాగా మరో 5 లక్షలమంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోనుంది. ఇవే అంశాలను సీఎం చంద్రబాబు సభలో ప్రముఖంగా ప్రస్తావించనున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో మహిళల్లో సాధికారత తెచ్చిన ముఖ్యమంత్రి... ఇప్పుడు డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయస్థాయి బ్రాండింగ్ కల్పించేలా గత కొంతకాలంగా కసరత్తు చేస్తున్నారు. దీంట్లో భాగంగా డ్వాక్రా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు స్వయం పేరుతో బ్రాండింగ్ చేయాలని నిర్ణయించారు. అలాగే స్వయం లోగోను తీర్చిదిద్దారు. స్వయం బ్రాండ్ పేరు, లోగోలను ముఖ్యమంత్రి మహిళా దినోత్సవం సందర్భంగా ఆవిష్కరించనున్నారు.

### కార్యక్రమం జరిగేదిలా...

ఆదివారం ఉదయం 11:30 గంటలకు అమరావతి పరేడ్ గ్రౌండ్స్ చేరుకుని.. ముఖ్యమంత్రి సుమారు నాలుగు గంటలపాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. జ్యోతి ప్రజ్వలన, మా తెలుగుతల్లి గీతాలాపనతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రత్యేక వీడియోలతోపాటు, లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తల సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాలపై రూపొందించిన ప్రజెంటేషన్లను సీఎం చంద్రబాబు వీక్షిస్తారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కులను ముఖ్యమంత్రి పంపిణీ చేస్తారు. కీలకోపన్యాసం అనంతరం వివిధ శాఖలకు చెందిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శిస్తారు. చిరుధాన్యాల బండ్లు, ఎగ్ కార్ట్స్, ఫామ్ బజార్ వ్యాన్లువంటి వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత సీఎం చంద్రబాబు సమక్షంలో 36 ఎంవోయూలపై ఉన్నతాధికారులు సంతకాలు చేయనున్నారు. ఈక్రమంలో 5 కొత్త పథకాలను ప్రారంభించి, 7 అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన ఫలకాలను సీఎం చంద్రబాబు ఆవిష్కరిస్తారు. తర్వాత 50మంది మహిళా పారిశ్రామికవేత్తలు, ఆర్టీసీ మహిళా డ్రైవర్లు సహా వివిధరంగాల్లో సక్సెస్ అయిన మహిళా ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి హోంమంత్రి అనిత, మహిళా సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, బీసీ సంక్షేమ మంత్రి ఎస్ సవిత సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొనున్నారు.

# ఆ పొరబాటు రిపీట్ కాదు!



- సైబరాబాద్‌లో భూములపై పెట్టుబడులు సూచించిన చంద్రబాబు
- సీఎం సలహా పాటించక మంచి అవకాశం కోల్పోయాం...
- అమరావతి విషయంలో ఆ పొరబాటు రిపీట్ చేయను
- చంద్రబాబుతో భేటీలో డీఎల్ఎఫ్ చైర్మన్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఢిల్లీ (చైతన్య రథం): 30 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సలహా పాటించక హైదరాబాద్‌లో ఓ కీలక పెట్టుబడి అవకాశాన్ని, గొప్ప ఆదాయాన్ని కోల్పోయామని ప్రముఖ రియల్ ఎస్టేట్, హౌసింగ్ సంస్థ డీఎల్ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో భూములపై పెట్టుబడులు పెట్టాల్సిందిగా చంద్రబాబు సూచించినా... భవిష్యత్‌ను సరిగ్గా అంచనా వేయలేక పెట్టుబడులు పెట్టలేదని రాజీవ్ సింగ్ అన్నారు. ఢిల్లీలోని రైసినా డైలాగ్ వేదికవద్ద ముఖ్యమంత్రి చంద్రబాబుతో డీఎల్ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్ కొద్దిసేపు భేటీ అయ్యారు. వారి భేటీలో నాటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. సీఎం చంద్రబాబు దార్శనికత, సైబరాబాద్ నిర్మాణంతో రాయదుర్గం ప్రాంతం హైదరాబాద్‌లో ప్రముఖ ఐటీ కేంద్రంగా ఎదిగిందన్నారు. నాడు భూములపై పెట్టుబడి పెట్టకుండా అవకాశం కోల్పోయామని... ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మితమవుతున్న రాజధాని అమరావతిలో ఆ తప్పు పునరావృతం కానివ్వనన్నారు. అమరావతిలో పెట్టుబడులకు రాజీవ్‌సింగ్ ఆసక్తి ప్రదర్శించారు. త్వరలో అమరావతిని సందర్శించి పెట్టుబడి అవకాశాలను పరిశీలిస్తానని ముఖ్యమంత్రికి తెలిపారు. అమరావతితోపాటు విశాఖపట్నం అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని డీఎల్ఎఫ్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ రెండు నగరాలను అభివృద్ధి చేయటమే తమ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ పాలసీలను, పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వివరించారు.

## మౌనమే.. జగన్ సమాధానమా?

అమరావతి(చైతన్య రథం): గత ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం వేల కుటుంబాలను నాశనం చేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అక్రమ మద్యం ద్వారా జగన్ అనుచరుల జేబుల్లో రూ.వేల కోట్లు చేరాయని ఆరోపణలు వచ్చాయన్నారు. రూ.కోట్ల నగదు లావాదేవీలకు సంబంధించి ఈడీ ఆధారాలను బయటపెట్టినట్టు గుర్తు చేశారు. ఈ ఆరోపణలపై ఏపీ ప్రజలకు జగన్ సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. 'సమాధానం చెప్పలేక.. మౌనమే జగన్ సమాధానమా?' అని అన్నారు. ఇదేనా జగన్ 2019లో నిషేధం అమలు చేస్తానన్న హామీ వెనుక అసలు కథ అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు.



*ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడు, హీరో అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీష్ వివాహ వేడుకకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ కొల్లూరులోని ఐనా ఈవెంట్ స్పేస్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు అల్లు శిరీష్, నయనికలను ఆశీర్వదించారు.*

## సివిల్స్ ర్యాంకర్ సారోతుకు మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు

నిమ్మాడ (చైతన్య రథం): శ్రీకాకుళం జిల్లా సిగడాం మండలం నడిమివలస గ్రామానికి చెందిన సారోతు రాము సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 463వ ర్యాంకు సాధించడంపట్ల రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన రాము కష్టపడి చదివి సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టుదల, కృషివుంటే ఎలాంటి పరిస్థితులలోనైనా విజయాన్ని సాధించవచ్చని రాము నిరూపించాడన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో మంచి ర్యాంక్ సాధించడం శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ప్రతిభ, కృషి ఉంటే ఏ విజయాన్నైనా సాధించవచ్చని చెప్పడానికి సారోతు రాము మరో మంచి ఉదాహరణ అన్నారు. భవిష్యత్తులో మంచి అధికారిగా దేశానికి, రాష్ట్రానికి సేవలందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. అలాగే యువత అతని విజయాన్ని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నతస్థానాలను చేరుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.



# అమ్మకు ఆసరా... చెల్లెమ్మలకు భరోసా...

## చంద్రన్న చేయూతతో ఆర్థిక స్వావలంబన దిశగా మహిళాలోకం



*"యత్ర నార్యస్తు పూజ్యతే రమంతే తత్ర దేవతా"* –ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దైవత్వం వికసిస్తుందన్నది పురాణాల మాట. స్త్రీలను గౌరవించనిచోట చేసే ఏ పవిత్ర కార్యమైనా ఫలితమివ్వదు. మన భారతీయ సమాజంలో స్త్రీలకున్న ప్రత్యేక గౌరవం, స్థానం వేరు. మహిళా పురోగతితోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్మిన సిద్ధాంతం. కూటమి ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానం కూడా. అందుకే స్త్రీ అభ్యున్నతికి తోడ్పడే అనేక ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చంద్రబాబు తీసుకొస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో అన్న నందమూరి తారక రామారావు మొదలుకొని నేడు చంద్రబాబునాయుడి వరకు –స్త్రీల అభ్యున్నతికి పెద్దపీట వేసిన దృశ్యాలే కనిపిస్తాయి. మహిళల స్వావలంబనకు చేస్తోన్న కృషే అగుపిస్తుంది. స్త్రీ సంక్షేమంతోపాటు.. మహిళల ఆర్థిక స్వయంసమృద్ధికి డ్వాక్రా సంఘాల బలోపేతం, వడ్డీలేని రుణాలు.. తాజాగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోన్న విధానం.. ఇవన్నీ నవశకానికి నాంది పలికేవే!

### బడ్జెట్‌లో నారీశక్తికే సింహభాగం

చంద్రబాబునాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రిగావున్నా.. ఆ కాలం మహిళలకు స్వర్ణయుగం. ఇది కేవలం మాట కాదు. బడ్జెట్ కేటాయింపులు స్పష్టం చేస్తోన్న వాస్తవాలు. గత ప్రభుత్వాలు ఎన్నడూ కేటాయించని రీతిలో ఈసారి మహిళా సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యతా స్థానమిచ్చారు. మహిళా– శిశు సంక్షేమానికి రూ.4,582 కోట్లు కేటాయించారు. మహిళలకు ఉచిత బస్సు పథకానికి రూ.1,420 కోట్లు పద్దు పెట్టారు. మహిళలకు గౌరవంతోపాటు.. అంతకుమించిన భద్రతకు ప్రాధాన్యమిచ్చారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించారు. ఆరోగ్య భద్రతతోపాటు వంటింటి ఖర్చునూ తగ్గించారు. 'తల్లికి వందనం' పథకం కోసం రూ.9,668 కోట్లు వెచ్చించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.27,719 కోట్లు కేటాయించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆడబిడ్డ నిధి పథకాన్ని పీ–4 కిందికి తెచ్చారు. బడికి వెళ్లే ప్రతి బిడ్డడూ 'తల్లికి వందనం' ఇచ్చారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ద్వారా అక్షరాస్యతను పెంచి స్వర్ణాంధ్ర సాకారం దిశగా అడుగులేస్తున్నారు.



### కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారిత

మహిళా సంక్షేమం, ఆర్థిక స్వాతంత్ర్యం –ఇది కేవలం నినాదం కాదు. టీడీపీ ప్రభుత్వ సంకల్పం. స్వర్ణాంధ్ర విజన్–2047 లక్ష్యంగా పని చేస్తోన్న ప్రణాళికా విధానం. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది కూటమి. సున్నావడ్డీ రుణాల పరిమితిని రూ.5 లక్షలకు పెంచి, మహిళలకు పెట్టుబడి అవకాశాలు పెంచింది. మహిళలకు పెట్టుబడి రాయితీని 35నుంచి 45 శాతానికి పెంచి వ్యాపారరంగంలో ప్రత్యేక స్థానం కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీలేని రుణాలిచ్చి ఆర్థిక భరోసా కల్పించింది.

### మహిళా భద్రతకు ప్రాధాన్యత

మహిళల భద్రత విషయంలో కూటమి చిత్తశుద్ధి, నిబద్ధత ఎన్నదగింది. 'ఆడబిడ్డ జోలికొస్తే.. ఎంతటివాడికైనా అదే చివరి రోజు' అని సాక్షాత్తూ ముఖ్యమంత్రే హెచ్చరించారంటే –మహిళా భద్రతపై కూటమి ప్రభుత్వ విధానాన్ని అంచనా వేయడం కష్టం కాదు. తప్పు చేసినవాళ్లకు శిక్షలు తప్పవన్న హెచ్చరిక –మహిళా లోకానికి పెద్ద భరోసా. మదనపల్లెల్లో జరిగిన ఘటనల్లో నిందితులు శిక్షలకు భయపడి ఆత్మహత్య చేసుకున్నారంటే.. కూటమి పాలనలో చట్టాలు ఎంత కఠినంగా అమలవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. పాఠశాలలు, కళాశాలల్లో మహిళలకు ఆత్మరక్షణలో శిక్షణనిచ్చి "శక్తి వారియర్స్"ను తయారు చేస్తోంది ప్రభుత్వం. అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ అమలుచేసి మరింత గౌరవం పెంచింది. 'చంద్రబాబు మహిళా పక్షపాతి' అన్న ముద్ర పడటానికి కారణం –మహిళలపట్ల ఆయన చూపే ఆదరణే!

### అన్న ఎన్టీఆర్‌నుంచే మహిళాభ్యున్నతికి పెద్దపీట

మహిళలకు అగ్ర తాంబూలం ఇచ్చిన ఎన్టీఆర్.. మహిళాలోకం గుండెల్లో ఆరాధ్యుడయ్యాడు. మహిళల సంక్షేమం, అభివృద్ధితోనే సమాజాభివృద్ధి అని బలంగా నమ్మారు. అందుకు అనుగుణంగా ఆడపిల్లలకు తండ్రి ఆస్తిలో సమాన హక్కునిచ్చే చట్టం తెచ్చారు. ఇది దేశవ్యాప్తంగా మహిళల ఆస్తి హక్కులకు మార్గం సుగమం చేసింది. ఏపీలో మొదటి మహిళా విశ్వవిద్యాలయాన్ని తిరుపతిలో స్థాపించారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. మంత్రి మండలిలో మహిళలకు పెద్దపీట వేసి రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కల్పించారు. పేద మహిళలకు సబ్సిడీ రేటుతో చీరలు, వస్త్రాలు పంచిపెట్టారు. కిలో రూ.2 బియ్యం పథకాన్ని తీసుకొచ్చి పేదల ఆకలి తీర్చారు. గ్రామీణ మహిళల స్వయం సహాయక సమూహాలు ఏర్పాటు చేసి... ఆర్థిక స్వావలంబనకు శిక్షణ, రుణాలు, సబ్సిడీలు అందించారు. 'నీడ' పథకంకింద పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు (మహిళలకు ప్రాధాన్యత) ఇచ్చి వారికి ఆసరా కల్పించారు.

### రాజకీయాల్లో మహిళలకు పెద్దపీట

మహిళలు సమాజంలో గౌరవంగా బతకాలంటే –రాజకీయాల్లో రాణింపుతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ బలంగా నమ్ముతుంది. అందుకు తగినట్టుగా పార్టీలో అధికారికంగా మహిళా విభాగం ఏర్పాటు చేసింది. ఇది మహిళలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడానికి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మహిళలు పార్టీలో నాయకత్వ పాత్రలు, కార్యకర్తలుగా, నిర్ణయాధికారాలుగా పాల్గొనే అవకాశాలు కల్పిస్తోంది. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ పెంచడం టీడీపీ హయాంలోనే జరిగింది. లోక్‌సభ నియోజకవర్గస్థాయి అధ్యక్ష పదవుల్లో ఐదుగురు మహిళలకు అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ మొదటి మహిళ స్పీకర్‌గా కావలి ప్రతిభా భారతిని నియమించి మహిళలపట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు.

### మహిళాశక్తిపై చంద్రన్న దూరదృష్టి

మహిళా దినోత్సవం అనేది కేవలం వేడుక మాత్రమే కాదు... సమాజాభివృద్ధిలో మహిళల పాత్రను గుర్తు చేసుకునే సుదినం. మహిళలను కుటుంబ పరిమితుల్లో మాత్రమే కాకుండా ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములుగా చూడాలనే దూరదృష్టి కలిగిన నాయకుల్లో ప్రముఖుడు నారా చంద్రబాబునాయుడు. మహిళల సామర్థ్యాన్ని ముందుగానే గుర్తించి, వారిని ఆర్థికంగా బలపరిచే విధానాలను రూపొందించిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. గ్రామీణ మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆలోచించిన సమయంలో అది సాధారణ ఆలోచన కాదు.... సమాజాన్ని మార్చే దూరదృష్టి. ఆ ఆలోచనకు ప్రతిరూపమే డ్వాక్రా ఉద్యమం. ఒక రాష్ట్రంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు దేశవ్యాప్తంగా అమలవుతున్న మోడల్‌గా మారడం ఆయన నాయకత్వానికి నిదర్శనం.

### గ్రామీణ మహిళలకు ఆలంబన

మన పూర్వీకులు చెప్పిన "ఒక్కడి చేత తాటికాయ కొట్టలేం" అనే సామెతలో ఉన్న భావనను చంద్రబాబునాయుడు గ్రామీణాభివృద్ధిలో వినూత్నంగా ఉపయోగించారు. మహిళలు ఒక్కొక్కరుగా కాకుండా సమూహాలుగా కలిసి పనిచేస్తే పెద్ద మార్పు సాధ్యమవుతుందని విశ్వసించారు. అదే ఆలోచనతో డ్వాక్రా సంఘాలు ఏర్పడ్డాయి. సాధారణంగా పదిమంది మహిళలు కలిసి ఒక సమూహంగా ఏర్పడి చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఆ వ్యాపారాలు క్రమంగా ఎదిగి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తాయి. కొన్నిసార్లు రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రూపులు కలిసి పెద్దస్థాయిలో వ్యాపారాలు నిర్వహించే స్థాయికీ ఎదుగుతాయి. ఈ మార్పు బయటకు పెద్దగా కనిపించకపోయినా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఇది గొప్ప మార్పును తెచ్చింది. డ్వాక్రా ద్వారా అనేక మహిళలు చిన్న దుకాణాలు, ఉత్పత్తి యూనిట్లు, సేవా రంగ వ్యాపారాలు ప్రారంభించి తమ కుటుంబాల జీవన స్థితిని మార్చుకున్నారు. ఈ మార్పు కేవలం కుటుంబాలకే కాకుండా గ్రామాల ఆర్థిక వ్యవస్థకూ కొత్త బలాన్నిచ్చింది.

### సాధికారతకు ప్రాధాన్యం

సాధారణంగా రాజకీయ నాయకులు పథకాల తాయిలాలిచ్చి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తారు. కానీ చంద్రబాబునాయుడు ఆలోచన వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడం. మహిళలు ఏ పనిపై దృష్టిపెట్టినా దాన్ని బాధ్యతతో పూర్తి చేస్తారని ఆయన విశ్వాసం. పురుషాధిక్య సమాజంలో వ్యాపారాలను పురుషులే నిర్వహిస్తారని భావించిన సమయంలో, మహిళలు కూడా సమర్థంగా వ్యాపారాలను నడిపించగలరని ఆయన నమ్మారు. తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా మహిళల సంక్షేమం, సాధికారతకు చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూనే ఉన్నారు. డ్వాక్రా మహిళలకు పెరిగిన రుణ అవకాశాలు, తల్లులకు ఆర్థిక సహాయం, మహిళల స్వేచ్ఛకు దోహదపడే రవాణా సదుపాయాలువంటి చర్యలు మహిళల జీవితాల్లో కొత్త అవకాశాలను తెరిచాయి. అంగన్‌వాడీ కార్యకర్తలకు గౌరవప్రదమైన సహాయం, మహిళల పేరుపై గృహాల పంపిణీ, స్వయం ఉపాధి కార్యక్రమాలు... ఇవన్నీ మహిళలను ఆర్థికంగా బలపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. మహిళల అభివృద్ధి ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని చంద్రబాబు ఆచరణలో చూపించారు. డ్వాక్రా ఉద్యమం ద్వారా ప్రారంభమైన మహిళల సాధికారత ప్రయాణం నేడు లక్షలాది కుటుంబాల జీవితాలను మార్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవంవేళ మహిళాశక్తికి వందనం! దూరదృష్టి చంద్రన్న నాయకత్వానికి అభివందనం!

*– జలసూత్రం శాంతి*
***అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్***

# నేటి తరం హైటెక్.. రాబోయేతరం ఏఐ-క్వాంటమ్

## అమరావతి చరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- రాష్ట్ర ఆధునిక సాంకేతిక ప్రగతికి ఒక డిజిటల్ సంతకం
- భవిష్యత్తును ముందే చదివిన దార్శనికుడు చంద్రబాబు
- క్వాంటమ్ వ్యాలీతో సాంకేతిక యుగానికి దిశానిర్దేశం


అమరావతి(చైతన్యరథం): నేటి తరం హైటెక్ ప్రపంచంలో ఎదుగుతుండగా..రాబోయే తరం పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ ఆధారిత ప్రపంచంలో జీవించబో తోం దని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. భవి ష్యత్తును ముందుగానే అంచనా వేసి రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్న దూరదృష్టి కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబేనని పేర్కొన్నారు. ప్రపంచ చరిత్ర పుటలను తిరగేస్తే ఒక నగ్న సత్యం స్పష్టమవుతుంది.. కాలంతో పాటు అప్‌డేట్ కాని వారు చరిత్రలో కలిసిపోతారు.. మార్పును ముందుగానే పసిగట్టినవారే ప్రపంచా న్ని శాసిస్తారని వ్యాఖ్యానించారు. మానవ పరిణామక్రమంలో వ్యవసాయ విప్లవం నుంచి పారిశ్రామిక విప్లవం వరకు, అక్కడి నుంచి సమాచార సాంకేతిక యుగం వరకు ప్రతి కీలక దశలోనూ మార్పును ముందే గుర్తించి అందిపుచ్చుకున్న దేశాలే ప్రపంచ యవనికపై ఆధిపత్యాన్ని సాధించాయని గుర్తుచేశారు.

### క్వాంటమ్ విప్లవం దిశగా ప్రపంచం

ఇప్పుడిప్పుడే ప్రపంచం మరో చారిత్రక మలుపు వద్ద నిలిచిం దని, ఆ సరికొత్త విప్లవం పేరు క్వాంటమ్ కంప్యూటింగ్. ప్రస్తుతం ఈ సాంకేతికతలో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ, చైనాలోని హైనన్ ప్రావిన్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో అమరావతిని కేంద్రంగా చేసుకుని క్వాంటం వ్యాలీ నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం కేవలం ఒక అభి వృద్ధి ప్రాజెక్టు మాత్రమే కాదు. రాబోయే శతాబ్దపు సాంకేతిక పోటీలో భారత్‌ను అగ్రగామిగా నిలిపే సాహసోపేతమైన ముంద డుగని అభివర్ణించారు. నాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మా ణంతో ఐటీ విప్లవానికి పునాది వేసిన విజనరీ నాయకుడు చంద్రబాబేనని గుర్తుచేశారు. నేడు అదే దూరదృష్టితో క్వాంటమ్ వ్యాలీ ద్వారా భవిష్యత్తు ప్రపంచానికి దిశా నిర్దేశం చేస్తున్నారు. క్వాంటం వ్యాలీ రాష్ట్ర ఆధునిక సాంకేతిక ప్రగతికి ఒక డిజిటల్ సంతకం అని ఉద్ఘాటించారు.

### జాతీయ నాయకత్వం..గ్లోబల్ దిశలో అడుగు

అమరావతికి క్వాంటం వ్యాలీ రావడం వెనుక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసంకల్పం, ముఖ్యమంత్రి చంద్రబాబు దశాబ్దాల అనుభవం, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిబద్ధత, మంత్రి నారా లోకేష్ ఆధునిక వ్యూహం కలిసి పనిచేశాయి. 2025 జనవరిలో దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఐబీఎం, గూగుల్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలతో



మంత్రి నారా లోకేష్ జరిపిన ముందస్తు చర్చలే ఈ ప్రాజెక్టుకు బలమైన పునాది వేశాయని చెప్పారు. అమరావతిని కేవలం ఐటీ హబ్‌గా కాకుండా భవిష్యత్తు సాంకేతిక కేంద్రంగా ప్రపంచానికి పరిచయం చేయడంలో లోకేష్ పాత్ర కీలకం. చంద్రబాబు తన రాజకీయ చాతుర్యం, అనుభవంతో దీనికి జాతీయ స్థాయి ప్రాధాన్యతను తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎంవో నిరంతర పర్యవేక్షణలో వివిధ శాఖలను సమన్వయం చేస్తూ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం జరిగింది. ఐబీఎం వంటి సంస్థలతో ఒప్పందాలను ఖరారు చేయడంలో సీఎంవో కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

### అమరావతి చరిత్రలో కొత్త అధ్యాయం

దాని ఫలితంగానే ఫిబ్రవరి 7న అమరావతి చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. తుళ్లూరు మండలం ఉద్దండ రాయునిపాలెంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కలిసి శంకుస్థాపన చేయడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ క్వాంటమ్ పటం లో నిలిపే చరిత్రాత్మక ముందడుగు పడింది. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి అంతర్జాతీయ దిగ్గజాల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ కేంద్రం భారతదేశంలోనే మొట్టమొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌కు వేదిక కానుంది. ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తి చేసి డిసెంబర్‌లో కార్యరూపంలోకి తీసుకురావాలన్న లక్ష్యం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.

### యువతకు అంతర్జాతీయ అవకాశాలు

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కేవలం మౌలిక సదుపాయాలకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి హైఎండ్ ఉపాధి అవకాశాలు రానున్నాయి. సంప్రదాయ ఉద్యోగాల పరిధిని దాటి సరికొత్త అవకాశాలు సృష్టించడంతో మేధో వలసలు తగ్గి ప్రతిభ అంతా రాష్ట్రానికే సొంతమయ్యే బ్రెయిన్ గెయిన్ ప్రారంభమవుతుంది. ఇప్పటికే 54 వేల మంది విద్యార్థులు క్వాంటం శిక్షణలో పాల్గొనడం ఈ రంగంపై యువత ఆసక్తికి నిదర్శనం. క్వాంటం కంప్యూటింగ్ దిశగా రాష్ట్రం అడు గులు వేయడం ప్రారంభమైన కొద్దికాలంలోనే గన్నవరంలోని మేధా టవర్స్ అంతర్జాతీయ టెక్ సంస్థలకు కేంద్రంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతపై ఉన్న విశ్వాసంతో క్యూ క్లారిఫోయెన్స్, క్యూబీట్స్, సైబ్రానెక్స్, క్వాంటం ఏఐ గ్లోబల్, క్యూబి టెక్, క్వాన్ ఫ్యూయెన్స్ వంటి దాదాపు 30 అగ్రశ్రేణి సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. చంద్రబాబు ఒక కొత్త సాంకే తిక దిశలో అడుగు వేస్తే ప్రపంచం మొత్తం అటువైపే నడుస్తుం దనే నమ్మకానికి ఈ సంస్థల రాకే నిదర్శనం.

### క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవం

క్వాంటమ్ కంప్యూటింగ్ గణన ప్రక్రియలోనే ఒక అసాధారణ విప్లవం. సాధారణ కంప్యూటర్లు బిట్స్ ఆధారంగా పనిచేస్తే, క్వాంటమ్ కంప్యూటర్లు క్విబిట్స్ ద్వారా ఒకే సమయంలో 0, 1 రెండింటినీ ఉపయోగించి అద్భుత వేగాన్ని ప్రదర్శిస్తాయి. సాధార ణ కంప్యూటర్లకు శతాబ్దాల సమయం పట్టే సంక్లిష్ట సమస్యలను క్వాంటం కంప్యూటర్లు కేవలం నిమిషాల్లోనే పరిష్కరించగలవని చెప్పారు. కొత్త మందుల తయారీ నుంచి ఇంటర్నెట్ భద్రత వరకు అనేక రంగాల్లో ఈ సాంకేతికత విప్లవాత్మక మార్పులు తీసుకు రానుందని పేర్కొన్నారు.

### గ్లోబల్ గుర్తింపు-రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ

అందుకే అమరావతిలో నిర్మించే క్వాంటం వ్యాలీ రాష్ట్రాన్ని గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చనుంది. నాడు ఐటీతో రాష్ట్ర తలరాత మారినట్లే.. రేపు ఈ క్వాంటం వ్యాలీ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికే ఒక దిక్సూచిగా నిలబెట్టబోతోందని స్పష్టం చేశా రు. ఇది కేవలం టెక్నాలజీ మార్పు మాత్రమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని తెలిపారు. అధిక విలువ కలిగిన పరిశ్రమలు, పరిశోధన ఆధారిత పెట్టుబడులు రావడం వల్ల ఆదాయ వనరులు పెరిగి విజ్ఞానమే సంపదగా మారే ఆర్థిక వ్యవస్థకు పునాది పడుతుం దని పేర్కొన్నారు. 1998లో హైదరాబాద్ హైటెక్ సిటీకి శ్రీకారం చుట్టినప్పుడు వ్యక్తమైన సందేహాలను పటాపంచలు చేస్తూ ఆ నిర్ణయం ఒక తరాన్ని ఐటీ యుగంలోకి నడిపించిం దని గుర్తుచేశారు. సరిగ్గా అదే దూరదృష్టి నేడు అమరావతి క్వాంటం వ్యాలీ రూపంలో కనిపిస్తోందన్నారు. అప్పట్లో ఐటీ విప్లవానికి తలుపులు తెరిచిన నాయకుడు చంద్రబాబు.. ఇప్పుడు అంతకంటే వేగవంతమైన ఏఐ-క్వాంటం యుగానికి రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్న నాయకుడు కూడా ఆయనే. సాంకేతిక మార్పును గుర్తించి అప్‌డేట్ కాకపోతే సమాజం వెనుకబడిపోతుందని చరిత్ర ఎన్నోసార్లు హెచ్చరించింది. కాలం ఎవరి కోసం ఆగదు.. కాలంతో పాటు పరిగెత్తాలా లేక కాలం మనల్ని పక్కన పెట్టాలా అనే ప్రశ్నకు రాష్ట్రం సగర్వంగా ఇస్తున్న సమాధానమే అమరావతి క్వాంటం వ్యాలీ అని తెలిపారు.

---

# మహిళలు దేశ ప్రగతికి నిర్దేశకులు

- మహిళా యూనివర్సిటీ పరిశోధనలు
- జాతీయ సంస్థలకు ఉపయోగపడుతున్నాయి
- ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసలు
- పద్మావతి వర్సిటీ స్నాతకోత్సవంలో ప్రసంగం

తిరుపతి(చైతన్యరథం): పద్మావతి మహిళా యూనివర్సిటీ పరి శోధనలు అనేక జాతీయ సంస్థలకు ఉపయోగకరమని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఈ పరిశోధనలు కేవలం ప్రయోగ శాలలకు మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అవి సమాజ అభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 22వ స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా గవర్నర్, ఆయన సతీమణి సమీరా నజీర్ హాజర య్యారు. తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ, నగరపాలక సంస్థ కమి షనర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర విశ్వవిద్యాల యాల వైస్ చాన్సలర్లు పాల్గొన్నారు. గవర్నర్ మాట్లాడుతూ విద్య మనిషికి కేవలం ఉద్యోగ అవకాశాలకే కాకుండా బాధ్యత, మార్గద ర్శనం, లక్ష్య నిర్దేశం కూడా ఇస్తుందని వ్యాఖ్యానించారు. చదువు కున్న మహిళలు కేవలం తమ కుటుంబాల అభివృద్ధికే కాకుండా దేశ ఆర్థిక ప్రగతికి, సామాజిక స్థిరత్వానికి కూడా ప్రధాన కారణ మవుతారని పేర్కొన్నారు. సమాజానికి ప్రయోజనం కలిగించే పరిశోధనలు చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పరిశోధనలు ఇప్పటికే అనేక జాతీయ సంస్థలకు ఉపయోగపడుతున్నాయని అభినందిం చారు. విశ్వవిద్యాలయం విద్య, పరిశోధన రంగాల్లో మంచి పురోగతి సాధిస్తోందని పేర్కొన్నారు. తన ప్రసంగం ముగింపు సందర్భంగా 'దేవి మహాత్యం' నుంచి కొన్ని శ్లోకాలు చదివి వినిపించారు. మహిళా విద్య సమాజ అభివృద్ధికి కీలకమని వివ రించారు. అనంతరం ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త శశికళ సిన్హాకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగంలో ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించారు. స్నాతకోత్సవ వేడుకల్లో విద్యార్థులకు



పెద్ద సంఖ్యలో పురస్కారాలు ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 102 బంగారు పతకాలు అందజేశారు. పలువురు విద్యార్థులకు నగదు బహుమ తులు కూడా ప్రదానం చేశారు. 2591 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ, ఎంఫిల్, పీజీ డిగ్రీలు ప్రదానం చేశారు.

# కల్తీ నెయ్యి కేసులో ఇంకా ఎందుకు పాపాలు..

- **తప్పుడు ప్రచారాలు వైసీపీ ముఠాను రక్షించలేవు**
- **లిక్కర్ స్కాంగురించి చెప్పండి.. జనం వింటారు**
- **నెయ్యి గురించి ఏంతెలుసని పిచ్చి ప్రశ్నలేస్తారు?**
- **చింతచచ్చినా పులుపు చావలేదు మీకు..**
- **సజ్జల వ్యాఖ్యలకు మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు కౌంటర్**



మంగళగిరి (చైతన్య రథం): తిరుమల లడ్డూ నాణ్యతపై సజ్జల రామకృష్ణారెడ్డి చేస్తున్న ప్రేలాపనలపై మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు ఘాటుగా స్పందించారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్టుగా సజ్జల ధోరణి ఉందన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. “రామకృష్ణారెడ్డీ.. మీరింకా 2019–24 మధ్యకాలంలోనే ఉన్నామన్న భ్రమలో ఉన్నారేమో. ఒక్కసారి క్యాలెండర్ చూడండి. ఇది 2026. ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకే పరిమితం చేసి మూలన కూర్చోబెట్టారు. అసలు మీరు ఎక్కడున్నారని మిమ్మల్ని రాజకీయంగా ఎదుర్కోవాలి? అసెంబ్లీలో ఉన్నారా? చట్టసభల్లోలేని మీ వ్యాల్యూ సున్నా. సున్నాకు ఎవరూ విలువివ్వరు. మీ పార్టీ ఎమ్మెల్యేలకే పరిస్థితి అర్థమై నోరు మెదపడం లేదు. కానీ మీకు మాత్రం ఇంకా అహంకారం తగ్గలేదు. మీకు నెయ్యిగురించి, దాని నాణ్యతగురించి ఏం తెలుసని మాట్లాడుతున్నారు? మీకు తెలిసిందల్లా లిక్కర్, లిక్కర్ కమిషన్లు మాత్రమే. అందులో మీరు పండిపోయారు. నెయ్యిలో మూడురకాలుంటాయని తెలుసా? డైనింగ్ ఘీ సామాన్యులు వాడేది. కుకింగ్ ఘీ పరిశ్రమలు, స్వీట్ షాపుల వాడేది. ఆరోమాటిక్ ఘీ తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం వాడేది. టీటీడీవాడే నెయ్యిని 110నుంచి 120 డిగ్రీల వరకూ వేడి చేస్తారు. అందులో తేమశాతం సున్నా ఉండాలి. అలాంటి అత్యున్నత నాణ్యతగల నెయ్యి బయట మార్కెట్‌లో దొరకదు. లీటర్లకు, కేజీలకు తేడా తెలియకుండా, నాణ్యతతో సంబంధంలేకుండా మీరు మాట్లాడటం వైసీపీ చేసుకున్న దురదృష్టం” అని ఎద్దేవా చేశారు.

“శ్రీవారి నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని మేమేదో కావాలని చెప్పడం లేదు. సాక్షాత్తూ మీ హయాంలో టీటీడీ ఛైర్మన్‌గావున్న సుబ్బారెడ్డే కల్తీ జరిగిందని పరోక్షంగా ఒప్పుకున్నారు. జూలై 2024లో వచ్చిన ఎన్డీడీబీ రిపోర్టులో కల్తీ జరిగిందని స్పష్టంగా తేలింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేసిన సిట్ విచారణలో కూడా నిజాలు నిర్ధారణయ్యాయి. ఇన్ని ఆధారాలున్నా.. ఇంకా బుకాయించడం మీ మూర్ఖత్వానికి నిదర్శనం. మీ హయాంలో పీపీఎల్ ద్వారా ఇష్టం వచ్చినట్లు రేట్లుపెంచి కొనుగోలు చేశారు. కానీ ఈరోజు కూటమి ప్రభుత్వం వచ్చాక, ఓపెన్ టెండర్ల ద్వారా అత్యంత పారదర్శకంగా నెయ్యి కొనుగోలు చేస్తున్నాం. మీ టైంలో రేటు ఎక్కువగావుంటే, ఈరోజు అదే నాణ్యతగల నెయ్యిని రూ.649కే సేకరిస్తున్నాం. నందిని డెయిరీ, సంగం డెయిరీ, మదర్ డెయిరీవంటి సంస్థలు పోటీపడి నాణ్యమైన నెయ్యిని అందిస్తున్నాయి” అని అశోక్‌బాబు వివరించారు.

వంట నూనెలనే ఉదాహరణగా తీసుకుంటే.. సాధారణంగా లీటర్ నూనె రూ. 150కి దొరుకుతుంది, అదే స్వచ్ఛమైన గానుగ నూనె కావాలంటే కేజీ రూ. 550 వరకు ఉంటుంది. రెండూ నూనెలే, కానీ వాటి వెలికితీతలోనే నాణ్యత దాగి ఉంటుంది. నెయ్యి విషయంలోనూ అంతే.. టీటీడీకి కావాల్సింది సాధారణ నెయ్యి కాదు. 110 డిగ్రీల సెంటిగ్రేడ్‌వద్ద వేడి చేసినప్పుడు తేమశాతం సున్నాగావుండే అత్యున్నత నాణ్యతగల నెయ్యి కావాలి. ఇలా వేడి చేసినప్పుడు పరిమాణం తగ్గుతుంది. ధర పెరుగుతుంది. మార్కెట్‌లో రూ.549కి దొరికే నెయ్యికి, టీటీడీ కొనే ప్రత్యేక నాణ్యతగల నెయ్యికి చాలా వ్యత్యాసముంటుంది. అర్థం కావాలంటే.. మారుతీ 800 కారు రూ.6 లక్షలకు వస్తుంది. రోల్స్ రాయిస్ కారు రూ.6 కోట్లు పడుతుంది. రెండింటికీ నాలుగు టైర్లే ఉంటాయి. కానీ ఆ తేడా మీకు అర్థం కావడం లేదు. మీ విమర్శలు చిన్నపిల్లలు అడిగే ప్రశ్నల్లా ఉన్నాయి” అని అశోక్‌బాబు విమర్శించారు. సజ్జలా.... మీకు లిక్కర్ స్కామ్‌లు, ఏ బ్రాండ్ అమ్మాలి? ఎంత కమిషన్ నొక్కాలి? అనే విషయాల్లో ‘మాస్టర్ డిగ్రీ’ ఉంది. కానీ నెయ్యిగురించి మీకు ఏమీ తెలియదు. టీటీడీలో ప్రొక్యూర్‌మెంట్ అనేది ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది. మీ హయాంలో ఇష్టం వచ్చినట్టు నాణ్యతను గాలికి వదిలేసి కల్తీ నెయ్యిని అనుమతించారు. ఈరోజు మేము టెండర్లను పారదర్శకం చేసి, నాణ్యతలో రాజీ పడకుండా రూ.716 నుండి రూ.649కి ధరను తగ్గించాం. మీ హయాంలో పీపీఎల్ ద్వారా ఇష్టం వచ్చినట్లు అత్యధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి, ఆ భారాన్ని ప్రజల మీదకునెట్టారు. కానీ ఈరోజు కూటమి ప్రభుత్వం అదే కరెంటును, అదే సప్లైయర్స్‌నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తోంది. మేము పారదర్శకంగా వ్యవస్థను ప్రక్షాళన చేస్తుంటే, మీ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేయడం మీ మూర్ఖత్వానికి నిదర్శనమని దుమ్మెత్తిపోశారు.

ఈరోజు తిరుమల వెళ్తున్న భక్తులందరూ ముక్తకంఠంతో చెప్తున్న మాట.. “లడ్డూ క్వాలిటీ అద్భుతంగా ఉందని. నెయ్యిలో ఒక్క చుక్క తేమవున్నా అది నాణ్యతను దెబ్బతీస్తుంది. మీ హయాంలో కల్తీ నెయ్యితో లడ్డూ పవిత్రతను భ్రష్టుపట్టిస్తే, మేము దాన్ని మళ్లీ గాడిలో పెట్టాం. ప్రొక్యూర్‌మెంట్‌లో ఎక్కడా అవినీతి లేకుండా, క్వాలిటీ విషయంలో రాజీ పడొద్దని ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మీ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డికి ఆత్మలతో మాట్లాడే శక్తి ఉందని, తప్పులు లేకుండా మాట్లాడే శక్తి ఉందని డబ్బాలు కొట్టుకోవడం మానుకోండి. దేవుడి ప్రసాదాన్ని కల్తీ చేసినందుకు ఇప్పటికే భక్తులు మీకు 11 సీట్లతో బుద్ధి చెప్పారు. త్వరలోనే చట్టం వేయబోయే రెండో శిక్షకు సిద్ధంగా ఉండండి. మీరు ఏ దేవుడిని నమ్మినా, ఏ అల్లాను వేడుకున్నా.. చేసిన పాపానికి శిక్ష అనుభవించక తప్పదు” అని అశోక్‌బాబు హెచ్చరించారు.

నాడు వివేకానంద రెడ్డి హత్య విషయంలో చంద్రబాబుపై బురద చల్లారు. నేడు నెయ్యి విషయంలోనూ అదే చేస్తున్నారు. మీ దగ్గర పేపర్ ఉంది, ఛానల్ ఉంది కదాని అసత్యాలు రాసుకుంటే ఎవరూ నమ్మరు. మీ క్రెడిబిలిటీ పోయింది. రామకృష్ణారెడ్డీ.. ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్‌కు ఏదో సంబంధముందని పాత ఫోటోలు, చీప్ ప్యాకెట్లు చూపించి బొత్స సత్యనారాయణ ప్రజలను నమ్మించాలనుకోవడం మీ అమాయకత్వం. గతంలో ఇందాపూర్ డెయిరీ ద్వారా సరఫరా జరిగినప్పుడు 65:35 నిష్పత్తిలో ఆర్డర్లు ఇచ్చాం. ఎల్–1 రేటు ఎవరైతే ఇస్తారో, వారికే అత్యధిక శాతం ఆర్డర్ ఇవ్వడం అనేది నిబంధన. అందులో భాగంగానే ఇందాపూర్, సంగం, మదర్ డెయిరీవంటి సంస్థలు పోటీపడ్డాయి. పారదర్శకమైన ఓపెన్ టెండర్ల ద్వారా వచ్చిన ఏ డెయిరీ అయినా నాణ్యతను పాటిస్తేనే అనుమతిస్తాం. మీలాగా గతంలో కొందరికే ‘లిమిటెడ్ టెండర్లు’ ఇచ్చి నాణ్యతను గాలికి వదిలేసే రకం కాదు కూటమి ప్రభుత్వం. నెయ్యి నాణ్యతమీద, టెండర్ల రికార్డులమీద మీకు ఏవైనా అనుమానాలుంటే.. మీ ఇంటి అడ్రస్ చెప్పండి, రికార్డులన్నీ పోస్ట్ చేస్తాం. లేదంటే తెలుగుదేశం పార్టీకి ఒక్క మిస్డ్‌కాల్ ఇవ్వండి, మీ అజ్ఞానాన్ని పోగొట్టే డేటా పంపిస్తాం. ఎప్పుడైనా, ఎక్కడైనా డిబేట్‌కు మేము సిద్ధం. శ్రీవారి లడ్డూ విషయంలో అపచారం చేసినందుకు ఇప్పటికే దేవుడు శిక్ష వేశాడు. చట్టం వేయబోయే రెండో శిక్షకు మీరు, మీ నాయకుడు సిద్ధంగా ఉండండి. చంద్రబాబు నిజమైన భక్తుడు. ఆయన చేసే పవిత్ర కార్యాలను అపహాస్యం చేస్తే కాలమే మీకు సమాధానం చెప్తుంది. మీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి ఎప్పుడూ ‘దేవుడి స్క్రిప్ట్’ అని మాట్లాడుతుంటారు. అవును.. ఇది దేవుడి స్క్రిప్టే! అందుకే మీరు చేసిన అపచారానికి ప్రజలు 11 సీట్లతో మొదటి శిక్ష వేశారు. అవినీతిలో కూరుకుపోయి, పీకల్లోతు కష్టాల్లో ఉన్న మీరు త్వరలోనే చట్టం వేయబోయే రెండో శిక్షకు సిద్ధంగా ఉండండి. మీరు, మీ మందీ మార్బలం అంతా జైలుకువెళ్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి” అని అశోక్‌బాబు తీవ్రస్వరంతో హెచ్చరించారు.

# భగవద్గీత పట్టుకుని భూమన పచ్చి అబద్ధాలు

- **34 పేజీల పేరుతో ముద్రించిన ఆ పుస్తకంలో నాలుగు పేజీలు వారి ప్రచారానికే సరిపెట్టారు**
- **శ్రీవారి సొమ్ముతో ప్రింట్ చేయించి ఎందుకు పంచలేదు**
- **దోపిడీనే వైసీపీ నేతల దారి..అరాచకమే వారి ధర్మం**
- **ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్**



మంగళగిరి(చైతన్యరథం): భూమన కరుణాకర్‌రెడ్డి భగవద్గీత ను పట్టుకుని పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ గీతను అవమానించా డని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మండిపడ్డా రు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ నాస్తికుడైన భూమన హిందు దేవుళ్లను అవమానించనట్లు మాట్లాడ టం తగదని హితవు పలికారు. “హిందువుల పవిత్రంగా భావించే గ్రంథం భగవద్గీత. ధర్మం, కర్తవ్యం, ఆత్మజ్ఞానం గురించి బోధించే ఉపనిషత్తుల సారాంశం. భారతదేశ న్యాయవ్యవస్థలో కూడా భగవద్గీతకు విశిష్ట స్థానం ఉంది. కోర్టులో భగవద్గీత పట్టుకుని అబద్ధాలు చెప్తే బీఎన్ఎస్ 227, 229 కింద 3–7 సంవత్సరాల జైలుశిక్ష విధించవచ్చు. నేడు అదే భగవద్గీతను పట్టుకుని భూమన పచ్చి అబద్ధాలు మాట్లాడాడు. 2011లో తన కుమార్తె వివాహం మెదక్‌లోని ఒక చర్చిలో క్రైస్తవ పద్ధతిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గారి తమ్ముడు రవీంద్రనాథ్‌రెడ్డి కొడుకుతో నిర్వహించారు. మెదక్ చర్చి లో పెళ్లి చేసి తిరుపతిలో తెలుగు హిందూ సాంప్రదాయం ప్రకా రం పెళ్లి చేశానని భూమన అబద్ధం చెబుతున్నారు. “హిందువు అని తనకు తాను ప్రచారం చేసుకుంటూ క్రైస్తవ పద్ధతులను ఇంట్లో పాటిస్తున్న వ్యక్తి భూమన కరుణాకర్‌రెడ్డి. “మానవులంద రికీ–భగవద్గీత” పేరుతో 34 పేజీల పుస్తకంలో 2 పేజీలు కరుణా కర్‌రెడ్డికి, మరో రెండు పేజీలు ధర్మారెడ్డి ముందుమాట కోసం కేటాయించారు. మరో రెండు పేజీలు ప్రింటర్‌కి, కవర్ పేజీలు పోను 23 పేజీలతో భగవద్గీతను ముగించారు. శ్లోకాలు లేకుండా భగవద్గీత రూపొందించారు. ఎక్కాల పుస్తకం కూడా ఈ విధంగా ఉండదు. స్వామివారి సొమ్ముతో భగవద్గీత ప్రింట్ చేయించి ఎందు కు పంచలేదో భూమన సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**నాస్తికుడు భగవద్గీత గురించి ఎలా మాట్లాడతాడు**

ఆ పుస్తకంలో భూమన “నా జీవన ప్రస్థానంలో రాజకీయంతో ముడిపడి ముందుకు సాగుతోంది. కానీ భారతీయ సాంప్రదాయం , సాహిత్యం, ఆధునిక సాహిత్యం, అద్భుత సాహిత్యం అన్ని పరిశీ లించానని అన్నాడు. అంటే తాను ఏమిటో తన విధానాలు ఏమిటో భూమన చెప్పాడు.

తిరుమల కొండపై దేవుడు లేడు..అది నల్ల రాయి అంటూ ఇంకా చెప్పని పదాలతో దేవదేవుని అవమానించా రు. అవసరానికి తగ్గట్టు మతాన్ని మార్చుకునే వ్యక్తి భూమన కరుణాకర్‌రెడ్డి. వైసీపీ నేతలకు హిందు ధర్మమంటే లెక్కలేదు.. చట్టాలంటే లెక్కలేదు.. ఎందులో అయినా, ఎక్కడైనా దోపిడీనే వారి దారి. అరాచకమే వారి ధర్మం. వైసీపీ హయాంలో తిరుమల లో పవిత్ర ప్రసాదాన్ని కల్తీ చేశారు..తలనీలాలు అమ్ముకున్నారు.. పరకామణి దోపిడీ చేసిన వ్యక్తిని దొరగా చేశారని పేర్కొన్నారు.

**తప్పు ఒప్పుకుని క్షమాపణలు చెప్పాలి**

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు గురించి మాట్లాడే అర్హత కరుణాకర్‌రెడ్డికి లేదు. తిరుమల వేదికగా వైసీపీ ముఠా చేసిన దోపిడీ అన్ని వెలికి తీస్తాము. శిశుపాలుడికి వంద తప్పుల తర్వాత శ్రీకృష్ణుడు శిరచ్ఛేదం చేసినట్లు.. వైసీపీ తప్పులకు శిక్ష తప్పదు. ఇప్పటికైనా పద్ధతి వైసీపీ పద్ధతి మార్చుకోవాలి. 2019– 24లో వాళ్లు చేసిన తప్పులకు ప్రజలు 11 సీట్లు ఇచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు దేవాలయాలు, హిందూ విగ్రహాల మీద దాడులు చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత దేవ దేవుని మీద దాడి చేస్తున్నారు. ఇప్పటికైనా కల్తీ నెయ్యి అంశంపై వైసీపీ తప్పు ఒప్పుకొని.. హిందువులకు క్షమాపణలు చెప్పాలి. లేకుంటే 2029 ఎన్నికల్లో హిందువుల ఆగ్రహానికి వైసీపీ తుడిచిపెట్టుకుపోతుందని హితవుపలికారు.

**మంత్రి అచ్చెన్న ప్రశ్నకు సమాధానం ఏది జగన్?**

అసెంబ్లీలో జగన్మోహన్‌రెడ్డి క్రిస్టియన్ కాదా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. నేటి వరకు జగన్ దానిపై సమాధా నం చెప్పలేదు. అధికారం కోల్పోయిన తరువాత ఒక్కసారైనా జగన్ డిక్లరేషన్ ఇచ్చి వెంకటేశ్వరస్వామి వారిని దర్శించారా? మతాలను అడ్డం పెట్టుకుని ఓట్లు కోసం ఆరాటపడుతున్న పార్టీ వైసీపీ. పులివెందులలో దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జగన్ చేసిన వింత చేష్టలు హిందువుల మనోభావాలను దెబ్బతీశా యి. తీర్థం ఇస్తే వాసన చూసి నెలపై చల్లాడు. హోమం దగ్గర పూజారులకు హవిస్సులు ఇచ్చి కనీసం జ్ఞానం లేకుండా ప్రవర్తిం చారు. ఇంటికి కిలో మీటరు దూరంలో గుడి ఉంటే.. ఇంటి దగ్గర సెట్ వేసి పూజించిన వ్యక్తి జగన్. హిందూ మత ద్వేషి అయినా జగన్మోహన్‌రెడ్డిని హిందు సమాజం బహిష్కరించాలని కోరారు.

## చేసిన పాపాలను కప్పిపుచ్చుకోవడానికే

# ప్రముఖ డెయిరీలపై తప్పుడు ప్రచారాలు

మంగళగిరి(చైతన్యరథం): తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీపై వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలు పూర్తిగా అసంబ ద్ధం, నిరాధారమని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తీవ్రంగా ఖండించారు. లేనిది ఉన్నట్లు సృష్టించడంలో వైకాపా ఒక 'బ్యాండ్ ఆఫ్ సైకోలు'గా మారిందని మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యా లయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ సజ్జల రామకృష్ణ ఉరఫ్ 'శకుని మామ' బయట, వారి నాయకులు మండలిలో పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారు. వైకాపా హయాంలో జరిగిన నెయ్యి కల్తీపై 'సిట్' నివేదిక స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. 2019-24 మధ్య నెయ్యి సరఫరాలో జరిగిన అవకతవకలపై వారు నోరు మెదపడం లేదు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక భక్తుల ఫిర్యాదుల మేరకు ల్యాబ్ టెస్టులు చేయిస్తే.. అందులో యానిమల్ ఫ్యాట్ (జంతువుల కొవ్వు) ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆ రిపోర్టులను కూడా వక్రీకరించి మాట్లాడటం సిగ్గుచేటు. భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో సుమారు 60 లక్షల కిలోల నెయ్యి కల్తీ జరిగిందని, దీని విలువ రూ.234 కోట్లు అని సిట్ దర్యాప్తులో తేలింది. ఇందులో కోట్ల రూపాయల నగదు విజయవాడకు 12.5 కోట్లు హవాలా మార్గంలో చెన్నైకి రూ.7.5 కోట్లు తరలినట్లు ఆధా రాలు ఉన్నాయి. 2022లోనే సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదిక కల్తీ జరిగిం దని చెప్పినా..నాటి టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఆ నివేదికను తొక్కిపెట్టారు. ఒక ఎంపీ ఇంట్లో టెండర్ల కోసం రూ.50 లక్షలు డిమాండ్ చేసి రూ.30 లక్షలు వసూలు చేసిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. గతంలో ఉన్న నిపుణుల కమిటీ సూచనలను పక్కనపెట్టి నెయ్యి టెండర్లలో 'కనీసం 4 లక్షల లీటర్ల ఆవు పాలు సేకరించాలి' అనే నిబంధనను వైకాపా ప్రభుత్వం ఎందుకు తొలగించింది? టీటీడీలో నెయ్యి టెండర్ల నిబంధన లను మార్చినప్పుడు, ఆనాడు పాలకమండలిలో స్పెషల్ ఇన్వైటీలుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి వంటి వారు ఏం చేస్తున్నారు? 4 లక్షల లీటర్ల ఆవు పాలు ఉండాలనే కీలక నిబంధనను తొలగించినప్పుడు వీరి పాత్ర లేదా? నాణ్యతా ప్రమా ణాలను తుంగలో తొక్కి తమకు కావలసిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టేలా బోర్డు నిర్ణయాలను వీరు ప్రభావితం చేశారనే ఆరోపణ లు ఉన్నాయి. నాటి టీటీడీలో చైర్మన్ పెద్దల కనుసన్నల్లోనే ఈ కల్తీ నెయ్యి దందా సాగింది.




- సజ్జల, వైసీపీ నేతలు వాస్తవాలు వక్రీకరిస్తున్నారు
- సంగం రైతుల ఆస్తి..పారదర్శకతకు నిదర్శనం
- సేకరణ కేంద్రాలకు ఆహ్వానిస్తున్నా..వచ్చే దమ్ముందా?
- పాలే లేకుండా కల్తీలో మీకు పేటెంట్ ఇవ్వొచ్చు
- కల్తీ నెయ్యిపై సమాధానం చెప్పి తీరాల్సిందే
- తప్పు ఒప్పుకుని క్షమాపణలు చెప్పాలి
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటి నాయకులు టీటీడీ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించినప్పుడు, భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోలేదు? ఈరోజు సిట్ రిపోర్టులో అన్ని విషయాలు బయటపడుతున్నా వీరు ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం వెనుక అర్థం ఏమిటి? అధికా రాన్ని అడ్డం పెట్టుకుని చేసిన ఈ మహా పాపానికి వీరంతా సమా ధానం చెప్పాల్సిందేనని నిలదీశారు.

**సంగం వేల మంది రైతుల ఆస్తి**

సంగం డెయిరీకి ఆవు పాలు లేవని కొందరు అజ్ఞానంతో మాట్లాడుతున్నారు. సంగం డెయిరీ నా సొంత ఆస్తి కాదు.. వేల మంది రైతుల ఆస్తి. రాబోయే రెండేళ్లలో 50 ఏళ్ల వేడుకలు జరుపుకోబోతున్న ఈ సంస్థ పారదర్శకతకు నిదర్శనం. మాకు వివిధ జిల్లాల్లో పటిష్టమైన సేకరణ వ్యవస్థ ఉంది. చిత్తూరు జిల్లా 13 చిల్లింగ్ సెంటర్ల ద్వారా రోజుకు 3,44,559 లీటర్ల ఆవు పాలు సేకరిస్తున్నాం. అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి కలిపి ప్రతిరోజూ 5,11,217 కిలోల ఆవు పాలను సేకరిస్తున్నాం. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ మాపై బురదజల్లడం వారి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని, వారికి పాలు, వెన్న, నెయ్యి ధరల మీద కనీస అవగాహన లేదని మండిపడ్డారు.

**టెండర్లలో అర్హత సాధించినా అనర్హులను చేశారు**

2020, 2021 టెండర్లలో మేము అన్ని నిబంధనల ప్రకారం అర్హత సాధించినా కావాలనే మమ్మల్ని డిస్క్వాలిఫై చేశారు. హైకోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే తప్ప మమ్మల్ని టెండర్లలో పాల్గొననివ్వలేదు. చేసిన తప్పును ఒప్పుకుని భక్తులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి..ఏఐ ద్వారా ఫేక్ వీడియోలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూడటం అన్యాయం. మేము కేవలం ట్రస్టీలుగా బాధ్యత నిర్వహిస్తున్నాం. గత ఐదేళ్లుగా అధికా రంలో ఉండి రైతుల కష్టాన్ని వైసీపీ దెబ్బతీసింది. "ప్రస్తుతం దేశవ్యాప్తంగా బటర్ (వెన్న) ధరలు భారీగా పెరిగాయి. దీని ప్రభావం సహజంగానే నెయ్యి ధరలపై ఉంటుంది. ఈ రోజు మార్కెట్‌లో బటర్ ధర రూ.520 దాటి ఉంది. మరి ఇలాంట ప్పుడు నెయ్యి ధరలు ఎలా తక్కువగా ఉంటాయి? కనీస జ్ఞానం లేకుండా వైసీపీ నేతలు ఉపన్యాసాలు ఇస్తున్నారు. కేఎంఎఫ్ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నెయ్యి ధర ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్‌టీతో కలిపి లీటరుకు రూ.760 వరకు ఉంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా నెత్తిన పెట్టుకుని మోసిన అమూల్ నెయ్యి ధరలు కూడా రూ. 650 నుంచి రూ.760 (కౌ ఘీ) వరకు ఉన్నాయి. వీటి నెయ్యి ధరలు కూడా మార్కెట్‌లో రూ.700 పైమాటే. మేము రూ.599 కోట్ చేశామంటే అది వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉందని అర్థం చేసుకోవాలని హితవుపలికారు.

**పాలు లేకుండా నెయ్యి..ఆ పేటెంట్ మీకే ఇవ్వాలి**

పాలు వాడకుండా కేవలం స్టెరాయిడ్స్, ఇతర కెమికల్స్ ఉపయోగించి నెయ్యిని ఎలా తయారు చేయాలనే విద్యలో వైసీపీ నేతలకే పేటెంట్ రైట్స్ ఇవ్వాలి. జగన్‌రెడ్డి నేతృత్వంలో వై.వి. సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిలు కలిసి డెయిరీ రంగా న్ని భ్రష్టు పట్టించారు. వైష్ణవి డెయిరీ వంటి సంస్థలకు టెండర్లు వెయ్యమని ప్రోత్సహించింది ఎవరు? అని ప్రశ్నించారు. సంగం డెయిరీకి ఒక్క లీటరు ఆవు పాలు కూడా లేవని సజ్జల రామకృ ష్ణారెడ్డి అబద్ధాలు చెబుతున్నారు. మేము ప్రతిరోజూ 5,15, 000 కిలోల ఆవు పాలను సేకరిస్తున్నాం. జగన్‌రెడ్డి, సజ్జల వస్తే నా సొంత ఖర్చులతో వారిని తీసుకెళ్లి మా సేకరణ కేంద్రా లను చూపిస్తాను. ఆ దమ్ము మీకుందా? అని సవాల్ విసిరారు.

**ఆ నిబంధనను ఎత్తివేసింది మీరు కాదా?**

4 లక్షల లీటర్ల సామర్థ్యం ఉండాలనే నిబంధనను ఎత్తివేసి కల్తీకి బాటలు వేసింది మీ ప్రభుత్వం కాదా? జగన్‌రెడ్డికి, చంద్రబాబుకి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. జగన్ ముఖ్యమం త్రిగా ఉన్నప్పుడు తన సొంత పత్రిక, టీవీ కోసం ప్రజల సొమ్ము రూ.347 కోట్లు ప్రకటనల రూపంలో దోచిపె ట్టారు. వాలంటీర్ల ద్వారా పేపర్లు కొనిపించడానికి రూ.200 కోట్లు ఇచ్చారు. భారతీ సిమెంట్స్ కోసం పేదవాళ్ల ఇళ్ల నిర్మాణంలో అధిక ధరలకు కొనిపించి కోట్ల లాభం పొందారు. కానీ, మా నాయకుడు చంద్రబాబు తన కుటుంబ వ్యాపారమైన హెరిటేజ్‌ను ఎప్పుడూ ప్రభుత్వ టెండర్లలోకి రానివ్వలేదు. దేవాలయాలకు నెయ్యి సరఫరా చేయకూడదని ముందే నిర్ణయించుకున్న నిబద్ధత మా నాయకుడిది. హెరిటేజ్ నుంచి ఒక్క చుక్క నెయ్యి కూడా టీటీడీకి ఇవ్వలేదు. గతంలో కేవలం ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు మజ్జిగ మాత్రమే సరఫరా చేశారు. అంతకు మించి ఏమీ లేకపోయినా, బురద జల్లడమే పనిగా వైకాపా నేతలు బతుకుతున్నారు. కల్తీ జరిగిందని అంకెలతో సహా నిరూపించినా సిగ్గులేకుండా సమర్థించుకుంటున్నారు. జగన్ హయాంలో నాపై అక్రమ కేసులు పెట్టి 200 మంది పోలీసులతో డెయిరీని ఆక్రమించుకోవాలని చూశారు. కానీ రైతులు, ఉద్యోగులు తిరగబడి మా డెయిరీని కాపాడుకున్నారు. చేసిన పాపాలను సమర్థించుకోవడం మానేసి ..దేవుడి దగ్గర తప్పు ఒప్పుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాలని హితవుపలికారు. రాజకీయ మనుగడ కోల్పోతా మనే భయంతో ఇలాంటి ఫేక్ వీడియోలు, అసత్య ఆరోపణలు చేయడం మాను కోవాలని, మీ పార్టీకి ప్రజలే అంతిమంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

### వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు సతీమణికి
## నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ



తూర్పు గోదావరి (చైతన్యరథం): దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసుకు సంబంధించి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు సతీమణి లక్ష్మీదుర్గకు రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం నాన్ బెయిలబు ల్ వారెంట్ జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ కోర్ట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో పోలీసులు లక్ష్మీదుర్గను అరెస్టు చేసేం దుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసుపై బాధిత కుటుంబానికి మద్దతుగా తాను చేసిన న్యాయపోరాటం ఫలించిందని న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు అంటున్నారు. కాగా, సుబ్రహ్మణ్యం హత్య కేసుకు సంబంధించి తదుపరి విచారణలో లక్ష్మీదుర్గను ఏ-2గా చేర్చి బుధవారం న్యాయస్థానంలో సిట్ సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా విచారణ జరిపిన రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

# వైకాపాకు సేవ.. ఆర్టీసీకి రూ.3.23 కోట్ల నష్టం

### అద్దె చెల్లించకుండా రాయితీలు - కాగ్ నివేదికలో దుర్వినియోగం స్పష్టం

అమరావతి(చైతన్యరథం): వైకాపా అధికారంలో ఉండగా ఆ పార్టీ ప్లేనరీ, బీసీల సభకు పెద్దఎత్తున ఆర్టీసీ బస్సులను వినియో గించింది. అయితే వాటికి పూర్తిస్థాయిలో అద్దె చెల్లించకుండా రాయితీలు పొందినట్లు బయటపడింది. దీనివల్ల ఆర్టీసీ రూ.1.66 కోట్ల మేర నష్టపోగా, జీఎస్టీ వసూలు చేయకపోవడంతో ప్రభుత్వం రూ.1.57 కోట్లు కోల్పోయింది. శాసనసభలో శుక్రవారం ప్రవేశపెట్టిన కాగ్ నివేదికలో ఈ విషయాలు వెలుగుచూశాయి. 2022 జూలైలో గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాల యం మైదానంలో నిర్వహించిన పార్టీ ప్లీనరీకి వైకాపా వివిధ జిల్లాల నుంచి 1823 ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంది. వీటికి ప్రత్యేక ఛార్జీలు వసూలు చేయాల్సి ఉండగా ఆర్టీసీ అధికారులు సాధారణ ఛార్జీలే వసూలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 10 శాతం రాయితీ కూడా ఇచ్చారు. దీంతో సంస్థ రూ.75 లక్షలు నష్టపోయింది. ప్రత్యేక బస్సులపై వసూలు చేయాల్సిన 18 శాతం జీఎస్టీని రాబట్టకపోవడంతో ప్రభుత్వానికి రూ.72 లక్షల మేర నష్టం వాటిల్లింది. అలాగే 2022 డిసెంబరులో విజయవాడలో నామినేటెడ్ ప్రతినిధులతో బీసీ మహాసభ నిర్వహించింది. దీనికి జిల్లాల్లో 1,439 బస్సులను తీసుకున్నారు. వీటికి కూడా ఆర్టీసీ ప్రత్యేక ఛార్జీల బదులు సాధారణ ఛార్జీలే వసూలు చేసింది. దీని వల్ల ఆర్టీసీకి రూ.91 లక్షలు, జీఎస్టీ రాబట్టకపోవడంతో ప్రభు త్వానికి రూ.85 లక్షల నష్టం వాటిల్లింది. మొత్తంగా రెండు సందర్భాల్లో ఆర్టీసీ రూ.1.66 కోట్లు, ప్రభుత్వం జీఎస్టీ రూపంలో రూ.1.57 కోట్లు నష్టపోయాయి.

**ప్రమాద క్లెయిమ్‌ల మొత్తాన్ని వసూలు చేయలేదు**

ఆర్టీసీలో అద్దె బస్సులు ప్రమాదానికి కారణమైతే బాధితులకు యాక్సిడెంట్ క్లెయింను అద్దె బస్సు యజమానే చెల్లించాలి. ఆర్టీసీ చెల్లిస్తే..ఆ మొత్తాన్ని అద్దె బస్సు యజమాని నుంచి రికవర్ చేయా లి. ఇలా వివిధ ప్రమాద కేసులకు సంబంధించి మోటారు యాక్సి డెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్లో ఆర్టీసీ రూ.1.58 కోట్ల డిపాజిట్ చేసినా సంబంధిత అద్దె బస్సుల యజమానుల నుంచి వసూలు చేయలేదు. దీనివల్ల వడ్డీ రూపంలో కూడా ఆర్టీసీ రూ.76 లక్షలు కోల్పోయింది.

# నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు

- మెకనైజ్డ్ కిచెన్లతో పరిశుభ్ర, పోషకాహారం
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి
- సింగరాయకొండ గురుకులం ఆకస్మిక తనిఖీ

కొండపి(చైతన్యరథం): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శనివారం ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడిన అనంతరం పాఠశాలలో మెకనైజ్డ్ కిచెన్ ని పరిశీలించారు. మెకనైజ్డ్ కిచెన్ నిర్వహణ పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలోని 14 బెంచ్ మార్క్ అంబేద్కర్ గురుకులాల్లో రూ.1.39 కోట్లతో ఆధునిక వంట పరికరాలతో మెకనైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేశాం. మెకనైజ్డ్ కిచెన్లతో విద్యార్థులకు పరిశుభ్రత, నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నాం. వంట మనుషులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. పేద విద్యార్థుల సంక్షేమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. అందుకు ఎంత ఖర్చునైనా తమ ప్రభుత్వం భరిస్తుందని పేర్కొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో 116 మంది లబ్ధిదారులకు రూ.90 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంత్రి స్వామి పంపిణీ చేశారు. పేదల ఆరోగ్యానికి ధీమాగా రూ. 25 లక్షలతో బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. సంజీవని పథకంతో రాష్ట్రంలోని ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్ని డిజిటలైజేషన్ చేస్తాం. భవిష్యత్తులో రాష్ట్రంలో జనాభా తగ్గుదల, వృద్ధుల సంఖ్య పెరుగుదల నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పు సమయంలో రూ.25 వేల ప్రోత్సాహం ఉంటుంది. 2023 నివేదిక ప్రకారం ఏపీలో ఏడాదికి 6.70 లక్షల మంది పిల్లలు మాత్రమే పుడుతున్నారు. ఈ లెక్కన 2047 నాటికి ఏపీలో వృద్ధుల సంఖ్య ఏ స్థాయిలో పెరిగిపోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అందుకే జనాభా వృద్ధిపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.



## తిరుమల అశ్విని ఆసుపత్రిలో తనిఖీలు

*- టీటీడీ జేఈవో ఎ.శరత్ సూచనలు*

తిరుమల (చైతన్యరథం): టీటీడీ అశ్విని ఆసుపత్రి, డిస్పెన్సరీలను టీటీడీ జేఈవో (విద్య, వైద్య) ఎ.శరత్ శనివారం ఉదయం తనిఖీ చేశారు. వైద్య సేవలు, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై కీలక సూచనలు చేశారు. అశ్విని ఆసుపత్రి, డిస్పె న్సరీలలో ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను భక్తులకు స్పష్టంగా తెలియజేసేలా తగిన సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రక్త దానానికి సంబంధించిన వివరాలను ఓపీ నమోదు రిజిస్టర్‌లో కాకుండా ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అశ్విని ఆసుపత్రిలో ఈసీజీ పరీక్షలు చేయించుకునే రోగుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు పీఏసీ 5 ఉచిత డిస్పెన్సరీలో వెంటనే ఒక వైద్యుడిని నియ మించాలని ఆదేశించారు. అశ్విని ఆసుపత్రి వద్ద ప్రవేశ ద్వారం లేదా వెనుక భాగంలో భద్రతా సిబ్బంది కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే జీఎన్‌సీ వద్ద భక్తుల కోసం ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అదే విధంగా రోగుల నమోదు వివరాలను కేస్ షీట్‌లో వ్యాధి నిర్ధారణను స్పష్టంగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో టీటీడీ సీఎంవో కుసుమ కుమారి, అశ్విని ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, ఇతర అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యి కేసులో.. హైకోర్టులో దక్కని ఊరట




అమరావతి (చైతన్యరథం): కల్తీ నెయ్యి కేసులో నిందితుడిగా ఉన్న టీటీడీలో డెయిరీ నిపుణుడు విజయభాస్కర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఊరట దక్కలేదు. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది మోహన్ రెడ్డి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు పూర్తయి ప్రాథమిక చార్జ్ షీట్ దాఖలు చేయడంతో బెయిల్ ఇవ్వాలని మోహన్ రెడ్డి వాదించారు. హవాలా మార్గంలో పిటిషనర్‌కు 75 లక్షల రూపాయలు అందాయని సీబీఐ తరపు న్యాయవాది సురేష్ కుమార్ కోర్టుకు వివరించారు. కాగా, సికింద్రాబాద్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డిని టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నిందితుడిగా(ఏ34) చేరుస్తూ గత నవంబరు 23న నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. అర్హత లేని డెయిరీలకు సహకరించడం ద్వారా ఆయా సంస్థల నుంచి ఆయన భారీగా లబ్ధి పొందారని సిట్ తెలిపింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డెయిరీ ఎండీ జగన్‌మోహన్ గుప్తా నుంచి రూ.2.50లక్షలు లంచంగా తీసుకున్నారని వెల్లడించింది. అల్ఫా డెయిరీ ప్రతినిధుల నుంచి 8 గ్రాముల గోల్డ్ కాయిన్.. వైష్ణవి, భోలేబాబా, మాల్‌గంగా, ప్రీమియర్ ఫుడ్స్ తదితర డెయిరీల నుంచి హైదరాబాద్‌లోని హవాలా ఏజెంట్ ద్వారా మొత్తం రూ.83 లక్షలు లంచంగా తీసుకున్నారని ఆరోపించింది.

## ప్రకృతి సాగుతో ఆదాయం, ఆరోగ్యం

**ఈడబ్ల్యూఎస్ రైతులు దృష్టి పెట్టాలి: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

విజయవాడ(చైతన్యరథం): ప్రకృతి వ్యవసాయంతో ఆదా యంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలి పారు. వ్యవసాయం భారం కాకుండా లాభసాటి కావాలంటే ప్రకృతి సాగే సరైన విధానమని స్పష్టం చేశారు. విజయవా డలోని ఓ హోటల్లో శనివారం ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీ యుల కోసం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై వర్క్ షాప్ లో పాల్గొని ప్రసంగించారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల అభ్యున్నతికి ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే... మరో వైపు స్వయం సమృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతుండడంతో వ్యవసాయ పెట్టుబడి భారంగా మారింది. వ్యవసాయంలో ఖర్చును తగ్గిస్తూ.. లాభాలు పెంచడానికి ప్రకృతి సాగు ఎంతో దోహదపడుతుంది. రసాయ నాలపై ఆధారపడకుండా సహజ వనరులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని సూచించారు. అటు ఆరో గ్యం, ఇటు ఆదాయం ప్రకృతి వ్యవసాయం వల్లే సాధ్యమవు తుందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం ఆర్గానిక్ వ్యవసాయం ఆవశ్యకత గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తోందన్నారు. జీవామృతం, ఘన జీవామృతం వంటి సహజ వనరుల వినియోగంతో నేల సారం పెరుగుతుందన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులు కొనుగో లుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను ఆహా రంగా తీసుకోవడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల కు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు అధిక ధరతో పాటు డిమాండ్ కూడా ఎక్కువేనన్నారు. ఈడబ్ల్యూ ఎస్ సామాజిక వర్గీయుల్లో ఉన్న రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు సాధించాలని పిలుపునిచ్చారు. అంత కుముందు సేంద్రీయ ఎరువులతో సాగుచేసిన కూరగాయలు, అపరాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి సవిత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈడబ్ల్యూఎస్ సంక్షేమ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.సునీత, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, దూడే రాకేశ్, ఈడబ్ల్యూఎస్ అధికారులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన రైతులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె (చైతన్యరథం): బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన దాదాపు రూ.50.59 లక్షల విలువైన చెక్కులను 71 మంది లబ్ధిదారులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 71 మంది లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా చెక్కుల అందజేశారు. అనంతరం కూటమి పాలనలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి - సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కుటుంబ పెద్ద అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం అప్పుల వలలో చిక్కుకోకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటుందన్నారు.. చెక్కుల పంపిణీ సందర్భంగా వైద్య సహాయం అందుకున్న రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



## పొగాకు కొనుగోళ్లకు ముహూర్తం ఖరారు

- రాష్ట్రంలో రెండు విడతలుగా వేలం
- ఈనెల 25న తొలి దశ ప్రారంభం
- వచ్చే నెల 9న రెండో విడత



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో రెండు విడతలుగా పొగాకు కొనుగోళ్లకు వేలం జరగనుంది. ఇందుకు సంబంధించి ముహూర్తం ఖరారైంది. తొలివిడత కొనుగోళ్లను ఈనెల 25వ తేదీన, రెండో విడత వచ్చేనెల 9న మరికొన్ని వేలం కేంద్రాల్లో చేపట్టనున్నారు. ఆ మేరకు గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో కీలక సమావేశంలో నిర్ణయించారు. గత ఏడాది రాష్ట్రంలో మార్చి 10న పొగాకు వేలంను ప్రారంభించారు. ఈ ఏడాది కూడా అలాగే త్వరగా చేపట్టాలని రైతులు కోరుతు న్నప్పటికీ ప్రస్తుతం జరుగుతున్న కర్ణాటక మార్కెట్ ఒడిదొడుకు లతో వ్యాపారులు, బోర్డు అధికారులు కొంత ఆలస్యం చేశారు. రైతుల నుంచి ఒత్తిడి పెరగడంతో వివిధ స్థాయిల్లో సమావేశాలను నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను సేకరించగా ఎక్కువ మంది ఈనెలలోనే కొనుగోళ్లను చేపట్టాలని కోరారు. ఈ నేపథ్యం లో పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని వేలం కేంద్రాల రైతుప్రతినిధులు, పొగాకు కొనుగోళ్లు చేసే కంపె నీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. వ్యాపార ప్రతినిధులు మేలో వేలం ప్రారంభించాలని కోరగా రైతు ప్రతినిధులు అందుకు అంగీకరించలేదు. ఇప్పటికే అత్యధిక ప్రాంతాల్లో పొగాకు గ్రేడింగ్ లు కూడా జరుగుతున్నాయని, ఎండల తీవ్రతతో పంట నాణ్యత దెబ్బతినడంతో పాటు తూకం కూడా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోళ్లను ప్రారంభించాలని గట్టిగా కోరారు. దీంతో ఈనెల 25 నుంచి పొగాకు కొనుగోళ్లను చేపట్టా లని బోర్డు అధికారులు నిర్ణయించారు. తొలివిడత దక్షిణాది రీజియన్ పరిధిలోని పొదిలి, కందుకూరు-2 కేంద్రాలు, ఉత్తరాదిలోని రాజమండ్రి రీజియన్ పరిధిలోని అన్నికేంద్రాల్లో ఈనెల 25న కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. దక్షిణాదిలో మిగిలిన కేంద్రాలైన ఒంగోలు-1, 2, వెల్లంపల్లి, టంగుటూరు కొండపి, కనిగిరి, కందుకూరు-1, డీసీపల్లి, కలిగిరి కేంద్రాల్లో ఏప్రిల్ 9 నుంచి చేపట్టనున్నారు.

# 16న పొట్టి శ్రీరాముల విగ్రహావిష్కరణ

- 58 అడుగుల ఎత్తులో కాంస్యంతో ఏర్పాటు
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అమరజీవి స్మృతి వనం పనుల పరిశీలన

తుళ్లూరు/అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 58 అడుగుల ఎత్తులో అమరజీవి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్మృతి వనంలో జరుగుతున్న పను లను శనివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భావి తరాలకు తెలియజేయాలన్నదే కూట మి ప్రభుత్వ లక్ష్యమని తెలి పారు. పొట్టి శ్రీరాముల 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతి తుళ్లూరులో 6.8 ఎకరాల్లో స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ పేరుతో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పా టు చేస్తున్నామన్నారు. స్మృతి వనంలో ఆయన కాంస్య విగ్రహాన్ని అమరజీవి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తోందన్నారు. అమర జీవి 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఎత్తయి న ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాము లు ఆశయాలను, త్యాగాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే స్మృతి వనం లక్ష్యమని వివరించారు.



### ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు

ఈ నెల 16న అమరజీవి 125వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహావిష్క రణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు హాజరవుతారని వివరించారు. ఆర్యవైశ్యుల సంక్షేమా నికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ చేసిన రోజును రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నాం. వాసవీ మాత పేరుతో ఆమె జన్మించిన పెనుగొండ గ్రామాన్ని వాసవీ పెను గొండగా మార్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై కుంభాభిషేక మహోత్సవం

## దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్నాయుడు



విజయవాడ(చైతన్యరథం): దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవ స్థానంలో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న కుంభాభిషేక మహో త్సవాలలో శనివారం వ్యవసాయ శాఖ మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రికి వేదాశీర్వచనం అందజేశారు. చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను మంత్రికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అమ్మవారి దయాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిం చారు. రైతులకు పంటలు బాగా పండాలని, వారికి గిట్టుబాటు ధరలు లభించి ఆనందంగా జీవించాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు.

# వైసీపీ నేతల అక్రమాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

- చట్టబద్ధమైన భూమిని లాక్కునే యత్నం.. న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి
- రీ-సర్వేలో వారసత్వ భూమి మాయం.. చర్యలు తీసుకోవాలని వినతి
- అర్జీలు స్వీకరించిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు
- సమస్యల పరిష్కారానికి కృషి



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు.

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన సునీత ఇచ్చిన అర్జీలో వివరాలు... 'మా భూమిని శ్మశానం కోసం తీసుకోవడంతో ప్రభుత్వం 21-08-2012న అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సర్వే నెం.154/2లో 2.50 ఎకరాల భూమి కేటాయించింది. సాగును గుర్తిస్తూ 6-6-2019న ఆర్డీవో సదరు భూమిపై పూర్తి హక్కులు కల్పిస్తూ మాకు స్వాధీనం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా అప్పట్లో ప్రక్రియ నిలిచిపోగా ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వంలోని కొందరు వైసీపీ నాయకులు ఆ భూమిని ఆక్రమించి మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.'

చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం శివగంగాపురం గ్రామానికి చెందిన కుమారి ఏమందంటే... 2006 సంవత్సరంలో ప్రభుత్వం సర్వే నెం. 147/2లో రెండు ఎకరాల భూమిని డి-పట్టా రూపంలో మంజూరు చేసింది. అప్పటి నుంచీ ఆ భూమిని సాగు చేసుకుంటూ పట్టాదారు పాసు పుస్తకం కలిగి ఉన్నాను. అయితే కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఎం. గంగయ్య కుమారుడు సుబ్బయ్య, అతడి అనుచరులు భూమి వద్దకు వచ్చి నానా బూతులు తిడుతూ దౌర్జన్యానికి దిగుతున్నారు. ఈ భూమిపై హక్కు కోరుతూ ఎం.సుబ్బయ్య తప్పుడు ఫిర్యాదులతో కలెక్టర్‌ని సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడు. అధికారులు వచ్చి పత్రాలను పరిశీలించి వెళ్లినప్పటికీ సుబ్బయ్య గ్రూపు మాత్రం పదేపదే వచ్చి దౌర్జన్యం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోంది. చట్టబద్ధంగా ప్రభుత్వం ఇచ్చిన భూమిని సాగు చేసుకుంటున్నాను. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి. కానీ సుబ్బయ్య, అతడి అనుచరులు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

కృష్ణా జిల్లా వీరులపాడు మండలం చట్టన్నవరం గ్రామానికి చెందిన సాయి ప్రమోద్ అర్జీలోని అంశాలు.. 'నా తాత యడ్లపల్లి పిచ్చయ్య నుంచి సంక్రమించిన ఆస్తి ఖాతా నెం:395లో మొత్తం 8.11 ఎకరాల భూమి ఉంది. దీనికి సంబంధించిన అన్ని రికార్డులు, పాత పాసుపుస్తకాలు నా వద్ద ఉన్నాయి. సర్వే నెం. 31-2(ఎ)లో 0.60 సెంట్లు, సర్వే నెం. 31-2లో 1.01 ఎకరం, సర్వే నెం. 31-6లో 6.50 ఎకరాలు ఉంది. విజయవాడలో డాక్టరుగా విధులు నిర్వర్తిస్తుండగా నాకు సమాచారం లేకుండానే గత ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వేలో సరిహద్దు రాళ్లను మార్చి వేశారు. కొత్త రికార్డుల ప్రకారం (ఎల్‌పీఎం నెంబర్లు 200, 205, 206) మొత్తం భూమిని కేవలం 7.70 ఎకరాలుగా చూపిస్తూ 0.41 సెంట్ల భూమిని తగ్గించి రికార్డుల్లో నమోదు చేశారు. దీనిపై స్థానిక తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. మండల సర్వేయర్ రెండుసార్లు వచ్చి చూసినా ఎటువంటి పరిష్కారం చూపలేదు. 2026 జనవరి 8న కొత్త పాసు పుస్తకం ఇచ్చినప్పటికీ సమస్యను పరిష్కరించకుండా పాత తప్పుడు వివరాలనే మళ్లీ ప్రింట్ చేసి ఇచ్చారు. ఈ అంశంలో చర్యలు తీసుకుని తన సమస్యను పరిష్కరించాలి' అని కోరాడు.

చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం ములూరు గ్రామానికి చెందిన గురవమ్మ విజ్ఞప్తి ఇలా... 'నా కుమారులతో కలిసి కూలి పనుల ద్వారా వచ్చిన సంపాదనను మా గ్రామానికే చెందిన డి. సోమశేఖర్ వద్ద 2020 నుంచి చీటీలు కడుతున్నాను. 2025 మే నెలలో ఒక చీటీ పాడగా రావాల్సిన రూ.5,55,000 ఇవ్వకుండా సోమశేఖర్ తప్పించుకున్నాడు. 2025 జూన్ 10న నా డబ్బులు అడిగేందుకు సోమశేఖర్ ఇంటికి వెళ్లగా ఆయనతో పాటు భార్య, కుమారుడు సుధీర్, కుమార్తె లక్ష్మీప్రియ, బాలకృష్ణ కలిసి నాపై దౌర్జన్యానికి దిగారు. వీధిలో అందరూ చూస్తుండగానే నా కుమారుడిని బూతులు తిడుతూ కొట్టారు. అంతటితో ఆగక ముందుగానే సిద్ధం చేసుకున్న 5 లీటర్ల పెట్రోలును పోసి నిప్పంటించి చంపే ప్రయత్నం చేశారు. అదృష్టవశాత్తు సమయానికి పోలీసులు రావడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులు రెండు రోజుల్లో డబ్బులు ఇస్తామని రాసిచ్చి కేసు నుంచి తప్పించుకున్నారు. ఆ తర్వాత కేవలం రూ.2,25,000 ఇచ్చి చేతులు దులుపుకున్నారు. 2025 సెప్టెంబరు 5న పూర్తయిన రెండో చీటీ (రూ.6,25,000)తో కలిపి మొత్తం రూ.9,55,000 కోసం ఐదు నెలలుగా అడుగుతున్నా ఇవ్వకుండా బెదిరిస్తూ మోసం చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకొని తన సమస్యను పరిష్కరించాలని కోరాడు.

గుంటూరుకు చెందిన బట్టా శివ రామకృష్ణ, శ్రీను ప్రసాద్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. స్థానిక యాదవ హైస్కూల్, జూనియర్ కాలేజీలో సెక్రటరీ మైలా అంజయ్య ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం చేశారు. గత 10 ఏళ్లుగా జనరల్ బాడీ మీటింగ్‌లు నిర్వహించకుండా కమిటీ సభ్యుల సంతకాలను సెక్రటరీ ఫోర్జరీ చేసి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారు. 10 ఎయిడెడ్ టీచర్ పోస్టులకు ఒక్కొక్కటి రూ.25-30 లక్షల వరకు వసూలు చేసి అక్రమ నియామకాలు చేపట్టారు. స్కూల్ షాపుల అద్దెలు, జూనియర్ కాలేజీ లీజు ద్వారా వచ్చే ఆదాయాన్ని స్కూలు అభివృద్ధికి కాకుండా సెక్రటరీ తన సొంతానికి వాడుకుంటున్నారు. సుమారు రూ.2కోట్ల పాఠశాల నిధులతో పాత గుంటూరులో అక్రమ ఆస్తులు కూడబెట్టారు. టీచర్ల జీతాల్లో వాటాలు అడుగుతూ, ఇవ్వని వారిని సస్పెండ్ చేస్తానని బెదిరింపులకు దిగుతున్నారు. దాతలు విద్య కోసం ఇచ్చిన ఆస్తులను స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్న సెక్రటరీపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాల రికార్డులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరాడు.

ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన రవికుమార్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన అర్జీలో వివరాలు... 'మా గ్రామంలో సర్వే నెం. 542/(డి)లోని స్వగృహంలో నేను నివసిస్తున్నాను. ఇంటి వెనుక బుల్లా మల్లేశ్వరరావు అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఇద్దరి ఇళ్లకు పంచాయతీ రోడ్డు నుంచి నడుచుకోవడానికి తూర్పు వైపు మూడు అడుగుల ఉమ్మడి దారి ఉంది. నా ఇంటి చుట్టూ రక్షణ కోసం మూడు అడుగుల ఖాళీ స్థలాన్ని వదిలిపెట్టాను. జనవరి 27న నేను ఆఫీసుకు వెళ్లిన సమయంలో బుల్లా మల్లేశ్వరరావు నాకు చెందిన మూడు అడుగుల ఖాళీ స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా రెండువైపులా అక్రమంగా గోడలు నిర్మించాడు. దీనివల్ల నా ఇంటి వెనుక భాగానికి వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోయింది. ఈ విషయమై వెంటనే భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ప్రాథమిక విచారణ జరిపారు. ఇది రెవెన్యూ సంబంధిత సమస్య కావడంతో విజయ వాడ రూరల్ తహసీల్దారుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కావున వారిపై చర్యలు తీసుకోని మా సమస్యను పరిష్కరించండి,

చిత్తూరు జిల్లా నింద్ర మండలం కావనూరు గ్రామానికి చెందిన మనోహర్ నాయుడు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చాడు. 'మా గ్రామంలో సర్వే నెం.25-6 విస్తీర్ణం 0.34 సెంట్లు, సర్వే నెం.26-18: విస్తీర్ణం 0.48 సెంట్లు, సర్వే నెం.121-3 విస్తీర్ణం 0.24 సెంట్లు పిత్రార్జితంగా సంక్రమించింది. అవి మా స్వాధీనంలో ఉన్నాయి. ఈ భూములను స్వర్గీయ బి.సుబ్రహ్మణ్యం భార్య బి.భారతి తన పేరిట ఆన్‌లైన్‌లో (ఖాతా నెం. 761, ఎల్‌పీ నెం.443,649) నమోదు చేసుకుంది. సర్వే నెం.121-3 (ఎల్‌పీ నెం.1055)ని రాజేంద్రప్రసాద్ భార్య జమున తన పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకు ని భూమిని స్వాధీనం చేసుకుంది. ఈ విషయమై తహసీల్దారును వివరణ కోరగా... తనకంటే ముందున్న వారు ఇది నమోదు చేశారని, ఆర్డీవోకు ఫిర్యాదు చేసి కేసు వేసుకోండి అని బాధ్యతా రాహిత్యంగా సమాధానం ఇచ్చారు. దీనిపై కేసు వేసి నాలుగు సంవత్సరాలు గడిచినా వాయిదాల చుట్టూ తిరగడమే తప్ప ఫలితం లేదు. ప్రస్తుతం ఈ సర్వే నెంబర్లు ఆన్‌లైన్‌లో బ్లాక్ లిస్ట్‌లో ఉన్నాయి. కావునా చర్యలు తీసుకుని మా భూమి సమస్యను పరిష్కరించాలి' అని కోరాడు. వీటితో పాటు పలువురు పింఛను, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని ఇంకొందరు అభ్యర్థించారు.

# పెట్రలో- డీజిల్ ధరల్లో పెరుగుదల ఉండదు

**● స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం... సరిపడ ఇంధన నిల్వలు ఉన్నాయని వెల్లడి**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న గందరగోళాన్ని చూసిన ప్రతి సామాన్యుడికి ఒక ప్రశ్న తొలచివేస్తుంది. భారతదేశంలో పెట్రోల్ – డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయా? ఈ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఇది చాలా భరోసా ఇచ్చే సమాధానం. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి ఉన్నప్పటికీ, దేశంలో పెట్రోల్ – డీజిల్ ధరలలో పెరుగుదల ఉండదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. భారతదేశ ఇంధన నిల్వలు నిరంతరం మెరుగుపడుతున్నాయి. ఇది ప్రజల జేబులపై ద్రవ్యోల్బణ భారాన్ని తగ్గిస్తుంది. ఇజ్రాయెల్– అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి దగ్గర ఉద్రిక్త వాతావరణ నెలకొంది. భారత్ తన క్రూడ్ ఆయిల్ దిగుమతుల్లో సగానికిపైగా పైగా ఈ జలసంధి నుంచే తీసుకువస్తోంది. దీంతో ఈ అంశం తీవ్ర ఆందోళనలు కలిగిస్తోంది. ఇక్కడ రవాణాకు ఏ మాత్రం ఆంటంకం ఏర్పడినా ఇంధన, సరకు రవాణా వ్యయాలు భారీగా పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెను భారాన్ని మోపనుంది. అయితే ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధంతో పెట్రోల్ షార్టేజ్ వస్తుందని ఇప్పటినుంచే నిల్వ చేయడం మొదలుపెట్టేశారు. ధరలు పెరుగుతాయన్న ఆందోళన మొదలైంది.

**ముడి చమురుపై కేంద్రం 'పరిపూర్ణ' వ్యూహం!**

ఈ భౌగోళిక రాజకీయ సంక్షోభాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం తన దిగుమతి విధానంలో గణనీయమైన మరియు గణనీయమైన మార్పును తీసుకుంది. గతంలో, ముడి చమురు కోసం మనం హార్ముజ్ జలసంధి మార్గంపై ఎక్కువగా ఆధారపడి ఉండేవాళ్ళం. ఇప్పుడు, ప్రభుత్వం ఇతర, సురక్షితమైన ఎంపికల నుండి చమురు దిగుమతులను 10 శాతం పెంచింది. దీని ప్రత్యక్ష ఫలితంగా, గతంలో 60 శాతం ఉన్న హార్ముజ్ జలసంధి ద్వారా దిగుమతులు ఇప్పుడు 70 శాతానికి పెరిగాయి. ఈ వ్యూహాత్మక చర్యకు ధన్యవాదాలు, మనకు ఇప్పుడు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల తగినంత సౌకర్యవంతమైన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**వంట గ్యాస్‌పై ప్రభావం ఎంత?**

గత 12 సంవత్సరాల డేటాను పరిశీలిస్తే, ఉజ్వల యోజన లబ్ధిదారులకు సిలిండర్ ధర రూ.110 పెరిగింది. ఈ ధర 2014లో సిలిండర్‌కు రూ. 500 నుండి ఇప్పుడు రూ.610కు చేరుకుంది. ఇటీవలి రోజుల్లో LPG నిల్వల గురించి కొన్ని ఆందోళనలు ఉన్నాయి, కానీ ప్రభుత్వం ఇప్పుడు ఉత్పత్తిని తిరిగి ప్రాధాన్యత ఇవ్వడానికి వేగంగా కృషి చేస్తోంది. పరిస్థితి ఇప్పుడు నియంత్రణలో ఉందని ప్రభుత్వం తెలిపింది. సహజ వాయువు రంగంలో భారతదేశం కూడా బలమైన స్థానాన్ని సంపాదించింది. ఇరాన్ దాడులు, హార్ముజ్ జలసంధి ఉద్రిక్తతల కారణంగా ఖతార్‌లోని రాస్ లఫాన్ ఉత్పత్తి కేంద్రం ప్రస్తుతం మూసివేశారు. అయితే, సరఫరా మార్గం తిరిగి తెరిచిన వెంటనే గ్యాస్ సరఫరాలను తిరిగి ప్రారంభిస్తామని ఖతార్ భారతదేశానికి హామీ ఇచ్చింది. ప్రస్తుత ఓదార్పు ఏమిటంటే, దేశంలో ఇప్పటికే మిగులు నిల్వలు ఉన్నాయి. అనేక ఇతర దేశాలు కూడా సరఫరా చేయడానికి భారతదేశానికి ప్రతిపాదనలను సమర్పిస్తున్నాయి. భారతదేశంలో ఎరువుల ఉత్పత్తి, దిగుమతి రెండూ గ్యాస్ సరఫరాపై ఆధారపడి ఉన్నందున, ఎరువుల మంత్రిత్వ శాఖతో ఉన్నత స్థాయి చర్చలు కూడా జరుగుతున్నాయి.

# ఏలేరు జలాశయం పరివాహక ప్రాంతంలోనే పెద్దపులి

పోలవరం (చైతన్యరథం): ఏలేరు జలాశయం పరివాహక ప్రాంతంలోనే పెద్ద పులి సంచరిస్తోంది. పోలవరం, కాకినాడ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పులి జాడలను గుర్తించారు. అడ్డతీగల మండలం గొట్టువానిపాలెం, ఏలేశ్వరం మండలం మర్రివీడు పరిసర ప్రాంతాల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. అడ్డతీగల, ఏలేశ్వరం, రాజవొమ్మంగి మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రేడియో కాలర్ ద్వారా పులి జాడను గుర్తించారు. భౌగోళికంగా ప్రతికూల ప్రాంతం కావడంతో పులిని బంధించేందుకు అధికారులు ఇబ్బంది పడుతున్నారు. బోనులు సిద్ధం చేసినా దరిదాపుల్లోకి పులి రావడం లేదు.



# కోటిపల్లి-నరసాపురం కొత్త రైల్వే లైన్

**● ఏపీలో కోటిపల్లి రైల్వే లైన్ పనులు... ముగింపు దశకు చేరిన భూసేకరణ**



నరసాపురం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో రైల్వే లైన్ పనుల్ని వేగవంతం చేసింది. కొత్త ప్రాజెక్టులతో పాటుగా ఎప్పటి నుంచో పెండింగ్ ఉన్నవాటిని కూడా పట్టాలెక్కిస్తున్నారు. గోదావరి ప్రాంతవాసుల ఎన్నో ఏళ్ల కలగా ఉన్న కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్ పనులు వేగవంతం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో నరసాపురం రూరల్, యలమంచిలి మండలాల్లోని గ్రామాల మీదుగా ఈ రైల్వే లైన్ వెళుతోంది. ఈ మేరకు భూమిని సేకరించి పరిహారం కూడా చెల్లించారు. ఈ రైలు మార్గం కోసం సేకరించిన భూమిలో స్తంభాలను పాతుతున్నారు. హద్దుల కోసం ఇలా చేస్తున్నారు. అధికారులు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో 53, యలమంచిలి మండలంలో 66 ఎకరాలు ఉంది. ఆయా గ్రామాల్లో అవసరైమన భూమిని సేకరించి.. ట్రాక్ వేయడం కోసం స్తంభాలను పాతారు. స్టేషన్‌కు చినమామిడిపల్లి కాల్వకు అవతల వైపు హద్దులు వేశారు.. అంతేకాదు పాలకొల్లు రోడ్‌లో ఈ కొత్త రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా కాలువపై బ్రిడ్జి కూడా రానుంది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుంచి విజయవాడకు రైల్వే ట్రాక్ అందుబాటులో ఉంది. ఇప్పుడు కోటిపల్లి నుంచి నరసాపురంల మధ్య కొత్తగా రైల్వే పనులు చేపట్టారు. ఈ రూట్‌లో అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయి. అయితే ఈ రైల్వే లైన్‌లో స్టేషన్లు ఎక్కడ నిర్మిస్తారనే అంశంపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ కొత్త రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే నరసాపురం కూడా పెద్ద జంక్షన్‌గా మారుతుందని చెబుతున్నారు. నరసాపురం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ పథకం కింద రూ.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఇటు కోటిపల్లి రైల్వే లైన్ పనుల్ని కూడా మరింత వేగవంతం చేశారు. కోనసీమ జిల్లాలోని కోటిపల్లి నుంచి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వరకు రూ.2,200 కోట్ల అంచనాతో 57.81 కి.మీ. రైల్వే లైన్ నిర్మిస్తున్నారు. మొత్తం 8 మండలాలు, 25 గ్రామాల మీదుగా ఈ రైల్వే ప్రాజెక్టు చేపట్టారు. అయితే అలైన్‌మెంట్‌పై కొందరు కోర్టుకు వెళ్లడంతో.. స్టే విధించారు. ఇటీవల ఆ స్టేను ఎత్తివేయడంతో మళ్లీ భూసేకరణను వేగవంతం చేశారు. కోనసీమ వాసులు రైలు ఎక్కాలంటే రాజమహేంద్రవరమో, కాకినాడో వెళ్లాల్సి వచ్చేది. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే ఆ ఇబ్బంది తొలగిపోతుంది అంటున్నారు. అన్నీ కుదిరితే మరో మూడేళ్లలో కోనసీమలో రైలు కూత వినిపిస్తుందని భావిస్తున్నారు. ఈ కోటిపల్లి రైల్వే లైన్ పనుల్ని వేగవంతం చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. కోనసీమ వాసులకు ఈ రైల్వే లైన్ ఓ కలగా మిగిలింది. ఎన్నో ఏళ్లుగా ఈ రైల్వే లైన్ కోసం ఎదురు చూస్తున్నారు.. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం (చైతన్యరథం): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. నేడు జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళలు సమాజ అభివృద్ధికి మూలస్తంభమని, వారి సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మహిళల సేవలను గౌరవించడం అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రేపు నిర్వహించబోయే మహిళా దినోత్సవ కార్యక్రమంలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించడంతో పాటు మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశానికి జడ్పీ సీఈవోతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, విజన్--2047 టీమ్ సభ్యులు, ఏపీఎంలు, సీడీపీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# విజయనగరంలో కార్డెన్ సెర్చ్



అయ్యన్నపేట (చైతన్యరథం): నగరంలోని జొన్నగుడ్డి ప్రాంతంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ సౌమ్యలత పోలీస్ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ యువతకు సూచించారు. సరైన ధ్రువపత్రాలు లేని సుమారు 22 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణకు నిత్యం నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం మత్తు పదార్థాలకు జోలికి పోవద్దని యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ తనిఖీల్లో ఒకటో పట్టణ, రెండో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

# లస్కర్ల వేతనాలు పెంపు... ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు చొప్పున పెరిగిన జీతం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. రాష్ట్రంలో లస్కర్ల పారితోషికం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని జలవనరులశాఖ పొరుగు సేవల లస్కర్లు వివిధ డెల్టా వ్యవస్థల్లో, ఇతర చోట్ల పని చేస్తున్నారు.. వారందరికి వేతనాన్ని పెంచారు. ఇకపై వారికి రోజుకు రూ.550 చెల్లించనున్నారు.. ప్రస్తుతం వీరికి రోజుకు రూ.350 పారితోషికంగా ఇస్తున్న సంగతి తెలిసిందే. లస్కర్లు సాగునీటి కాలువల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎంతో కాలంగా వీరంతా అరకొర జీతాలతో ఇబ్బందిపడుతున్నారు. వీరి సమస్యలపై స్పందించిన ఏపీ ప్రభుత్వం రోజువారీ రూ.350 ఉన్న వేతనాన్ని రూ.550కు పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేసింది.. తాజా నిర్ణయంతో ఒక్కొక్కరికి నెలకు రూ.6వేల చొప్పున జీతం పెరిగింది. చాలా కాలంగా లస్కర్లు ఖాళీలున్న చోట్ల భర్తీ చేయలేదు.. దీంతో అవుట్ సోర్సింగ్ లస్కర్లే రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ప్రాజెక్టుల దగ్గర విధుల్లో ఉంటున్నారు. వీరు కాలువల దగ్గర కీలక బాధ్యతల్లో ఉంటున్నారు. నీటి నియంత్రణ, కాలువలకు అడ్డుపడిన తూడు తొలగింపు, ఆక్విడెక్టు, ప్రాజెక్టుల దగ్గర పహారాగా ఉంటారు.. గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుంటారు. అయితే చాలాకాలంగా అరకొరగా జీతాలతో, సిబ్బంది కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎంతోకాలంగా జీతాలు పెంచమని కోరుతున్నారు. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం 2025--26 ఎస్ఓఆర్ రేట్ల ప్రకారం వేతనాలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లస్కర్లు వేతనాలు పెంచుతామని అసెంబ్లీలో ప్రకటించారు. ఆ వెంటనే జీతాల పెంపుపై జీవో కూడా జారీ అయ్యింది. వేతనాలు పెరగడంతో మలస్కర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. అలాగే లస్కర్లు పోస్టుల్ని భర్తీ చేయాలని కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా జీతాలు పెంచమని కోరుతున్నామని.. ఇప్పుడు జీతాలు పెంచడం ఆనందంగా ఉందంటున్నారు. మరోవైపు ఏపీలో 28 జిల్లాల్లో జాయింట్ కలెక్టర్లు, అదనపు జిల్లా మేజిస్ట్రేట్లకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఇకపై ఈ అధికారులు ఆయా జిల్లాల్లోని ప్రాజెక్టులకు సంబంధించిన పునరావాస పాలనాధికారులుగా వ్యవహరిస్తారు. 2013 పునరావాస చట్టం ప్రకారం కొత్తగా మరో రెండు జిల్లాలు ఏర్పడటంతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఈ ఉత్తర్వులు పోలవరం ప్రాజెక్టుకు మాత్రం వర్తించవు.

# మహిళల గౌరవాన్ని పెంచిన ప్రభుత్వం మాది : ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**●కూటమి ప్రభుత్వం ఇచ్చిన పథకాలు మరే ప్రభుత్వం ఇవ్వలేదు**

**●మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ**



ఏలూరు (చైతన్యరథం): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా తెలుగింటి ఆడపడుచులకు, మహిళామణులకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈమేరకు ఒకప్రకటన విడుదల చేసిన ఎంపీ.. మహిళాభివృద్ధితోనే సమాజాభివృద్ధి అని, సమాజంలో వెలుగులు నింపే శక్తి మహిళలకే ఉందని బలంగా నమ్మి పనిచేస్తూ, మహిళ భద్రత, గౌరవం, సాధికారతకు కట్టుబడి ఉన్నామని తన ప్రకటనలో తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారత కోసమే పనిచేస్తోందని, మహిళలకు ఆస్తిలో వాటా కల్పించడం నుంచి విద్య, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించడం వరకు మహిళాభ్యుదయ కార్యక్రమాలు ఎన్నో చేసి ఫలితాలను సాధించిన విషయం తెలిసిందేనన్నారు. తాజాగా 2026- 27 వార్షిక బడ్జెట్ లో మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నడూ లేని విధంగా రూ.4,581 కోట్లు, తల్లికి వందనం పథకానికి 9,668 కోట్లు కేటాయించడం మహిళల సంక్షేమంపట్ల కూటమి ప్రభుత్వానికిగల చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. అలాగే 'దీపం 2' స్కీమ్ కింద ఇప్పటివరకూ 90లక్షల మందికి పైగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతం లాంటి చర్యలతో పేద మహిళల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. మహిళలను మహాశక్తులుగా మార్చేందుకే "మహాశక్తి పథకం" ప్రకటించామన్నారు. మహిళలకు ప్రత్యేకంగా 22 సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొన్నారు. ప్రతి తల్లి, చెల్లి, ప్రతి ఇల్లు బాగుంటేనే నిజమైన మహిళా సాధికారిత అని, ఆ దిశగా అందరూ అడుగులు వేద్దామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పిలుపునిచ్చారు.

# మచిలీపట్నంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**●మహిళలు మరింత చైతన్యవంతులు కావాలని ఆకాంక్షించిన మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం (చైతన్యరథం): మహిళలు మరింత చైతన్యవంతులు కావాలని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. శనివారం కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పార్టీ కార్యాలయంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకటగురుమూర్తి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మరియు కృష్ణా జిల్లా మహిళా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత ఘనంగా సన్మానించారు. తొలుత మహిళలకు టీడీపీ తరఫున పసుపు కుంకాలు, తాంబూలం గాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఆనందోత్సవాలతో పాల్గొన్నారు. మహిళా మణులు నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళా సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఆది నుంచి కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ... మహిళలకు ఆస్తి హక్కును కల్పించి మహిళలకు అండగా నిలిచింది అన్న నందమూరి తారక రామారావు అని అన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. రాజకీయంలోకి కూడా రావాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలే మహారాణులని ఆయనే సందర్భంగా కీర్తించారు.

**కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ..**

కృష్ణాజిల్లాలో వివిధ రంగాలలో ప్రతిభ చాటిన మహిళా మణులకు సత్కారం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మహిళను గౌరవించడం మన సంప్రదాయమని ఆయన తెలిపారు. తెలుగుదేశంపార్టీ స్థాపించిన తర్వాత అన్న నందమూరి తారక రామారావు మహిళలకు స్థానిక సంస్థలలో 8 శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. అదేవిధంగా మహిళలకు ఆస్తిలో హక్కు పద్మావతి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలను విద్య పరంగా మరియు డ్వాక్రా పథకం ప్రవేశపెట్టి ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లారని, ఈ విధంగా మహిళా సాధికారతకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు అలాగే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసి మహిళలకు కూటమి ప్రభుత్వంపై ఉన్న నిబద్ధతను తెలియజేసిందన్నారు. అదేవిధంగా మహిళలు రానున్న రోజుల్లో మరింత ఎత్తుకు ఎదగాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

**జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాట్లాడుతూ...** సృష్టి మొదల నుంచి అంతం వరకు మహిళ లేనిదే ఏ జీవి లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మొట్టమొదటిగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి తెలుగుదేశంపార్టీకి మహిళలపై ఉన్న నిబద్ధతను చాటి చెప్పారన్నారు. అదేవిధంగా మహిళా ఉపాధి కోసం పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే సాధ్యమన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్స్ విభాగం నుండి సాయి లలిత, సేవారంగం నుండి మరీదు మాధవిలత మరియు కరెడ్ల సుశీల, విద్యారంగం నుండి లింగమనేని స్రవంతి, కూచిపూడి నృత్యం నుండి కంచిపట్ల వెంకట జ్యోతి, పారిశ్రామిక రంగం నుండి జంపాన నాగదుర్గ, నాటక రంగం నుండి నత్త కమల కుమారి, స్పోర్ట్స్ రంగం నుండి నగిడి గాయత్రి, మరియు విజయ కుమారి, కోలాటం నుండి పలపత్తి పద్మజ, అంగన్వాడీ టీచర్‌గా రత్నశ్రీ, ఉత్తమ ఆయాగా నాగేంద్రమ్మ తదితరులను ఘనంగా సత్కరించారు.

# పిల్లల హక్కుల పరిరక్షణలో సమాజం మొత్తం భాగస్వామ్యం కావాలి

**●నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ రైట్స్ ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి**




గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగరంలోని ఐటీసీ వెల్కమ్ హోటల్‌లో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ రైట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన చైల్డ్ ప్రొటెక్షన్ కాన్ఫరెన్స్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ సెక్రటరీ సూర్యకుమారి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...

పిల్లల హక్కుల పరిరక్షణ, వారి భద్రత, వారి సమగ్ర వికాసంపై సమాజం మొత్తం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో సోషల్ మీడియా, అధిక స్క్రీన్ టైం పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వర్కింగ్ పేరెంట్స్ జీవిత విధానంలో పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఒకప్పుడు పిల్లలు బయట ఆడుకుంటూ సమయం గడిపే పరిస్థితి ఉండేదని, అయితే ఇప్పుడు ఇంట్లోనే ఉండే పిల్లలను బయటికి వెళ్లి ఆడమని చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 13 సంవత్సరాల లోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించాలని ప్రకటించడం మంచి నిర్ణయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అయితే ప్రాక్టికల్‌గా చూస్తే చాలా మంది పిల్లలు తమ తల్లిదండ్రుల అకౌంట్ల ద్వారా సోషల్ మీడియా వినియోగిస్తున్నారనే విషయం కూడా గమనించాల్సిన అవసరం ఉందన్నారు. స్క్రీన్ టైం అధికమవడం వల్ల పిల్లల మానసిక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని వైద్యులు కూడా సూచిస్తున్నారని చెప్పారు. కాబట్టి పిల్లలను సోషల్ మీడియా ప్రభావం నుంచి కాపాడటానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఆటపాటలు చాలా ముఖ్యమని, అయితే ప్రస్తుతం చాలా పాఠశాలల్లో ప్లే గ్రౌండ్లు లేకపోవడం ఆందోళనకర విషయమని అన్నారు. ప్లే గ్రౌండ్ లేని పాఠశాలలకు అనుమతులు ఇవ్వకూడదని అధికారులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. పిల్లలకు ఆటపాటలు కూడా ఒక ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. ఇప్పటి పిల్లలు కేవలం కుటుంబాల ఆస్తుల పరిరక్షకులు మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తు బాధ్యతను మోసే పౌరులని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

# విజయవాడలో సింథటిక్ డ్రగ్స్ - పోలీసుల అదుపులో యువకులు

**●16 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**



విజయవాడ (చైతన్యరథం): ఉన్నత చదువులను అభ్యసించి దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించాల్సిన యువత మత్తుకోరల్లో చిక్కుకుపోతున్నారు. మత్తు విక్రయదారులు తెలివిగా యూత్‌ను ఈ ఊబిలోకి నెట్టేస్తున్నారు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఈ దందా చాప కింద నీరులా పాకుతూనే ఉంది. రాష్ట్రంలోని పోలీసు వ్యవస్థ దీనికి చరమగీతం పాడాలని గట్టి నిఘానే పెట్టింది. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో మత్తు వల విసురుతున్న వ్యక్తులు పట్టుబడుతున్నారు. ఎండీఎంఏ విక్రయ, కొనుగోళ్లకు సంబంధించి తాజాగా నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ పోలీసులు సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మాచవరం పీఎస్ పరిధిలో టాస్క్ ఫోర్స్, పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. నలుగురు యువకుల నుంచి 16 గ్రాముల MDMA డ్రగ్స్‌ను సీజ్ చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బెంగళూరులో డ్రగ్స్‌ను కొనుగోలు చేసినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. విజయవాడలోని ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్న సమయంలో నలుగురు యువకులు స్నేహితులుగా మారారన్నారు. మత్తు పదార్థాలు సేవించేందుకు బెంగళూరు వెళ్లి అక్కడ MDMAను కొనుగోలు చేసినట్టు దర్యాప్తులో గుర్తించామన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధ తనిఖీలు :**

ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమంలో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు నిర్బంధ తనిఖీలు చేస్తున్నారు. జిల్లా ఎస్పీల ఆదేశాలతో తెల్లవారుజాము నుంచే పలు జిల్లాల్లో వందకుపైగా బృందాలతో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలు సీజ్ చేయడంతో పాటు అనుమానిత వ్యక్తులు, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధన ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలో 100 చోట్ల ఆపరేషన్ వజ్రప్రహార్ కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. గుంటూరు శివారులోని ఐద్వానగర్‌లో ఆపరేషన్ వజ్రప్రహార్‌లో ఆయన స్వయంగా పాల్గొన్నారు. గంజాయి సరఫరా జరిగే 849 హాట్ స్పాట్స్ గుర్తించి ఆ ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ ద్వారా గంజాయి అదుపులోకి తీసుకొచ్చామన్నారు.

**250 మంది అరెస్టు :**

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్డెన్ సెర్చ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, గత నాలుగు నెలల్లో గంజాయి అమ్మేవారితోపాటు వినియోగించేవారు, సరఫరా చేసే 250మందిని అరెస్టు చేశామన్నారు. గంజాయి అమ్మకాలు చేస్తున్న 8మందిపై పీడీ యాక్ట్ పెట్టామని చెప్పారు. గంజాయి నియంత్రణలో సహకరిస్తామని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. మరోవైపు డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దాలనే కూటమి ప్రభుత్వ లక్ష్య సాధనకు అనుగుణంగా ఈగల్ సెల్ నిర్విరామంగా పని చేస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో "డ్రగ్స్ వద్దు బ్రో – సైకిల్ తొక్కు బ్రో" కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు.

# తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

●పసుమర్రు ప్రజల తాగునీటి అవసరాలకు బొప్పూడి లిఫ్ట్ నుంచి స్థానిక చెరువును నీటితో నింపండి

●ఆటోనగర్ కార్మికులు లేవనెత్తిన సమస్యలు రోజుల వ్యవధిలో పరిష్కారం కావాలి

●సంకురాత్రి పాడు గ్రామాభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయండి

●ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మాజీమంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): పసుమర్రు ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం, వేసవిలో ఎదురయ్యే నీటిఎద్దడి దృష్ట్యా ఇప్పుడే గ్రామంలోని చెరువును నీటితో నింపాలని, బొప్పూడి లిఫ్ట్ నుంచి నీటిని తరలించేలా చూడాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు సూచించారు. శనివారం ఆయన తన నివాసంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పసుమర్రు గ్రామస్తులు ప్రత్తిపాటిని కలిసి గ్రామాభివృద్ధి, ఇతర సమస్యలు తెలియచేస్తూ వినతిపత్రం అందించారు. వారి వినతిని పరిశీలించిన ప్రత్తిపాటి.. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా గ్రామంలోని చెరువును వెంటనే నీటితో నింపాలని పంచాయతీ, ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు.

**ఆటోనగర్ సమస్యల్ని రోజుల వ్యవధిలో పరిష్కరించండి..**

ఆటోనగర్ కార్మికులకు స్థానికంగా కేటాయించిన ప్లాట్లలో కొలతలు తేడాలున్నాయని, హద్దులు సరిగా లేనందున సమస్యలు వస్తున్నాయని, రెండో ఫేజ్‌లో రోడ్లు, కాలువలు నిర్మించాల్సి ఉందని, నీటి అవసరాలకోసం బోర్లు వేయించాలని, ఆటోనగర్ ప్రవేశంలో ప్రత్యేక స్వాగతద్వారం (ఆర్చీ) నిర్మించాలని స్థానిక కార్మికులు ప్రత్తిపాటిని కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలియచేస్తూ వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన ప్రత్తిపాటి ప్లాట్ల హద్దుల సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని మండల సర్వేయర్ ప్రసాద్‌కు సూచించారు.

**గతేడాది తలెత్తిన తాగునీటి సమస్యలు ఈ ఏడాది పునరావృతం కాకూడదు..**

పట్టణ ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించిన ప్రత్తిపాటి.. చిన్నచిన్న సమస్యలను యంత్రాంగం అశ్రద్ధ చేయడం తగదని, మంచినీరు, రోడ్లు, పారిశుధ్య నిర్వహణా లోపాలు వంటి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టంచేశారు. మున్సిపల్ సిబ్బంది పట్టణ ప్రజల తాగునీటి సమస్యపై వెంటనే దృష్టి సారించాలని, గతేడాది తలెత్తిన నీటిసరఫరాలో ఏర్పడిన లోపాలు మరలా ఈ ఏడాది ఎక్కడా పునరావృతం కాకూడదని ప్రత్తిపాటి ఆదేశించారు.

# కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం

◆ ప్రజాదర్బార్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో పాలన సాగిస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు రోడ్డులో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అధికారులు, టీడీపీ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజల నుంచి నేరుగా విజ్ఞాపనలు స్వీకరించి ఆయా సమస్యల పరిష్కారంకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న స్వయంగా ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ....పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చొరవతో పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల ముంగిట్లోకే ప్రజా ప్రభుత్వం వచ్చిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో పార్టీ అధిష్ఠానం సూచనలతో నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలోనూ ప్రజా దర్బార్ కార్యక్రమాలను ఎంపీ కేశినేని శివనాథ్ ఏర్పాటు చేయించి అన్ని విభాగాలకు చెందిన అధికారులను ప్రజల వద్దకే తీసుకువస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఆయా సమస్యల పరిష్కారంకు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం టీడీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని ప్రజా దర్బార్‌లు రుజువు చేస్తున్నాయన్నారు. ప్రజాదర్బార్‌ను ప్రజలంతా వినియోగించుకుని తమ సమస్యలను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు నేరుగా అందిస్తున్నారన్నారు. అధికారులు సైతం తక్షణమే స్పందిస్తూ సమస్యల పరిష్కారంకు చర్యలు తీసుకుంటున్నారని బుద్దా వెంకన్న తెలిపారు. రాష్ట్ర సంక్షేమం, ప్రజలకు సుపరిపాలన టీడీపీ ప్రభుత్వం మాత్రమే అందించగలదన్నారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు భేష్ : ధూళిపాళ్ల నరేంద్ర



పొన్నూరు (చైతన్యరథం): మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం మరియు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ 120 మంది పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ... పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని అన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వారి ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు కష్టపడుతున్న పారిశుధ్య కార్మికులకు ఇలాంటి సహాయాలు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# అపరాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



బాపట్ల (చైతన్యరథం): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మరాజు పేర్కొన్నారు. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన మినుములు, పెసలు మరియు శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు తాము పండించిన మినుము, పెసర, శనగ పంటలను నేరుగా ప్రభుత్వానికే విక్రయించి లాభపడాలని, దళారీలను నమ్మి మోసపోవద్దని ఆయన కోరారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని, తూకంలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన సొమ్మును రైతుల ఖాతాల్లోకి సకాలంలో జమ చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. తమ గ్రామంలోనే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినందుకు అప్పికట్ల గ్రామ రైతులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, కూటమి నాయకులు, స్థానిక నాయకులు, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఫలించిన ఎంపీ కేశినేని శివనాథ్ కృషి...

## జగ్గయ్యపేట మున్సిపాలిటీ హోదా పెంపు

●గ్రేడ్-II నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్

●2022-23, 2024-25 ఏడాదికి ఆదాయ, వ్యయాలు... పరిగణనలోకి తీసుకుని హోదా పెంపు నిర్ణయం



విజయవాడ (చైతన్యరథం): జగ్గయ్యపేట మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తా... కృషి చేస్తా అన్న మాటలను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ నిలుపుకున్నారు. పురపాలక సంఘం హోదా పెంపు కోసం స్థానిక శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులతో కలిసి పలు దఫాలుగా ఎంపీ శివనాథ్ సంబంధిత మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో మాట్లాడారు. గత ఏడాది మే 20వ తేదిన జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలోనూ మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారంకు, హోదా పెరుగుదలకు కృషి చేస్తానని చెప్పారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఇంకా అభివృద్ధి చెందాలి. పన్నులు పెరగకుండా, ఖర్చులు తగ్గించి ఆదాయం పెరిగే విధంగా చూడాలి. మున్సిపాలిటీ అభివృద్ధికి కావాల్సిన సహకారం అందిస్తానని జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎంపీ శివనాథ్ చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో కలసి సమావేశంలో పాల్గొన్న ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ హోదా పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రల సహకారంతో మున్సిపాలిటీ హోదా పెరుగుదలకు కృషి చేయగా ఈ మేరకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జగ్గయ్యపేట మున్సిపాలిటీని గ్రేడ్-II నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జగ్గయ్యపేట 1982లో పంచాయితీగా ఏర్పడింది. అనంతరం 2001లో గ్రేడ్ 3 మున్సిపాలిటీగానూ, 2009లో గ్రేడ్ -2 మున్సిపాలిటీగానూ అభివృద్ధి చెందింది. అయితే ప్రస్తుతం జగ్గయ్యపేట పురపాలక సంఘంలో 80వేల మంది జనాభాతో పాటుగా ఆదాయ పరంగానూ పరిస్థితి మెరుగ్గానే ఉండటంతో మున్సిపాలిటీ గ్రేడ్-II నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ పలు దఫాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం గ్రేడ్-II నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవో ఇవ్వడంతో జగ్గయ్యపేట మరింతగా అభివృద్ధి చెందనుంది. ఇంజనీరింగ్ విభాగంలో ఈఈ స్థాయి అధికారి, ఇద్దరు డీఈలు ఇకపై ఉండనున్నారు.

# గుంటూరు నగరాభివృద్ధిపై స్టాండింగ్ కమిటీ సమావేశం... పాల్గొన్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు (చైతన్యరథం): నగర మేయర్ మరియు స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ నందు జరిగిన స్టాండింగ్ కమిటీ (స్థాయి సంఘం) సమావేశము నందు నగరాభివృద్ధి కొరకు సభ్యులు ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులపై మరియు 2026-27 సంవత్సరానికి సంబంధించి అధికారులు ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చర్చించి ఆమోదించడం జరిగింది. ఈ సమావేశంలో నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఐ.ఏ.యస్, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వరరావు, సూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీ దుర్గ, ముప్పవరపు భారతి తదితరులు పాల్గొన్నారు.

# విలువలు తెలియని వైసీపీ మూర్ఖులు

## వైసీపీ ప్రజాంప్రతినిధుల తీరుపై ధ్వజమెత్తిన టీడీపీ నాయకులు



ఒంగోలు(చైతన్యరథం): నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి డోలా బాల వీరంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, జనసేన నాయకులు కంది రవి శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ అత్యున్నత చట్టసభ శాసన మండలిలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి చిత్రపటాల పట్ల వైసీపీ నాయకులు ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని తెలిపారు. దేవుడి చిత్రపటాలను బూట్లు, చెప్పులతో పట్టుకోవడం, అనంతరం వాటిని నిర్లక్ష్యంగా విసరడం అత్యంత హేయమైన చర్య. ప్రజల విశ్వాసాలు, ఆధ్యాత్మిక విలువలు సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు మత సామరస్యాన్ని దెబ్బతీసే విధానాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. మీడియా ఈ అంశాన్ని బాధ్యతాయుతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతున్నానని తెలియజేసారు. మీడియా సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రవర్తించిన తీరును స్క్రీన్ మీద వేసి ప్రదర్శించారు. ఈ. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# 25న సీఎం వెలుగొండ పర్యటన

## ఏర్పాట్లు పర్యవేక్షించిన అధికార బృందం

యర్రగొండపాలెం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగొండ ప్రాజెక్టుపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా నెల 25వ తేదీన వెలుగొండ ప్రాజెక్ట్ సొరంగాలు, ఫీడర్ కెనాల్ పనుల పరిశీలనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను మరింత వేగవంతం చేశారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన పర్యటన పర్యవేక్షణ బృందం అధికార సిబ్బందితో కలిసి టన్నెల్ లోపల జరుగుతున్న లైనింగ్ వర్క్స్ పనులను పరిశీలించారు. ఈ క్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాస రెడ్డితో కలిసి హెలిప్యాడ్ సభా స్థలం పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రతి ఏర్పాటును సమగ్రంగా పరిశీలిస్తూ, ఎటువంటి లోపాలు లేకుండా ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలనే దృఢ సంకల్పంతో అధికారులు పార్టీ నాయకులతో సమన్వయం చేస్తున్నారు.



ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయంలో 58 మంది లబ్ధిదారులకు 67 లక్షల 21 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు

# వైభవంగా వేణుతల కాటంరాజు గంగాభవాని జయంతి

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ



మార్కాపురం (చైతన్యరథం): యర్రగొండపాలెం నియోజకవర్గం, పెద్దారవీడు మండలంలో శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవానీ జయంతి వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. స్వామివారిని భక్తిభావంతో దర్శించుకున్నారు. గుడి అభివృద్ధి, సౌకర్యాల పెంపొందింపు గురించి స్థానిక నాయకులు, భక్తులతో వివిధ అంశాలపై చర్చించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా మారేలా గుడి అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలు, భక్తులు గొప్ప ఆనందాన్ని అనుభవించారని, టూరిజం, ఆధ్యాత్మిక అభివృద్ధికి డాక్టర్ నూకసాని బాలాజీ కృషి అభినందనీయమని భక్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో గుడి చైర్మన్ గుమ్మ గంగరాజు యాదవ్, ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ నక్కా శ్రీను, మూఢమంచు కొండగూరవయ్య, ఎఎవమ్‌సీ వైస్ చైర్మన్ పాముల పెద్దిరాజు, గంగుల యలయ్య, తోకల యల్లయ్య, పాముల పోలురాజు, గోసు సుబ్బారావు యాదవ్, రాజేశ్వరి రెడ్డి, గాలయ్య, పాలంకయ్య, నాలి శ్రీను, రాగాల ఈశ్వర్ కుమార్, గొర్ల రామయ్య, చేతుల నాగరాజు, ఆవులరాజు, స్థానిక ప్రజలు భక్తులు పాల్గొన్నారు.



జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామం నందు శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థాన ట్రస్టు బోర్డు నూతన చైర్మన్‌గా పోటు పెదబాబు, పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరితో కలిసి పాల్గొన్న రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు

# వైభవోపేతంగా ప్రసన్న వెంకటేశ్వరుని చక్రస్నానం

## ముఖ్య అతిథులుగా పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు



బిట్రగుంట (చైతన్యరథం): కలియుగ దైవం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి చక్రస్నాన ఉభయం స్వామివారి అనుగ్రహంతోనే సాధ్యమైందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు అన్నారు. కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఉదయం స్వామివారికి అంగరంగ వైభవంగా స్నపన తిరుమంజనం, చక్రస్నానం జరిగాయి. ముందుగా స్వామి వారి కోనేరు వద్దకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వేమిరెడ్డి దంపతులు అర్చకులతో కలిసి కోనేరులో చక్ర స్నానం చేశారు. గోవింద నామ స్మరణల మధ్య కోనేరు ప్రాంగనం మార్మోగిపోయింది. అనంతరం కొండపై స్వామివార్లను వేమిరెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదాశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి వార్లకు చక్ర స్నానం మా చేతులమీదుగా నిర్వహించడం అదృష్టమన్నారు. ఇక ప్రతి బ్రహ్మోత్సవాల్లో చక్ర స్నానం ఉభయం తాము నిర్వహిస్తామన్నారు. చోళుల కాలం నాటి కోనేరును బాగు చేసి నిర్మించడం గొప్ప వరమని చెప్పారు. ఇది తమకు స్వామి వారి అనుగ్రహమని చెప్పారు. ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషముగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.

# ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి : దివ్యాంగులకు ఎంపీ వేమిరెడ్డి పిలుపు

నెల్లూరు, (చైతన్యరథం): దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం నింపేలా ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను అందజేస్తున్నామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వీపీఆర్ నివాసంలో ఐదుగురు దివ్యాంగులకు ఆయన ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందించారు. ఇందులో కొండాపురం మండలం తూర్పు యర్రబల్లి గ్రామంలో 4 దివ్యాంగులకు, నెల్లూరు రూరల్ పరిధిలో ఒక వ్యక్తికి ట్రై సైకిల్ అందజేశారు. దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ ద్వారా దివ్యాంగులు ఎవరి సాయం లేకుండానే బయటకు వెళ్లి స్వయం ఉపాధి పొందాలన్నారు. ఆత్మ విశ్వాసానికి వైకల్యము అడ్డుకాదని నిరూపించాలని దివ్యాంగులను సూచించారు. ట్రై సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# కడప ప్రజలకు వైఎస్ కుటుంబం చేసిందేమీ లేదు

## లోక్‌సభ మాజీ సభ్యుడు మాజీ ఎంపీ చింతా మోహన్



కడప (చైతన్యరథం): వైఎస్ కుటుంబం 11 ఏళ్లపాటు ముఖ్యమంత్రి పదవి అనుభవించిందని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. అయినప్పటికీ కడప జిల్లా ప్రజలకు వైఎస్ కుటుంబం చేసిందేమీ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రుల్లో జగన్మోహన్రెడ్డి సంపన్నుడని అన్నారు. వైఎస్సార్ కడపలోని ప్రెస్ క్లబ్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప ఎమ్మెల్యే రహదారుల మరమ్మతుల కోసం రూ.కోటి నిధులు విడుదల చేయించుకోలేకపోతున్నారని విమర్శించారు. 2029లో ఏపీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని.. వచ్చిన వెంటనే రాయచోటిని జిల్లా కేంద్రంగా చేస్తామన్నారు. ఇటీవల కాలంలో ప్రపంచ దేశాధినేతలు సెక్స్ రాకెట్లో ఇరుక్కుపోయారని, ఆ వివరాలు ఇరాన్ బయట పెడుతుందనే భయంతోనే యుద్ధాలు చేస్తున్నారని ఆరోపించారు.

# నిప్పులు కురిపిస్తున్న ప్రచండభానుడు

## తిరుపతి నగరంలో నిర్మానుష్య దృశ్యాలు








# ప్రజలతోనే మా ప్రయాణం

## టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి వెల్లడి



నెల్లూరు రూరల్(చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్, నేతాజీ నగర్, 3వ వీధిలో 14 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేషన్ అధికారులు, కూటమి నాయకులతో కలసి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 33వ డివిజన్ అభివృద్ధికి 3 కోట్ల 52 లక్షల రూపాయల నిధులు కేటాయించామన్నారు.

స్థానిక ప్రజల సూచనలు, అభ్యర్థన మేరకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. చెప్పిన మాట ప్రకారం 60 రోజుల్లో 240 పనులు పూర్తి చేసి, మార్చి 3వ వారంలో కూటమి నాయకుల సమక్షంలో ప్రజలచేతే ప్రారంభోత్సవాలు చేయిస్తామన్నారు. ప్రజలతోనే తమ ప్రయాణం సాగుతుందనాన్నరు. తమ ప్రతి అడుగులోనూ అభివృద్ధి ప్రతిబింబించాలని భావిస్తామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సారథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

నెల్లూరు రూరల్ అభివృద్ధికి తోడ్పాటునిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఎల్లవేళలా ప్రజల ఆశీస్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జ్ లు మన్నెం పెంచల నాయుడు, జలదంకి సుధాకర్, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి. కృష్ణా రెడ్డి, 33వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కరణం హజరత్ నాయుడు, రాజేష్, అలగల ప్రభాకర్, నాగేంద్ర సింగ్, కటారి వెంకట రమణయ్య, షేక్. సయ్యద్ బాబు, రమణయ్య నాయుడు, రత్నం, శ్రీనివాసులు రెడ్డి, కిషోర్ రాజు, షేక్.మస్తాన్, డిష్ చిన్న, నవీన్, మాధురి, మురగ, ఖాదర్ వల్లీ, షేక్. షఫీ, నాని, మౌలాలి, పవన్, నరేష్, మస్తాన్, చందు, మోహలివ్, వినయ్, విజయ్, ఆనంద్, సోమశేఖర్, ప్రసాద్, సాదిక్, సుబాష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# హైటెక్ సిటీ ఏర్పాటుతో ఐటీ విప్లవానికి సీఎం చంద్రబాబు కొత్త ఊపిరి

## యర్రగొండపాలెం టీడీపీ ఇంఛార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు



యర్రగొండపాలెం(చైతన్యరథం): అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్తు సాంకేతిక నగరంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీర్చిదిద్దుతున్నారని యర్రగొండపాలెం టీడీపీ ఇంఛార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు అన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటనను శనివారం విడుదల చేశారు. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక రంగాలు ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించబోతున్న ఈ సమయంలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేయడం సీఎం చంద్రబాబుకు ఉన్న దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రాన్ని గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌పై నిలబెట్టేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉమ్మడి ఏపీలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ఏర్పాటుతో ఐటీ విప్లవానికి నాంది పలికారని గుర్తు చేశారు. ఇప్పుడు అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు ద్వారా భవిష్యత్తు టెక్నాలజీ దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ఎరిక్షన్ బాబు తెలిపారు.

### విస్తృతంగా యువతకు అవకాశాలు

క్వాంటమ్ వ్యాలీ ద్వారా రాష్ట్ర యువతకు అత్యాధునిక సాంకేతిక రంగంలో ప్రపంచ స్థాయి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. క్వాంటమ్ టెక్నాలజీపై పరిశోధనలు జరిగి కొత్త ఆవిష్కరణలు వెలువడే అవకాశం ఉంటుంది. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు ఇది పెద్ద అవకాశంగా మారుతుంది. అత్యాధునిక సాంకేతిక అవకాశాలు రాష్ట్రంలోనే లభించడంతో విదేశాలకు వెళ్లకుండా ప్రతిభ రాష్ట్రంలోనే నిలుస్తుందన్నారు. విద్యార్థులకు క్వాంటమ్ టెక్నాలజీ, ఏఐ, డీప్ టెక్ వంటి కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఔషధ పరిశోధన వంటి కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు.

### దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ: నిర్లక్ష్యంపై అధికారులకు హెచ్చరిక



దోర్నాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన యర్రగొండపాలెం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు విద్యార్థులకు త్రాగునీరు అందించే ఆర్వో ప్లాంట్ పూర్తిగా అశుభ్రంగా, నిర్వహణ లేకుండా ఉండటాన్ని గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత స్కూల్ యాజమాన్యం అధికారులను వెంటనే పిలిపించి, ఇలాంటి పరిస్థితులు మళ్లీ కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో త్రాగునీటి శుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, వెంటనే ప్లాంట్‌ను శుభ్రపరిచి సక్రమంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. స్కూల్ ఆవరణంలో వాహనాల పార్కింగ్ ను తొలగించాలని విద్యార్థులు కోరగా తక్షణమే తగిన చర్యలను తీసుకోవాలని ఎస్సైకి సూచనలు చేశారు. విద్యార్థుల సంక్షేమమే తమకు ముఖ్యమని, విద్యార్థుల సౌకర్యాల విషయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి నిర్లక్ష్యాన్ని అసలు సహించబోమని స్పష్టం చేశారు.

ప్రవాసాంధ్ర
NRI TDP
చైతన్యరథం

## 'తాల్' ఆధ్వర్యంలో లండన్‌లో 21న

# ఉగాది సంబరాలు

నార్త్ హోల్ట్: తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ (తాల్) ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. మార్చి 21వ తేదీ శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నార్త్ హోల్ట్‌లోని 'ఇండియా గార్డెన్స్' వేదికగా ఈ వేడుకలు నిర్వహించనున్నారు.

ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. ఫోక్ సింగర్ రేలారే గంగ, నల్గొండ గద్దర్ నర్సన్న, ప్లేబ్యాక్ సింగర్స్ అఖిల్ చంద్ర, శ్రీనిక మహతి తమ ప్రదర్శనలతో అలరించనున్నారు. యాంకర్ రవి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. సినీ సంగీతం, బృంద నృత్యాలు, హాస్య వల్లరితో పాటు సంప్రదాయ పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి విందు ఉంటుంది.




టికెట్ వివరాలు: పెద్దలకు (13 ఏళ్లు పైబడిన వారు 30 పౌండ్లు, పిల్లలకు (5–12 ఏళ్లు) 20పౌండ్లుగా నిర్ణయించారు. ఐదేళ్లలోపు పిల్లలకు ప్రవేశం ఉచితం. ఈ ధరలోనే స్నాక్స్, డిన్నర్ కూడా కలిపి ఉంటాయి.

తెలుగు సంస్కృతిని, భాషను ప్రవాసంలో ఉన్న మన పిల్లలకు అందించే లక్ష్యంతో తాల్ ఈ వేడుకలను నిర్వహిస్తోంది. లండన్, చుట్టుపక్కల ఉన్న తెలుగు వారందరూ ఈ వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



## షార్లెట్‌లో 'నాట్స్' ఆధ్వరంలో

# మహిళా దినోత్సవ వేడుకలు

షార్లెట్: అమెరికాలో తెలుగు వారి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) తాజాగా షార్లెట్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించింది. 'ఉమెన్స్ నైట్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 250 మందికి పైగా తెలుగు మహిళలు పాల్గొని సందడి చేశారు. మహిళా శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని చాటిచెప్పేలా సాగిన ఈ వేడుకకు బ్రెస్ట్ క్యాన్సర్ హబ్ ప్రతినిధి లోపా ముద్ర, శక్తి ఫౌండేషన్ ప్రతినిధి నిదియా గాస్పర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మహిళా సాధికారతపై ప్రసంగించారు.

ఈ వేడుకలో మిస్ తెలుగు యూఎస్ఏ ఆర్గనైజేషన్ విజేతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బ్యూటీ పీజెంట్, బెస్ట్ డ్రెస్డ్ పోటీలకు వారు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ప్రముఖ గాయని స్వాతి వారణాసి తన మధుర గాత్రంతో ఆలపించిన పాటలు సభికులను ఎంతగానో అలరించాయి. విభిన్న రకాల ఆటపాటలు, సంగీత విభావరితో వేడుక ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. అతిథుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక మాక్‌టైల్స్, రుచికరమైన విందు భోజనం వేడుకకు మరింత వన్నెతెచ్చాయి. మహిళలంతా ఒకచోట చేరి ఉత్సాహంగా జరుపుకున్న ఈ వేడుకలు నాట్స్ షార్లెట్ విభాగం సేవా స్ఫూర్తిని, సంఘీభావాన్ని చాటిచెప్పాయి. ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని 'నాట్స్' నాయకులు తెలిపారు. మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన షార్లెట్ నాట్స్ నాయకులను 'నాట్స్' చైర్మన్ కిషోర్ కంచర్ల, 'నాట్స్' అధ్యక్షుడు శ్రీహరి మందాడి అభినందించారు.

## ఒహాయోలో 'తానా' వాలీబాల్ టోర్నమెంటు

# విజయవంతం

కొలంబస్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో ఒహాయో వ్యాలీ ప్రాంతీయ వాలీబాల్ టోర్నమెంటు కొలంబస్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. తెలుగు యువత, క్రీడాకారులు, కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. 'తానా' అధ్యక్షుడు డాక్టర్ నరెన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు నాయకత్వంలో 'తానా' క్రీడలు దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయి. జాతీయ క్రీడా సమన్వయకర్త శివ చావా మార్గదర్శకత్వంలో టోర్నమెంటు సాగింది.

ఈ కార్యక్రమాన్ని ఓహియో వ్యాలీ ప్రాంతీయ ప్రతినిధి ప్రదీప్ చందనం సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు. గత ఓహియో వ్యాలీ ప్రాంతీయ ప్రతినిధి శ్రీనివాస్ సంగ, శివ చావా, నాగేశ్వరరావు మన్నె, వీర ప్రతాప్, శ్రీకాంత్ రెడ్డి చింతొళ్ల, మనోజ్ సిరిగిరెడ్డి, చందు గుమ్మళ్ల, శ్రీకుమార్ కాసా, రాఘవ శ్రీహరి, సురేష్ పార్వతి, రాజేష్, వీరేష్ విల్లిగడ్ల, శ్యామ్ దుద్దెల, విప్పల రెడ్డి, యశ్ కోసన, తేజ తదితరులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు.



# 'తానా' సేవా నిరతి

## కొప్పాక, పరిసర ప్రాంతాల్లోని 16 పాఠశాలలకు టార్పాలిన్ల పంపిణీ

## పాల్గొన్న 'తానా' ట్రెజరర్ రాజా కసుకుర్తి



దెందులూరు (చైతన్యరథం): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో గ్రామీణ విద్యార్థుల విద్యా సౌకర్యాలను మెరుగుపరచడానికి పాఠశాలలకు టార్పాలిన్ల పంపిణీ చేపట్టారు. దెందులూరు నియోజకవర్గంలోని కొప్పాక పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్లో 'తానా' కోశాధికారి రాజా కసుకుర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తానా న్యూజెర్సీ రీజనల్ కో-ఆర్డినేటర్ సుధీర్ నరేపలుపులి ప్రాయోజకత్వం వహించారు. తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు శుభాకాంక్షలు తెలిపారు. కొప్పాక హైస్కూలు, పరిసర ప్రాంతాల్లోని 16 పాఠశాలలకు టార్పాలిన్లు అందజేశారు. తద్వారా కొప్పాక, అంకన్నగూడెం, కొప్పాకగూడెం, సింగవరం, పెదకడిమి, అమ్మపాలెం, భోగాపురం, దుగ్గిరాల, పినకడిమి, వంగూరు, లక్ష్మీపురం, రామచంద్రపురం ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు ప్రయోజనం పొందాయి. కార్యక్రమంలో పాఠశాల




విద్యా కమిటీ చైర్మన్ కర్రి శ్రీరామ్, ప్రధానోపాధ్యాయుడు మట్టా రామకృష్ణ, టీచర్–కార్యక్రమ సమన్వయకర్త సునీత, కొప్పాక, పరిసర ప్రాంతాలకు చెందిన పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తానా కోశాధికారి రాజా కసుకుర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం తానా లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. పాఠశాలల్లో సమావేశాలు, బహిరంగ తరగతులు నిర్వహించే సమయంలో విద్యార్థులు నేలపై



కూర్చోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని, ఈ సమస్యను కొంతవరకు పరిష్కరించేందుకు టార్పాలిన్లు అందజేస్తున్నామని చెప్పారు.

ఈ సేవా కార్యక్రమానికి ప్రాయోజకత్వం వహించిన సుధీర్ నరేపలుపుకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తానా నాయకత్వం ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తున్నందుకు తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన కర్రి శ్రీరామ్, మట్టా రామకృష్ణ, సునీత, ఇతర ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పరిసర పాఠశాలల ఉపాధ్యాయులు 'తానా' సేవలను ప్రశంసిస్తూ... ఈ టార్పాలిన్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. 'తానా' నాయకత్వానికి, ప్రాయోజకుడు సుధీర్ నరేపలుపు, కార్యక్రమ నిర్వాహకుడు రాజా కసుకుర్తిలకు కృతజ్ఞతలు చెప్పారు.

## ఆక్వా రైతుల నెత్తిన

# యుద్ధం పిడుగు!



**(చైతన్య రథం ప్రతినిధి-అమరావతి)**

ఇరాన్–అమెరికా మధ్య యుద్ధ జ్వాలలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల ఆక్వా రైతులకు పెను శాపంగా మారాయి. మధ్యప్రాచ్యం (Middle East)లోని అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లాల్సిన దాదాపు రూ.2,500 కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తులు పోర్టుల్లోనే నిలిచిపోయాయి. ఇందులో సుమారు 60 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌దే కావడం గమనార్హం.

### ముందుకు కదలని కంటైనర్లు

విశాఖపట్నం, ముంబై రేవుల నుంచి ఎగుమతి కావాల్సిన ఏపీకి చెందిన రొయ్యలు, చేపల కంటైనర్లు సముద్ర మార్గాల్లో దాడుల భయంతో ముందుకు కదలడం లేదు. షిప్పింగ్ కంపెనీలు ఒక్కో కంటైనర్‌పై వేల డాలర్ల అదనపు రుసుములను (Surcharges) వసూలు చేస్తున్నాయి. రొయ్యలు పాడవకుండా భద్రపరిచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్ల అద్దెలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. దీనివల్ల ఎగుమతిదారులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే అమెరికా విధించిన పన్నుల భారంతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు, ఈ యుద్ధం మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా తయారైంది.

### ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ

ప్రస్తుతం కోల్డ్ స్టోరేజీలు నిండిపోవడంతో స్థానిక వ్యాపారులు రైతుల నుంచి సరుకు కొనడం నిలిపివేశారు. దీనివల్ల గ్రామాల్లో రొయ్యల ధరలు మరింత పడిపోయే ప్రమాదం ఉంది. ఇన్సూరెన్స్ రేట్లు పెరగడం, కంటైనర్లు పోర్టుల్లోనే ఆగిపోవడంతో వేలాది టన్నుల ఉత్పత్తులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది.

### సగం ధరకే గుడ్లు

యుద్ధ ప్రభావం కేవలం ఆక్వా రంగానికే పరిమితం కాకుండా పౌల్ట్రీ పరిశ్రమను కూడా తాకింది. హైదరాబాద్ ప్రాంతం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన కోట్లాది కోడి గుడ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎగుమతులు నిలిచిపోవడంతో స్థానిక మార్కెట్‌లో గుడ్ల నిల్వలు పెరిగిపోయి ధరలు దారుణంగా పడిపోతున్నాయి. పౌల్ట్రీ రైతులకు రోజుకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. ఎగుమతికి తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో గుడ్ల రేటు దాదాపు సగానికి తగ్గిస్తున్నట్లు NECC ప్రకటించింది.హోల్‌సేల్ మార్కెట్‌లో గుడ్డు రేటు కేవలం రూ.3.50గా నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది.

# బీహార్‌లో తొలిసారిగా కొలువు తీరనున్న కమలం

## ముఖ్యమంత్రి పదవికి పరిశీలనలో ముగ్గురి పేర్లు.. ఆచీతూచీ అడుగేస్తున్న అధిష్ఠానం



సుదీర్ఘకాలం సీఎంగా కొనసాగిన నీతీశ్ కుమార్ త్వరలో రాజ్యసభకు వెళ్లనుండటంతో కమలం పార్టీకి మార్గం సుగమయింది. బీహార్‌లో తొలిసారి భాజపా సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమయింది. దీంతో భాజపా నుంచి ముఖ్యమంత్రి పగ్గాలు ఎవరు చేపడతారనే విషయమై తీవ్రచర్చకు తెరలేచింది. సీఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్, ఉప ముఖ్యమంత్రి విజయసిన్హా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. భాజపా సామాజిక వ్యూహంతోనే బడుగు, బలహీన వర్గాలకే సీఎం పీఠం కట్టబెట్టవచ్చనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. బీహార్ ఉపముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సామ్రాట్ చౌదరీ ఓబీసీ సామాజిక వర్గానికి చెందినవారు. ఈ వర్గానికి ఇప్పటివరకు సీఎం అయ్యే అవకాశం రాలేదు. ఆయనను పెద్ద నాయకుడిని చేస్తామని ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. సామ్రాట్ చౌదరీ ఆర్జేడీ నుంచి వచ్చి పదేళ్లు కూడా కాకపోవడంతో భాజపా అధినాయకత్వం ఆయనపై ఎంతవరకు విశ్వాసం చూపుతుందన్నది ఆసక్తి రేపుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ అయోధ్య ఉద్యమ సమయం నుంచి ఏబీవీపీలో, ఆరెస్సెస్‌లో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన బీహార్‌లో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. రాయ్‌కు అవకాశం ఇస్తే అగ్రవర్ణాలు, నీతీష్ కుమార్ వర్గానికి చెందిన కుర్మీలు, ఇతర అత్యంత వెనుకబడినవర్గాల నుంచి వ్యతిరేకత రావచ్చని భాజపా వర్గాలు భావిస్తున్నాయి. అగ్ర కులానికి చెందిన మంగళ్ పాండే పేరు కూడా వినిపిస్తోంది.. అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తికి సీఎం పదవి కట్టబెట్టాలని పార్టీ భావిస్తే సంజీవ్ చౌరాసియా పేరు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. వీరితో పాటు.. వెస్ట్ చంపారన్ ఎంపీ, రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్, బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్‌కు ఉపముఖ్యమంత్రి పదవి దక్కొచ్చన్న ప్రచారం జోరందుకుంది.

# మానవతా దృక్పథంతోనే ఆశ్రయమిచ్చాం

## కొచ్చిలోకి ఇరాన్ నౌక రాకపై కేంద్రమంత్రి జైశంకర్



శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై దాడి చేసిన అమెరికా జలాంతర్గామి దానిని ముంచేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందించారు. ఇటీవల విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన పలు ఇరాన్ యుద్ధ నౌకలు అనుకోని విధంగా యుద్ధ ప్రభావానికి గురయ్యాయని అన్నారు. ఆ నౌకల ప్రయాణ ఉద్దేశం వేరైనా, ఉద్రిక్త పరిస్థితుల వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అదే సమయంలో ఐరిస్ లావన్ అనే మరో నౌక తిరిగి వెళ్తుండగా అందులో సాంకేతిక సమస్య తలెత్తిందన్నారు. దీంతో కొచ్చిలో నౌక అత్యవసర నిలుపుదలకు ఇరాన్ విజ్ఞప్తి చేసిందన్నారు. ఈ విషయంలో చట్టపరమైన సమస్యలు ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో భారత్ ఈ నెల 1న సంబంధిత అనుమతి మంజూరు చేసిందన్నారు. దీంతో ఈ నెల 4న నౌకను ఇరాన్ కొచ్చిలో నిలిపిందన్నారు. అందులోని 163 మంది సిబ్బందికి కొచ్చిలోనే ఆశ్రయమిచ్చినట్లు తెలిపారు. భారత్ సరైన నిర్ణయమే తీసుకుందన్నారు. శ్రీలంక తీరంలో దాడి జరిగిన వెంటనే ఐరిస్ దేనా నౌక నుంచి తొలుత శ్రీలంక నౌకాదళానికి ప్రమాద హెచ్చరిక వచ్చిందని, ఆ వెంటనే భారత నౌకా దళాలు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నాయని తెలిపారు.

## కేన్సర్‌తో పోరాడి.. పట్టుదలతో చదివి..

# సివిల్స్‌లో ర్యాంకు సాధించిన చత్తీస్‌గఢ్‌యోధుడు!



ఆరేళ్లు క్యాన్స పోరాడాడు. స్వల్ప దృష్టి లోపంతో బాధపడుతున్నాడు. కానీ లక్ష్యం కోసం మూడు ఉద్యోగాలకు రాజీనామా చేశాడు. సివిల్స్‌లోనూ రెండుసార్లు ఆశించిన ఫలితం రాలేదు. అయినా.. ఎక్కడా వెనకడుగు వేయలేదు. పట్టుదలతో ప్రయత్నించాడు. చివరకు అనుకున్నది సాధించాడు. మూడో ప్రయత్నంలో సివిల్స్‌లో మెరిశాడు. అతడే సంజయ్ దహరియా. చత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ జిల్లా, బేల్స్ గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ కుటుంబంలో సంజయ్ దహరియా (38) జన్మించాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అతడి విద్యాభ్యాసం ప్రారంభమయింది. అనంతరం రాయ్‌పూర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యాడు. చదువు పూర్తి చేసుకున్న అనంతరం ఎస్బీఐలో ఉద్యోగం సాధించాడు. 2000 నుంచి 2011 వరకు పశ్చిమ బెంగాల్లో పనిచేశాడు. ఆ తర్వాత సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. అంతలోనే ఊహించని పరిస్థితి ఎదురైంది. 2012లో క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. దాదాపు ఆరేళ్లపాటు మహమ్మారిపై పోరాడి గెలిచాడు. స్వల్ప దృష్టి లోపంతో బాధపడుతున్నప్పటికీ, ఏమాత్రం నిరుత్సాహపడకుండా సివిల్ సర్వీసెస్ కోసం ప్రయత్నాలు కొనసాగించాడు. ఒకవైపు పరీక్షలకు ప్రిపేర్ అవుతూనే.. మరోవైపు రాయర్లోని ఓ బ్యాంకులో, ఆపై మహాసముంద్లోని పోస్టాఫీసులో ఉద్యోగాలూ చేశాడు. 2022లో తొలిసారి సివిల్స్ పరీక్ష రాశాడు. ఆశించిన ఫలితం రాలేదు. రెండో ప్రయత్నంలోనూ నిరాశే ఎదురైంది. తాజాగా మూడో ప్రయత్నంలో 946వ ర్యాంకు సాధించాడు. సివిల్ సర్వీసెస్ ద్వారా దేశానికి సేవ చేయాలని ఆశిస్తున్నాను. ఏ సర్వీస్ వచ్చినా.. ప్రజా సేవ విషయంలో నిబద్ధతగా వ్యవహరిస్తాను” అని సంజయ్ తెలిపాడు. అనారోగ్యంతో ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు, మెంటార్లు అండగా నిలిచారని, వారు అందించిన మద్దతే విజయానికి కారణమని చెప్పాడు. సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై మహాసముంద్ కలెక్టర్ వినయ్ కుమార్ తదితరులు సంజయ్‌ను అభినందించారు.



# మమత తీరుపై రాష్ట్రపతి అసహనం

## ప్రోటోకాల్ పాటించని పశ్చిమ బెంగాల్

పశ్చిమ బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అసహనం వ్యక్తం. చేశారు. ఉత్తర బెంగాల్లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సీఎం నుంచి గానీ మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన ఆదివాసీ సదస్సుకు అనుమతి ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించారు. అయినప్పటికీ మమత ప్రభుత్వంపై ఎటువంటి ద్వేషం లేదని..ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్లోని సిలిగుడికి వెళ్లారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతికి ముఖ్యమంత్రి గానీ ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు గానీ స్వాగతం పలకాల్సి ఉంటుంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరపున ఎవరూ రాకపోవడం గమనార్హం.

# దేశమంతా భగ్గుమన్న వంట గ్యాస్ ధరలు

దేశంలో వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. గృహవినియోగ ఎల్పీజీ. సిలిండర్పై రూ.60, కమర్షియల్ సిలిండర్పై రూ.115 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చాయి. దీంతో హైదరాబాద్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.965కి చేరింది. ఉజ్వల్ పథకం ద్వారా అందించే సిలిండర్ ధరల్లో మార్పు లేదని చమురు సంస్థలు స్పష్టం చేశాయి. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలోనే ధరలు పెరిగినట్లు తెలుస్తోంది.



# నెలాఖరుకు మావోయిస్టుల ఉనికి ఉండదు

## హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ

దేశాభివృద్ధికి ప్రతిబంధకంగా నిలుస్తున్న మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ తెలిపారు. ఈ నెలాఖరులోగా లక్ష్యం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఒడిశా రాష్ట్రం కటక్ లోని ముండలిలో నిర్వహించిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) 57వ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మావోయిస్టుల ఏరివేతలో సీఐఎస్ఎఫ్ దళాల సహకారం ఎంతో ఉందని.. ఒడిశా, చత్తీస్గఢ్, తెలంగాణల్లో గొప్పగా సేవలందిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం సీఐఎస్ఎఫ్ సంచిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్చారణ్మార్ఝి, సీఐఎస్ఎఫ్ డీజీ ప్రవీరరంజన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# భారత్ ఆశ్రయంలో ఇరాన్ యుద్ధనౌక

## ఐరిస్ దేనాపై దాడికి ముందే కొచ్చిలో డాకింగ్

ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి సముద్రంలో ముంచేసింది. దీనికి ముందు మరో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ లావన్‌కు భారత్ ఆశ్రయమిచ్చింది. ప్రస్తుతం అది కొచ్చిలో సురక్షితంగా ఉన్నట్టుగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

విశాఖపట్నంలో జరిగిన నేవీ విన్యాసాల్లో ఇరాన్‌కు చెందిన వార్‌షిప్‌లు పాల్గొన్నాయి. తర్వాత రెండు యుద్ధ నౌకలు ఇరాన్‌కు బయలుదేరాయి. కాగా, ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఉమ్మడిగా ఇరాన్‌పై దాడులకు పాల్పడటం.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతమవ్వడం తెలిసిందే. ఈ పరిణామాల్లోనే.. హిందూ మహా సముద్ర జలాల్లోవున్న ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ లావన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తి.. భారత్ సహాయాన్ని కోరింది ఇరాన్.

కొచ్చిలో డాకింగ్‌కు అనుమతి కోరడం, మార్చి 1న ఆమోదం లభించినట్టు తెలుస్తోంది. దీంతో మార్చి 4న ఐరిస్ లావన్ కొచ్చిలో డాకింగ్ చేసింది. ఈ నౌకలోని 183మంది సిబ్బంది ప్రస్తుతం కొచ్చిలోని నేవల్ బేస్‌లో వసతి పొందుతున్నట్టు భారత్ పేర్కొంది. మరోవైపు ఇరాన్‌కు తిరిగి వెళ్తున్న మరో యుద్ధ నౌక ఐరిస్ దేనాను అమెరికా జలాంతర్గామి టార్గెట్ చేసింది.

మార్చి 4న టార్పెడోతో పేల్చివేయడంతో హిందూ మహాసముద్రంలో మునిగిపోయింది. శ్రీలంక తీరంలో ఈ సంఘటన జరుగడంతో.. ఆ దేశ నేవీ, ఎయిర్‌ఫోర్స్ అప్రమత్తమయ్యాయి. ఐరిస్ దేనాలోని సుమారు 130మందిలో 80మందికిపైగా సిబ్బంది మరణించగా 32మందిని కాపాడారు.

శ్రీలంకలోని ఆసుపత్రిలో వీరు చికిత్సపొందుతున్నారు. అయితే భారత్‌కు అతిథిగా వచ్చిన తమ దేశ నౌక (ఐరిస్ దేనా)పై అమెరికా దారుణంగా దాడి చేసి ముంచేసిందని ఇరాన్ ఆరోపించింది. ఈ విమర్శల నేపథ్యంలో ఇండియన్ నేవీ స్పందించింది. ఐరిస్ దేనానుంచి ప్రమాద సంకేతం అందిన తర్వాత తమ యుద్ధ నౌకలు, హెలికాప్టర్లు



# ట్రంప్, బైడెన్ హత్యకు కుట్ర

## - దోషిగా తేలిన పాక్ వ్యాపారి

ఇరాన్ టాప్ కమాండర్ ఖాసీం సులేమాని హత్యకు ప్రతీకారంగా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సహా ఇతర రాజకీయ నేతల హత్యకు కుట్రలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్న పాకిస్థాన్ వ్యాపారి ఆసిఫ్ మర్చంట్‌ను యూఎస్‌లోని బ్రూక్లిన్ న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఈమేరకు తాజాగా తీర్పు వెలువరించింది.

ఇరాన్‌తో సంబంధాలున్న అతడికి ఈ కుట్ర కేసులో జీవిత ఖైదుపడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌వద్ద ఆసిఫ్ మర్చంట్ శిక్షణ పొందినట్టు రుజువైందని అమెరికా న్యాయస్థానం పేర్కొంది. ప్రముఖ రాజకీయ నాయకుల హత్య కోసం ఐఆర్జీసీ తనను 2024లో అమెరికాకు పంపించిందని అతడు విచారణలో అంగీకరించాడు. అయితే, తుది లక్ష్యం ఎవరనేది తనకు వెల్లడించలేదని తెలిపాడు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు జో బైడెన్, 2024 అధ్యక్ష రేసులో ఉన్న నిక్కీ హేలితో సహా పలువురు కీలక రాజకీయ నేతలు తమ టార్గెట్ ఉన్నట్టు పేర్కొన్నాడు. అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ గతంలోనే ఖండించింది. ఈ హత్య కుట్రతో తమకు సంబంధం లేదని తెలిపింది. కాగా.. పాకిస్థాన్‌లోని పలు బ్యాంకుల్లో కొన్నేళ్లపాటు పనిచేసిన ఆసిఫ్.. తర్వాత వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. అతడికి పాక్‌లో వివాహం కాగా.. ఇరాన్‌కు చెందిన మహిళనూ పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. 2024 ఏప్రిల్లో అమెరికాకు వచ్చిన ఆసిఫ్.. కిరాయి హంతకుల ఏర్పాటు కోసం ఓ వ్యక్తితో తన ప్రణాళిక గురించి చర్చించాడు. అయితే, ఆ వ్యక్తి అండర్ కవర్లో ఉన్న అధికారిగా సమాచారం.

అధ్యక్ష ఎన్నికల సమయంలో పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ఒకరోజు ముందు అండర్ కవర్ అధికారి సమాచారం మేరకు.. ఆసిఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పాక్‌కు పారిపోయేందుకు విమానం ఎక్కడానికి సిద్ధమవుతుండగా అతడిని పట్టుకున్నారు.

# అందుకు క్షమించండి.. కానీ..!

- **గల్ఫ్ దేశాలపై దాడులకు సారీ చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు**
- **ప్రతి దాడులకు దిగితే మాత్రం సహించేది లేదని హెచ్చరిక**
- **పొరుగు దేశాలకు లొంగిపోయారంటూ ట్రంప్ ఎద్దేవా**

ఇజ్రాయెల్–అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ భీకర దాడులకు దిగడం తెలిసిందే. గల్ఫ్ దేశాలతోపాటు తుర్కియే, అజార్ బైజాన్‌వంటి అనేక దేశాలపైనా ఇరాన్ మిస్సైల్స్ విరుచుకుపడ్డాయి. అయితే, ఇలా పొరుగు దేశాలపై దాడులు చేసినందుకు ఇరాన్ తాజాగా క్షమాపణలు చెప్పింది. ఈమేరకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పారు. “పొరుగు దేశాలపై ఇరాన్ దాడులకు క్షమాపణలు చెబుతున్నా. ఇకపై ఆ దేశాలపై దాడులు, ఎలాంటి క్షిపణి ప్రయోగాలకు దిగకూడదని ఇరాన్ మధ్యంతర నాయకత్వం నిర్ణయించింది. అయితే, ఆ దేశాలనుంచి మా దేశంపైకి దాడులు జరగనంతవరకే ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం” అని పెజెష్కియన్ వెల్లడించారు. ఒకవేళ అమెరికా సైన్యం కొలువుదీరివున్న ఆయా దేశాలనుంచి ఇరాన్‌పై దాడి జరిగితే మాత్రం.. ప్రతిదాడి చేస్తామని వెల్లడించింది. ఇరాన్‌కు సంబంధించిన ఒక టీవీ ఛానల్‌తో మసౌద్ ఈ ప్రకటన చేశారు. మరోవైపు ఇరాన్ ఏ దేశానికి లొంగిపోదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌తో ఎలాంటి చర్చలు, ఒప్పందాలు ఉండబోవని, బేషరతుగా లొంగిపోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ మాట్లాడుతూ, తమ దేశం ఎవరికీ లొంగిపోదన్నారు. ఇరాన్ లొంగిపోవాలనుకునే వారి కోరికను వారి సమాధులపైకి మళ్లిస్తామని ఆయన వ్యాఖ్యానించారు.

ఇప్పటివరకు ఇరాన్.. యూఏఈ, దుబాయ్, ఖతార్, బహ్రెయిన్‌వంటి గల్ఫ్ దేశాలపై దాడులు చేసింది. అయితే, తాజా ప్రకటనతో ఇకపై దాడుల్ని ఆపేస్తుందో లేదో చూడాలి. ఈ రోజు కూడా గల్ఫ్ దేశాలపై ఇరాన్ మిస్సైల్స్ ప్రయోగించింది. దీంతో దుబాయ్ ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ఇంకోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు దాడి చేస్తూనే ఉన్నాయి. టెహ్రాన్‌లోని ప్రధాన కేంద్రాలపై అమెరికా మిస్సైల్ దాడులు చేస్తోంది. దీంతో అక్కడి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు ఇరాన్‌లో 1,332 మందికిపైగా మరణించినట్టు అంచనా.

### పొరుగు దేశాలకు ఇరాన్ లొంగిపోయింది

దాడుల విషయంలో గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పిన వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



స్పందించారు. పశ్చిమాసియాలో ఓటమిపాలైన దేశంగా ఇరాన్‌ను పేర్కొన్నారు. ఆ దేశం దాని పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పి లొంగిపోయిందన్నారు. ఇకపై దాడులు చేయబోమని కూడా హామీ ఇచ్చిందని గుర్తుచేస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతర దాడులవల్లే ఇది సాధ్యమైందన్నారు. పశ్చిమాసియాను ఇరాన్ ఇక బెదిరించలేదని ‘ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. “పశ్చిమాసియాను గుప్పిట్లో పెట్టుకుని, పాలించాలని ఇరాన్ చూసింది. కానీ, ఓటమి పాలైంది. ఆ దేశం లొంగిపోవడమో, లేదా కుప్పకూలిపోవడమో జరిగేవరకు.. దశాబ్దాలపాటు పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది. ఈ రోజు ఇరాన్‌పై భీకర దాడులు జరగనున్నాయి. ఆ దేశ దుష్ప్రవర్తన కారణంగా.. అక్కడి ప్రాంతాలను సర్వనాశనం చేసే అంశం కూడా పరిశీలనలో ఉంది” అని ట్రంప్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ఇరాన్ ప్రతిదాడులు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట పశ్చిమాసియా దేశాలపై పెద్దఎత్తున క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తోంది. ఈ క్రమంలోనే ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. గల్ఫ్ దేశాలకు క్షమాపణలు చెప్పారు. ఈ దేశాలపై ఇకపై దాడులు చేయబోమన్నారు. అయితే, అవి తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం.. స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు.

### ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తోపాటు ఇతర మిలిటరీ కేంద్రాలపై గత రాత్రి ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడింది. అండర్‌గ్రౌండ్ బాలిస్టిక్ మిస్సైల్ ఫ్యాక్టరీతోపాటు ఓ మిలిటరీ అకాడమీపై దాడి చేసినట్లు ఐడీఎఫ్ వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ వైమానిక దళానికి చెందిన 80 ఫైటర్ విమానాలు ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ఆ జెట్స్ సుమారు 230 బాంబులను జారవిడిచినట్టు మిలిటరీ వర్గాలు పేర్కొన్నాయి. బాలిస్టిక్ క్షిపణులకు చెందిన స్టోరేజ్, ప్రొడక్షన్ కేంద్రాన్ని టార్గెట్ చేశామని, ఇక్కడనుంచి ఇరాన్ సైన్యానికి చెందిన వేలాది సైనికులు ఆపరేట్ చేస్తుంటారని ఐడీఎఫ్ చెప్పింది. శుక్రవారం రాత్రి జరిగిన దాడి ప్రాంతంలో బంకర్లు ఉన్నాయని, మిలిటరీ హెడ్‌క్వార్టర్స్ కూడా ఉన్నట్టు ఐడీఎప్ పేర్కొంది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డు కార్ప్స్‌కు చెందిన మిలిటరీ అకాడమీ ఇమామ్ హుస్సేన్ యూనివర్సిటీపై కూడా దాడి చేసినట్టు ఐడీఎఫ్ వర్గాలు వెల్లడించాయి.

### రండి.. హర్మూజ్‌వద్దే ఉన్నాం

### అమెరికాకు ఇరాన్ ఆర్టీజీఎస్ తీవ్ర హెచ్చరిక

అమెరికాకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ గట్టి హెచ్చరికలు చేసింది. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధివద్ద యూఎస్ దళాలను ఎదుర్కొనేందుకు వేచిచూస్తున్నట్లు పేర్కొంది. జలసంధి మీదుగా చమురు నౌకలకు రక్షణగా వెళ్లేందుకు తమ దళాలు సిద్ధమవుతున్నాయని అమెరికా ఇంధన మంత్రి క్రిస్ రైట్ ప్రకటించారు. దీనికి స్పందిస్తూ ఐఆర్డీసీ ఈ హెచ్చరికలు చేసింది. ఐఆర్జీసీ ప్రతినిధి అలీ మహ్మద్ నైని మీడియాతో మాట్లాడుతూ.. అగ్రరాజ్యం ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు.. 1987లో సూపర్ ట్యాంకర్ బ్రిడ్జనకు జరిగిన ప్రమాదాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. దీంతోపాటు ఇటీవల ఆ దేశ చమురు ట్యాంకర్లను కూడా తాము లక్ష్యంగా చేసుకున్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. 1987లో కువైట్‌కు చెందిన బ్రిడ్జటన్ ట్యాంకర్ పర్షియన్ గల్ఫ్ మీదుగా వెళ్తుండగా.. నాటి ఉద్రిక్తతల దృష్ట్యా యూఎస్ నౌకాదళం ఆ నౌకకు రక్షణ కల్పించింది. అయితే, నాడు ఆ నౌకను ఐఆర్‌జీసీ లక్ష్యంగా చేసుకుంది. ఫార్సీ దీవుల సమీపంలో నౌక వెళ్లే మార్గంలో నీటి అడుగున పేలుడు పదార్థాలను ఉంచి దాడి చేసింది. ఈ ఘటనలో నౌక దెబ్బతిన్నప్పటికీ.. తన ప్రయాణాన్ని కొనసాగించి గమ్యస్థానాన్ని చేరుకుంది.

ఇక, పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇటీవల ఇరాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఇంధన సరఫరాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ క్రమంలో జలసంధి మీదుగా చమురు రవాణాకు అంతరాయం లేకుండా చూసుకునేందుకు అవసరమైతే తమ నౌకాదళంతో వాణిజ్య నౌకలకు రక్షణ కల్పిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటించారు.

# కప్పు కొడితే మూడోసారి చరిత్రే..

## నేడు భారత్, న్యూజిలాండ్ ఫైనల్ - రసవత్తరంగా టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్




టీ20 ప్రపంచకప్ మెగా టోర్నీ ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్ కోస భారత్, న్యూజిలాండ్ జట్లు సిద్ధమయ్యాయి. అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎందుకుంటే ఈ పిచ్ భారత జట్టుకు కొరకరాని కొయ్యగా మారింది. గత వన్డే ప్రపంచకప్ ఫైనల్లోనూ ఇక్కడ చేదు అనుభ వం ఎదురైంది.. అప్పటివరకు అజేయంగా వచ్చిన మనకు ఫైనల్లో మాత్రం ఎదురుదెబ్బ తగిలింది. పొట్టి కప్‌లోనూ సూపర్8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని ఫైనల్లో బరిలోకి దిగాల్సిన "సమ యమిదే. ఇందులో గెలిస్తే అత్యధిక సార్లు టీవీ20 ప్రపంచ కప్ ను నెగ్గిన తొలి జట్టుగా టీమిండియా నిలుస్తుంది. ఇప్పటివరకు భారత్ మూడుసార్లు ఫైనల్‌కు చేరుకుని రెండుసార్లు చాంపి యన్‌గా అవతరించిన సంగతి తెలిసిందే. గత తొమ్మిది ఎడిషన్లలో భారత్, వెస్టిండీస్, ఇంగ్లాండ్ మాత్రమే రెండేసి సార్లు చొప్పున విజేతగా నిలిచాయి. శ్రీలంక, పాకిస్తాన్ ఒక్కసారి సొంతం చేసుకున్నాయి. ఈసారి నెగ్గితే మూడోసారి కప్ టీమ్ండియా ఖాతాలో పడినట్లు అవుతుంది.

తొలిసారి 2007లో పాకిస్థాన్‌తో భారత్ ఫైనల్లో తలపడింది. ప్రస్తుత కోచ్ గౌతమ్ గంభీర్ (75) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 158 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన పాక్‌ను 152 పరుగులకు కట్టడి చేసి భారత్ విజయం సాధించింది.

రెండోసారి భారత్ ఫైనల్స్ చేరింది 2014 ఎడిషన్‌లోనే. విరాట్ కోహ్లీ(77) దూకుడుగా ఆడినప్పటికీ అనంతరం ఛేదనలో శ్రీలంక 17.5 ఓవర్లలో టార్గెట్‌ను పూర్తి చేసి విజేతగా నిలిచింది.

పదేళ్ల తర్వాత 2024లో భారత్ రోహిత్ సారథ్యంలో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకుంది. 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఛాంపియన్‌గా అవతరించింది. మరోసారి కోహ్లీ (76) ఆడటంతో దక్షిణాఫ్రికాకు 177 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. బుమ్రా (2/18) రాణించాడు. ఆఖరి ఓవర్‌లో హార్దిక్ పాండ్య కట్టుదిట్టంగా సంధించాడు. డేవిడ్ మిల్లర్ ఇచ్చిన క్యాచ్‌ను ప్రస్తుత కెప్టెక్ సూర్య అద్భుతంగా ఒడిసిపట్టి టైటిల్ దక్కడంలో కీలక పాత్ర వహించాడు.

### గెలిస్తే ధోనీ సరసన సూర్య

టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీ నాయకత్వంలో భారత్ తొలిసారి విజేతగా నిలిచింది. ఐసీసీ 2007లో తొలిసారి టీ20 ప్రపంచకప్ నిర్వహించింది. అరంగేట్రంలో ఎలాంటి అంచనా ల్లేకుండా టీమ్ ఇండియా కప్ సొంతం చేసుకుంది. ధోనీ మొదటి సారి సారథ్యం వహించి జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు. ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ కూడా టీమ్ ఇండియాకు టైటిల్ అందిస్తే ధోనీ సరసన చేరతాడు. మెగా టోర్నీ బరిలోకి దిగి తొలిసారి కెప్టెన్సీలో టైటిల్ అందించినవాడిగా సూర్య ఘనత సాధిస్తాడు. రోహిత్ శర్మ నాయకత్వంలోనూ భారత్ 2004 ప్రపం చ టైటిల్ విజేతగా నిలిచింది. అయితే అంతకముందు 2022 టోర్నీలోనూ టీమ్ ఇండియాకు రోహిత్ కెప్టెన్‌గా ఉన్నాడు. సెమీ స్‌లోనూ ఇంటిముఖం పట్టింది. ఇక్కడ మరొక విషయం లోనూ భారత్ ఘనత సాధించే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఆతిథ్య దేశం కప్ నెగ్గిన చరిత్ర లేదు. గెలిస్తే ఆ రికార్డు చెరిగిపోతుంది.

## భారత్‌తో ఏకైక టెస్టు..




**అన్నాబెల్ సెంచరీ.. ఆసీస్ 323 ఆలౌట్**

**భారత్ రెండో ఇన్నింగ్స్ 105/6**

పెర్త్ వేదికగా భారత్-ఆస్ట్రేలియా మహిళా జట్లు ఏకైక టెస్టులో తలపడుతున్నాయి. ఓవర్ నైట్ 96/3తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్.. 323 పరుగులకు ఆలౌటైంది. టీమిండియాపై 125 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అన్నా బెల్ సదర్లాండ్(129) శతకంతో అదరగొట్టింది. ఎలీస్ పెర్రీ (76) హాఫ్ సెంచరీ సాధించింది. భారత బౌలర్ సయాలీ సత్ఘరే అరంగేట్రంలో ఔరా అనిపించింది. ఏకంగా 4 వికెట్లు తీసి ఆసీస్‌ను కాస్త కట్టడి చేయగలిగింది. తొలి సెషన్‌లో భారత్ 198 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే. తొలి సెషన్‌లో ఆసీస్ బ్యాటర్లు సదర్లాండ్, పెర్రీ మినహా ఇతర ప్లేయర్లు ఎవ్వ రూ రాణించలేకపోయారు. జార్జియా వాల్(2), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (9), అలీసా హీలీ(13), బెత్ మూనీ(19), ఆష్లీ గార్డ్‌నర్(1), మెక్ గ్రాత్(13), అలానా కింగ్(21), లూసీ హమిల్టన్(23) స్వల్ప పరుగులకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో సయాలీ 4, క్రాంతి గౌడ్ 2, దీప్తి శర్మ 2, స్నేహ్ రాణా, షెఫాలీ వర్మ తలొక వికెట్ పడగొట్టారు.

రెండో రోజు ఆట ముగిసే సరికి 6 వికెట్లు కోల్పోయి కేవలం 105 పరుగులు మాత్రమే చేశారు. ఆసీస్‌పై ఇంకా 20 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి క్రీజులో ప్రతీకా రావల్(43), స్నేహ్ రాణా(14) ఉన్నారు. రెండో సెషన్‌లో టీమిండియా బ్యాటర్లు తీవ్రంగా విఫలమయ్యారు. స్మృతి మంధాన(2), షెఫాలీ వర్మ (5), జెమీమా రోడ్రిగ్స్(14), హర్మన్ ప్రీత్ కౌర్(11), దీప్తి శర్మ(9), రిచా ఘోష్(0) వరుసగా పెవిలియన్ బాట పట్టారు. ఆసీస్ బౌలర్లలో లూసి హమిల్టన్ 3, అన్నాబెల్ సదర్లాండ్ 2, బ్రౌన్ 1 వికెట్ పడగొట్టారు. తొలి సెషన్‌లో టీమిండియా 198 పరుగులకే పరిమితమైన విషయం తెలిసిందే.

## క్యాచ్ పట్టి..మ్యాచ్ పట్టారు!

**భారత్ క్యాచ్ ఎఫిషియెన్సీ 100 శాతం**




టీ20 ప్రపంచ కప్ 2026లో భారత జట్టు ప్రయాణం ఆసక్తికర మలుపులతో సాగుతోంది. బ్యాటింగ్‌లో పరుగుల వర్షం కురిపిస్తూ ప్రత్యర్థులను మట్టి కరిపిస్తున్నప్పటికీ ఫీల్డింగ్‌లో ముఖ్యంగా క్యాచ్‌ల విషయంలో టీమిండియా కొంతకాలం తడబడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. లీగ్ దశ నుంచి సూపర్ 8 వరకు భారత జట్టు క్యాచింగ్ ఎఫిషియన్సీ కేవలం 71.7 శాతం మాత్రమే.. అయితే ఇంగ్లండ్‌తో జరిగిన సెమీ ఫైనల్‌లో మాత్రం అత్యద్భుతంగా 100 శాతానికి చేరుకుంది. టోర్న మెంట్ తొలి దశల్లో టీమిండియా మొత్తం 13 కీలక క్యాచ్‌లు డ్రాప్ చేసింది. దీంతో సూపర్ 8 దశకు చేరుకున్న జట్లలో భారత్ చివరి స్థానంలో నిలిచింది. అదే సమయంలో ఇంగ్లండ్, జింబాబ్వే, వెస్టిండీస్ జట్లు 80 శాతానికి పైగా క్యాచింగ్ ఎఫిషి యన్సీతో మెరుగైన ఫీల్డింగ్ ప్రదర్శించాయి. మ్యాచ్‌లను గెలిపిం చే కీలక క్షణాల్లో క్యాచ్ డ్రాప్ చేయడం టీమిండియాకు పెద్ద సమస్యగా మారిందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు.

సెమీఫైనల్‌కు వచ్చే సరికి భారత జట్టు పూర్తిగా భిన్నంగా కనిపించింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో భార త ఫీల్డర్లు అద్భుతమైన ఫీల్డింగ్ చేశారు. ముఖ్యంగా అక్షర్ పటేల్.. అద్భుతంగా క్యాచ్‌లు అందుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అర్ష్‌దీప్ వేసిన 14వ ఓవర్‌లో ఫుల్ టాస్‌గా వచ్చిన చివరి బంతికి జాక్స్ కవర్స్‌లో భారీ షాట్ ఆడాడు. చాలాదూరం నుంచి పరుగెత్తుకుని వచ్చిన అక్షర్.. అద్భుత రీతిలో బంతిని అందుకున్నాడు. బౌండరీ లైన్ వద్ద తనను తాను నియంత్రించుకోలేకపోయిన అక్షర్.. చురుగ్గా స్పందించి తన ముందే ఉన్న దూబె వైపు బంతి విసరగా అతడు క్యాచ్ పట్టాడు. దీంతో బెతెల్, జాక్స్ విలువైన భాగస్వామ్యానికి తెరప డింది. ఇలాంటి క్యాచ్‌లు టీమిండియా నిన్న బోలెడు తీసుకుంది. అందుకే ఈ మ్యాచ్‌లో భారత్ క్యాచింగ్ ఎఫిషి యన్సీ దాదాపు 100 శాతంగా నమోదైంది.

## వారిలో ప్రతి ప్లేయర్ డేంజరే..



టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ ఆదివారం న్యూజిలాండ్-భారత్ జట్ల మధ్య జరగనుంది. దీనికి అహ్మదాబాద్‌లోని నరేం ద్ర మోదీ స్టేడియం వేదిక కానుంది. సెమీఫైనల్‌లో అద్భుత ప్రదర్శనతో రెట్టింపు ఉత్సాహంతో ఉన్న కివీస్‌ను.. కాస్త తడబ డుతూ ఫైనల్‌కు చేరుకున్నా టీమిండియా ఢీకొట్టనుంది. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ మాట్లాడాడు. టీమిండియాతో మ్యాచ్ తమకు సవాలుతో కూడుకున్నది వెల్లడించాడు. 'టీమిండియా లో స్టార్ పేసర్ బుమ్రా నుంచి ముప్పు పొంచి ఉందని ప్రతి ఒక్కరూ చెప్పే మాట. అతడి ప్రదర్శన కూడా ఈ ప్రపంచ కప్ లో అలాగే ఉంది. ఇంగ్లండ్ బ్యాటర్లు కూడా బుమ్రాను ఎదుర్కో వడంలో ఇబ్బంది పడ్డారు. ఆ మ్యాచ్‌లో అతడే గేమ్ ఛేంజర్. తప్పకుండా మాకు సవాల్ తప్పదు. కానీ కేవలం బుమ్రాతోనే కాదు.. భారత జట్టులోని ప్రతి ఒక్క ప్లేయర్‌తోనూ మేం జాగ్రత్త గా ఉండాల్సిందే. బ్యాటింగ్ లేదా బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణిస్తూ వారు ఈ దశ వరకు చేరుకున్నారు. ఒక్కొక్కసారి ఒక్కో ప్లేయర్ ముందుకు వచ్చి జట్టును విజయపథం వైపు నడిపిం చారు' అని శాంట్నర్ పేర్కొన్నాడు.

'ఇప్పటివరకు నేను అహ్మదాబాద్ పిచ్‌ను పరిశీలించలేదు. ఇంకా పిచ్ కవర్ల కిందే ఉంది. అయితే ఈసారి భారీ స్కోర్లు నమోదు అయ్యే అవకాశం ఉందని మాత్రం అంచనా వేస్తు న్నాం. పిచ్ ఫ్లాట్‌గా ఉంటుందని భావిస్తున్నా' అని శాంట్నర్ తెలిపాడు.

## మ్యాచ్‌కు ముందు హోటల్ మార్పు



టీ20 ప్రపంచ కప్ 2026 కీలక పోరుకు సిద్ధమైంది. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా న్యూజిలాండ్-భారత్ జట్లు ఫైనల్ మ్యాచ్‌లో అమీతుమీ తేల్చు కోనున్నాయి. ఈ నేపథ్యంలో ఓ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడు తోంది. అదే టీమిండియా బస చేసే హోటల్‌ను బీసీసీఐ చివరి నిమిషంలో మార్చినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక సమాచారం లేదు. ఉన్నట్టుండి హోటల్ మార్పునకు గల స్పష్టమైన కారణాలు కూడా లేవు.

### అహ్మదాబాద్‌కు ప్రత్యేక రైలు, విమానాలు

టీమిండియా-న్యూజిలాండ్ మధ్య జరగనున్న ఫైనల్ మ్యాచ్ వీక్షించాలనుకునే అభిమానుల కోసం పశ్చిమ రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముంబై నుంచి అహ్మదాబాద్‌కు ప్రత్యేక రైలును నడపనుంది. ఇప్పటికే అహ్మదాబాద్‌కు విమాన టికెట్ల ధరలు పెరిగిన నేపథ్యంలో పశ్చిమ రైల్వే తీసుకున్న ఈ నిర్ణయం అభిమానులకు కాస్త ఊరటినిచ్చింది. మరోవైపు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్ ప్రత్యేక విమానాలు నడుపుతున్నాయి. దేశంలోని పలు నగరాల నుంచి అహ్మదాబాద్‌కు విమాన టికెట్లకు డిమాండ్ పెరగడంతో విమానయాన సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. టీమిండియాకు మద్దతుగా వేల సంఖ్యలో అభిమా నులు నరేంద్ర మోదీ స్టేడియానికి చేరుకోనున్నారు.

చైతన్య రథం సినిమా

ఆదివారం 8 మార్చి 2026 X

# ధురంధర్-2.. దద్దరిల్లిన ట్రైలర్



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్‌సింగ్ నటించిన 'ధురంధర్' చిత్రం బాక్సాఫీస్‌వద్ద సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఇండియన్ మార్కెట్‌లో ఏకంగా 'పుష్ప-2' కలెక్షన్లను సైతం అధిగమించి, ప్రపంచవ్యాప్తంగా రూ.1300 కోట్లకుపైగా వసూళ్లతో రికార్డు సృష్టించింది. ఈ భారీ విజయం తర్వాత, ఇప్పుడు ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సీక్వెల్ 'ధురంధర్: ది రివెంజ్' థియేట్రికల్ ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దర్శకుడు ఆదిత్యధర్ ఈ చిత్రాన్ని మరింత భారీస్థాయిలో తెరకెక్కించినట్టు ట్రైలర్ చూస్తుంటే స్పష్టమవుతోంది. తొలి భాగంలో రెహమాన్ డకైత్ (అక్షయ్ ఖన్నా) మరణం తర్వాత పాకిస్థాన్‌లోని లియారీలో తలెత్తిన ఉద్రిక్తతల చుట్టూ ఈ సీక్వెల్ కథ తిరుగుతుంది. హమ్జా అలియా మజారీగా తన అసలు గుర్తింపును దాచి ఉగ్రవాద ముఠాలో చేరిన జస్కీరత్ సింగ్ రంగీ (రణవీర్ సింగ్), ఇప్పుడు 'షేర్-ఏ-బలోచ్'గా అవతారమెత్తాడు. అయితే, అతనికి మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్) రూపంలో అతిపెద్ద ముప్పు పొంచి ఉంది. హమ్జా అసలు ఉద్దేశ్యం ఏంటి? మేజర్ ఇక్బాల్ అతని రహస్యాన్ని కనిపెట్టాడా? అనే అంశాలు సినిమాలో కీలకం కానున్నాయి.

రణ్‌వీర్ సింగ్ అత్యంత క్రూరమైన, పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుండగా, అర్జున్ రాంపాల్‌తో అతని ఫేస్ టు ఫేస్ సన్నివేశాలు థ్రిల్లింగ్‌గా ఉండబోతున్నాయి. శాశ్వత్ సచ్‌దేవ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ సినిమాస్థాయిని పెంచాయి. ఈ భారీ యాక్షన్ చిత్రం మార్చి 19న హిందీతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. అదేరోజు పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' కూడా రిలీజ్ అవుతుండటంతో బాక్సాఫీస్‌వద్ద గట్టి పోటీ నెలకొననుంది.

## వెంకీకి జోడీగా కీర్తి



విక్టరీ వెంకటేష్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో 5వ సినిమాకు రంగం సిద్ధమైంది. 'ఎఫ్2', 'ఎఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి చిత్రాల తర్వాత వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్టుకు వెంకటేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ప్రస్తుతం అనిల్ రావిపూడి స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉండగా, ఈ సినిమాలో నందమూరి కళ్యాణ్‌రామ్ కీలక పాత్రలో నటించబోతుండటం విశేషం. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన హీరోయిన్‌గా 'మహానటి' ఫేం కీర్తి సురేష్‌ను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆమె ఈ ప్రాజెక్టుకు సంతకం చేసినట్టు సమాచారం. ఇక కళ్యాణ్‌రామ్ జోడీగా నటించే హీరోయిన్ కోసం అన్వేషణ సాగుతోంది. ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌కు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తుండగా, సమీర్‌రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నాడు. షైన్ స్క్రీన్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం వెంకీ నటిస్తున్న సినిమా పూర్తికాగానే, జూన్‌నుంచి కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది. సంక్రాంతి సెంటిమెంట్‌ను ఫాలో అవుతూ, ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అనిల్ రావిపూడి మార్కు కామెడీకితోడు, వెంకటేష్ – కళ్యాణ్‌రామ్ కాంబినేషన్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తోంది.

## ఒకదశలో సేద్యం చేయాలనుకున్నా



చిత్ర పరిశ్రమని వదిలి వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్న రోజులున్నాయంటోంది బాలీవుడ్ నాయిక యామీ గౌతమ్. ఈమధ్య విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పిస్తున్న యామీ.. ఇటీవలే 'హక్' చిత్రంలో షా బానో అనే మరో శక్తిమంతమైన పాత్రతో ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న యామీ.. -పురస్కారాలు, విమర్శలపై ఆసక్తికర సంగతులు పంచుకున్నారు. "ఎన్నో పురస్కారాల్లో ఉత్తమనటిగా నామినేషన్లు సొంతం చేసుకున్నా, కెరీర్‌లో పెద్ద అవార్డులేవీ దక్కలేదు. అలాగని బాధ కూడా లేదు. ఎందుకంటే ప్రశంసలు, గుర్తింపు ఆశించడం మానేశాను. అవార్డు వస్తేనే మంచి నటి.. లేకపోతే కాదనే విషయాన్ని నమ్మను. నాకు ప్రేక్షకుల ప్రేమే ముఖ్యం. అభిమానులు మిమ్మల్ని ప్రశంసించడంకంటే పెద్ద అవార్డు ఇంకోటేదీ ఉండదు. ప్రేక్షకులకు కూడా ఇది తెలుసు. మనవల్ల ఎవరైనా సంతోషపడితే అది చాలా గొప్ప విషయం" అంటోంది యామీ. "నేను ఎక్కువగా సీరియస్ పాత్రల్లే పోషించా. అందుకే కామెడీ సినిమాల సామర్థ్యం లేదని చాలామంది విమర్శించారు. అప్పుడే 'బాలా' చిత్రం నా కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ సినిమా సమయంలో 'యామీని ఎలా తీసుకున్నావు? ఆమె నవ్వడం నువ్వు ఎప్పుడైనా చూశావా? ఆమె బాధలో ఉన్న అమ్మాయిలా ఉంటుంది. కామెడీ చేయగలదని ఎలా అనుకున్నావ్" అంటూ కొందరు దర్శకుడికి ఫోన్లు చేశారు. ఈ చిత్రం తర్వాత కూడా పరిస్థితులు మారకపోతే.. నేను తిరిగి హిమాచల్‌కి వెళ్లి అక్కడ నాకున్న భూమిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నా. కానీ 'బాలా' ఒకనటిగా ప్రేక్షకులు నన్ను చూసే విధానాన్ని మార్చింది" అంటోంది యామీ గౌతమ్.

## అభిమానుల బాధ చూడలేకున్నా..



తనపై ముసురుకున్న వివాదాలపై సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎట్టకేలకు స్పందించారు. సమస్యల కారణంగా అభిమానులు, ప్రజలు ఇబ్బందిపడుతుంటే బాధగా ఉందని వ్యాఖ్యానించారు. టీవీకే ఆధ్వర్యంలో చెన్నై సమీపంలోని చెంగల్పట్టువద్ద నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో విజయ్ మాట్లాడారు. వ్యక్తిగత వివాదాల గురించి తాను చూసుకుంటానని, పార్టీ కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. మహిళలకు ప్రత్యేక వరాలు ప్రకటిస్తూ మేనిఫెస్టో విడుదల చేశారు. మరోవైపు విజయ్ సతీమణి సంగీత తాజాగా కోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. విడాకుల కేసు ముగిసే వరకు చెన్నైలోని విజయ్ ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. నీలంగరై ఇంట్లో ఉండేందుకు అనుమతి కోరితే లాయర్ ద్వారా విజయ్ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. భార్యాభర్తల బంధానికి విజయ్ ద్రోహం చేశారని ఆరోపిస్తూ ఆయన సతీమణి సంగీత విడాకులు కోరుతూ ఫిబ్రవరి 24న కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 20న దీనిపై విచారణ జరగనుంది. ఆ రోజు విజయ్ కోర్టుకు హాజరుకావాలని న్యాయస్థానం ఆయనకు నోటీసులు జారీచేసింది.

## పవన్ కళ్యాణ్ ఇమేజ్ అది భగవద్గీత.. ఇది భగత్ గీత

'ఉస్తాద్ భగత్ సింగ్'తో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు పవన్ కళ్యాణ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన చిత్రానికి హరీశ్ శంకర్ దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ట్రైలర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ట్రైలర్ టీజ్ అంటూ ఓ చిన్న వీడియోను చిత్ర బృందం అభిమానులతో పంచుకుంది. 'ఇందాక విన్నది భగవద్గీత.. ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు' అంటూ పవన్ చెప్పిన డైలాగ్ విజిల్స్ వేయించేలా ఉంది. ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్న మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు.



## మళ్లీ ఆస్కార్ వేదికపైకి..



'ది బ్లఫ్' సినిమాతో ఓటీటీలో సందడి చేస్తూ యాక్షన్ ప్రియులందర్నీ ఆకట్టుకుంటోంది హీరోయిన్ ప్రియాంక చోప్రా. ప్రస్తుతం దర్శకుడు రాజమౌళి.. మహేష్‌బాబు హీరోగా తెరకెక్కుతోన్న 'వారణాసి' సినిమాతో బిజీగా ఉంది. తాజాగా ఈ అందాల తార 98వ అకాడమీ పురస్కారాల వేడుకలో మెరవనున్నట్టు అభిమానులతో పంచుకుంది. ఈనెల 16న జరగనున్న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె అధికారిక ప్రెజెంటర్లలో ఒకరిగా వ్యవహరించనున్నట్టు ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఈ కార్యక్రమంలో హాలీవుడ్ ప్రముఖులు రాబర్ట్ డౌనీ జూనియర్, విల్ ఆర్నెట్ తదితరులతో కలిసి ప్రియాంక ప్రెజెంటర్‌గా పాల్గొననుంది. ఇటీవలే కే-పాప్ లీసాతో కలిసి గోల్డెన్ గ్లోబ్ అవార్డుని ప్రదానం చేసింది ప్రియాంక. 2016లోనూ ప్రియాంక ఆస్కార్ ప్రెజెంటర్‌గా వ్యవహరించింది. 95వ ఆస్కార్ అవార్డులలో దీపికా పదుకొణె 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటునాటు' గీతాన్ని ప్రపంచ వేదికపై పరిచయం చేసింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ప్రియాంక అకాడమీ వేదికపై కనిపించనుంది. ఆస్కార్ బరిలో 'సిన్నర్స్' చిత్రం 16 నామినేషన్లతో అగ్రస్థానంలో ఉంది.

## దీపిక వాదన సమర్థనీయమే

ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై తాజాగా నటి అనన్య పాండే స్పందించారు. కరీనా కపూర్, కల్కాజీ ప్రియదర్శన్లతో కలిసి ఆమె 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో వర్కింగ్ అవర్స్ గురించి ప్రస్తావించారు. "దీపిక పదుకొణె అంకితభావం ఉన్న నటి. నేను ఆమెతో కలిసి పని చేశాను. అప్పుడు దీపిక ఎలాంటి డిమాండ్లు చేయలేదు. వర్క్‌షాప్‌లకు కూడా వచ్చేవారు. షూటింగ్ విషయంలో ఎప్పుడూ ఫిర్యాదులు చేయలేదు. ఇప్పుడు ఆమె ఒక బిడ్డకు తల్లి. ఆ పాపకు కనీసం రెండేళ్లు అయినా పూర్తిగా దీపిక అవసరం ఉంటుంది. అందుకే ఇప్పుడు ఇలాంటి డిమాండ్ చేశారు. ఇందులో తప్పేం లేదు. ఆమె డిమాండుకు పూర్తి మద్దతు ఇస్తాను" అని అనన్య అన్నారు. కరీనా తల్లి అయిన తర్వాత ఇండస్ట్రీలో పాత ఆలోచనా ధోరణిని మార్చేశారని అనన్య అభిప్రాయపడ్డారు. ఆమె తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఇప్పుడు వస్తోన్న హీరోయిన్లకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నాయన్నారు. పరిశ్రమలో హీరోయిన్లు తమ వ్యక్తిగత జీవితానికి, వృత్తికి మధ్య సమతుల్యత పాటించేలా నిర్మాతలతో చర్చలు జరపడంలో తప్పులేదని అనన్య పేర్కొన్నారు. పనివేళల విషయంలో ఎటువంటి కఠినమైన నిబంధనలు ఉండకూడదన్నారు. దీపికాలాంటి స్టార్ హీరోయిన్ ఇలాంటి మార్పును డిమాండ్ చేయడం వల్ల భవిష్యత్తులో అందరికీ మేలు జరుగుతుందని అనన్య పేర్కొన్నారు.

### ఇదంతా చేసింది ట్రంపు
### జీవితం అయ్యింది కంపు

వరుస సినిమాలలో సందడి చేస్తున్నారు దర్శక, నటుడు తరుణ్ భాస్కర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'గాయపడ్డ సింహం'.

ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీ థీమ్ సాంగును శనివారం విడుదల చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల ఓ యువకుడి జీవితం ఎలా మారింది? ఎలాంటి ఇబ్బందులు పడాల్సి వచ్చింది? అన్న కథాంశంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగ జీవితాలను ప్రతిబింబించేలా సినిమాను తీర్చిదిద్దుతున్నట్టు తెలుస్తోంది. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.